www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి 27, సంచిక: 153 | మంగళవారం | 19-11-2024 | హైదరాబాద్ Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00










తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
మంగళవారం, నవంబరు 19

# రగులుతోన్న మణిపూర్

ఈశాన్య రాష్ట్రాల్లో ఒకటైన మణిపూర్‌లో సంవత్సరంన్నరగా రగులుతున్న జాతి వైషమ్యాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాశీనత, పక్షపాతం, అసమర్థతవల్ల గత పక్షం రోజులుగా మరింతగా నిజంగా జ్వలిస్తున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లపై దాడులు, దహనకాండ ఇందుకు పరాకాష్ట. అసంతృప్తితో రగులుతున్న ప్రజల ఆగ్రహావేశాలు ప్రజాప్రతినిధులపైకి మళ్లటం, జాతులమధ్య సామరస్య సాధనలో బిజెపి రాష్ట్ర ప్రభుత్వ నిష్క్రియాపరతకు, సంపూర్ణ వైఫల్యానికి నిలువుటద్దం. శాంతి–భద్రతల పరిరక్షణ నిమిత్తం భద్రతాదళాల మోహరింపును పెంచినా అగ్గి జ్వలిస్తూనే ఉంది. కాబట్టి మెజారిటీ మీతీ, మైనారిటీ గిరిజన జాతులమధ్య సంఘర్షణకు పరిష్కారం తుపాకుల్లోలేదని, వాస్తవ సమస్యలు, అపోహలు, అనుమానాల నివృత్తికి, అటువంటివి మళ్లీమళ్లీ తలెత్తకుండా గ్యారంటీలు కల్పించటానికి జాతులమధ్య చర్చలకు ప్రభుత్వం తీసుకునే చొరవ, నిష్పక్షపాత ధోరణిలో ఉంటుందని విదితమవుతుంది. డబుల్ ఇంజిన్ సర్కార్‌లతో దేశాన్ని ఉద్ధరించటానికి కంకణం కట్టుకున్నామని ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా చేస్తున్న ప్రచారంలోని డొల్లతనాన్ని మణిపూర్‌లోని వారి డబుల్ ఇంజిన్ సర్కార్ బట్టబయలు చేసింది. 2023 మే నెలలో జాతులమధ్య ఘర్షణనాటినుండి మణిపూర్ ప్రజలకు కనీసం ఓదార్పు మాటలు చెప్పేందుకైనా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సమయం దొరకలేదంటే ఈశాన్యం పట్ల వారి నిర్లక్ష్యానికి ఇంతకన్నా నిదర్శనం ఏమికావాలి? ఇప్పుడు మణిపూర్ శాంతి–భద్రతల వైఫల్యంతోపాటు రాజకీయ సంక్షోభం అంచున ఉంది. ఏడుగురు ఎమ్మెల్యేలతో బిజెపి ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న నేషనల్ పీపుల్స్ పార్టీ అధ్యక్షుడు, మేఘాలయ ముఖ్యమంత్రి కన్రాడ్ కె.సంగ్మా బిరేన్‌సింగ్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు బిజెపి అధ్యక్షుడు జె.పి.నడ్డాకు లేఖ రాశారు. సంక్షోభం నివారించటంలో, సాధారణ పరిస్థితుల పునరుద్ధరణలో బిరేన్‌సింగ్ నాయకత్వం పూర్తిగా విఫలమైనందున ఈ చర్య తీసుకున్నట్లు సంగ్మా తెలిపారు. 60మంది సభ్యులుగల మణిపూర్ అసెంబ్లీలో ఎన్‌డిఎకి ఇప్పటికీ 37మంది సభ్యుల తోడ్పాటు ఉన్నందున ప్రభుత్వానికి తక్షణ ప్రమాదం లేదు. కుకీలకు చెందిన 7గురు బిజెపి ఎమ్మెల్యేలు కూడా రాజీనామా దారిలో ఉన్నారని వార్తలు తెలుపుతున్నాయి. మణిపూర్‌లో పేరుకు ప్రభుత్వం ఉందిగాని పరిపాలన ఎప్పుడో పడకేసింది. మణిపూర్ సంక్షోభం కేవలం ఆ రాష్ట్రానికే పరిమితమైందికాదు. కుకి–జో తెగ గిరిజనులు పలు రాష్ట్రాల్లో ఉన్నారు. ఎంతో జాగ్రత్తగా, సున్నితంగా వ్యవహరిస్తూ జాతుల మధ్య సామరస్యం, సుహృద్భావం చెడకుండా సమస్యలు పరిష్కరించవలసిన ప్రభుత్వం, పాలక పార్టీ జాతులను విభజించే రాజకీయాలు చేస్తే పర్యవసానాలు దారుణంగా ఉంటాయని మణిపూర్ చెబుతోంది. జాతుల మధ్య ఆధిపత్యపోరు, సాయుధ తిరుగుబాట్లతో అట్టుడికిన ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి సాధనకు దాదాపు ఐదు దశాబ్దాలు పట్టింది. ఎంతో శ్రమించి నిర్మించిన భౌగోళిక, జాతుల, రాజకీయ ఐక్యతను పదిలం చేసుకోవాలి తప్ప భగ్నం చేసుకోరాదు.

ప్రస్తుత సమస్య మూలాన్ని గుర్తు చేసుకుందాం – తమకూ షెడ్యూల్డు తెగ ప్రతిపత్తి ఇవ్వాలన్న లోయప్రాంత మీతీల డిమాండ్‌ను హైకోర్టు సమర్థించటంతో కుకీల కడుపురగిలింది. ఇది తమ భూములు, ప్రత్యేక సదుపాయాలకు ప్రమాదంగా వారిలో భయాందోళన తిరుగుబాటుకు నాంది పలికింది. ఇళ్లు, చర్చీలు, ఆలయాలు దగ్ధమైనాయి. ఇరువైపులా ప్రాణనష్టం జరిగింది. కుకీలు కొండలకే పరిమితమైనారు. ఆ తీర్పును ప్రభుత్వం అంగీకరించబోదని, యథాస్థితికి కట్టుబడి ఉందని కేంద్ర ప్రభుత్వం అప్పుడే గట్టి హామీ ఇచ్చివుంటే ఈ సమస్య మొగ్గలోనే సమసిపోయే అవకాశం ఉండేది. సంక్షోభం, దాడులు కొనసాగుతున్నప్పుడు ప్రభుత్వాన్ని సస్పెండ్ చేసి రాష్ట్రపతి పాలన విధించి ఉన్నా ఉపశమనం కలిగేది. ప్రభుత్వ నిష్క్రియాపరత్వం వల్ల కొద్దిపాటి విరామాలతో హింసాయుత ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. నవంబర్ 22 నాటినుండి హింసాకాండలో కనీసం 20మంది చనిపోయారు. వారిలో 10మంది భద్రతా దళాల కాల్పుల్లో హతులైనారు. వారంనుంచి కనిపించకుండా పోయిన కుకీలకు చెందిన ముగ్గురు స్త్రీలు, ముగ్గురు చిన్నపిల్లల మృతదేహాలు బయటపడటంతో హింస పరాకాష్టకు చేరిం ది. ప్రభుత్వం అదనపు బలగాలను దించింది. సైనికీకరణ తాత్కాలిక ప్రశాంతత తెస్తుంది గాని సమస్యను పరిష్కరించదు. శాంతి స్థాపనకు, చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి కేంద్రప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి.

# ఆర్థికాభివృద్ధికి ప్రజాస్వామ్యం అవసరమా?



కెఎస్. చలం
7702200026

పదహారవ శతాబ్దంలో ప్రారంభమైన వలసవాదంతో చాలా దేశాలను పేదరికంలోకి నెట్టారు. దేశాల మధ్య అసమానతలు పెరిగాయి. అయితే కొన్ని దేశాలు తమ వ్యవస్థలను పటిష్టం చేసుకోవటం ద్వారా, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించుకోవటం ద్వారా పేదరికాన్ని అధిగమించి ఆర్థికాభివృద్ధిని సాధించాయి. ఈ ఏడాది అర్థశాస్త్ర నోబెల్ బహుమతి అసిమెగ్లూ, జాన్సన్‌రాబిన్‌సన్ బృందానికి ఇవ్వటంతో ప్రజాస్వామ్య వ్యవస్థకు గతంలో బూర్జువా ఆర్థిక శాస్త్రంలో చెప్పిన పెట్టుబడి సంచయం, పొదుపు రేటు పెంచి కేపిటల్ అవుట్‌పుట్ రేషియో అంటే మూలధన ఉత్పత్తి నిష్పత్తి ఆధారంగా జీడీపీని పెంచే గుణకంలో మార్పు అవసరమని ఈ ఏడాది నోబెల్ బహుమతి తెలియజేస్తోంది. నిజానికి కొంతకాలంగా పెట్టుబడిదారి దేశాల ఫైనాన్స్ రంగానికి పరిమితమైన నోబెల్ బహుమతులు గత ఏడాది గ్లాడియా గోల్డిన్ శ్రామికుల మార్కెట్ సంబంధాలను విశ్లేషించిన అంశాలకు ఇవ్వటం ద్వారా వారి ఆలోచనలలో మార్పును సూచిస్తుందా లేక పెట్టుబడిదారి దేశాల ఆర్థిక వ్యవస్థల నిర్వహణలోని సంక్షోభాన్ని తెలియజేస్తుందా అన్నది పరిశీలనార్హం.

అసిమెగ్లూ గ్రంథం 'వై నేషన్స్ ఫెయిల్' (దేశాలెందుకు విఫలమవుతున్నాయి)/2013లో ప్రచురించినపుడు పికెటి గ్రంథానికి వచ్చిన ప్రచారమే దీనికీ వచ్చింది. అందుకే ఈ ఏడాది పికెటి పేరు కూడా ఉంటుందని కొందరు ఆశించారు. గాని పెట్టుబడిదారి దేశాలను బహిరంగంగా విమర్శించే వారికి నోబెల్ వచ్చిన సంఘటనలు లేవు. ఇక అసిమెగ్లూ చెప్పిన సిద్ధాంతం ఏమిటంటే మెక్సికో నోగాలెస్ (అమెరికా) రెండు మహా నగరాల కథను వివరించటం ద్వారా ఈ దేశాలను వేరుచేసే ఇనప కంచెతో ప్రారంభమవుతుంది. ఒకవైపు మెక్సికో, యింకోవైపు అమెరి కా దేశాల్లోని ప్రజల సగటు ఆదాయం, సగటు జీవితం, ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని అయోమయంలో ఉండటానికి ప్రధాన కారణం ఒక దేశంలో ప్రజాస్వామ్య విలువలు కాపాడి, వ్యక్తి ఆస్తికి రక్షణ, రూల్ ఆఫ్ లా, కొన్ని నిబంధనల కనుగుణంగా కొన్ని వ్యవస్థలు నిర్మించటం ద్వారా సాధ్యపడింది. అంటే గతంలో చెప్పిన పెట్టుబడి, టెక్నాలజీ వంటి వాటికి ప్రాధాన్యం కంటే వ్యవస్థలను ముఖ్యంగా ప్రజాస్వామిక వ్యవస్థలను, ప్రజలు పాల్గొనే అంటే కలుపుకొనే ఇంక్లూజివ్ వ్యవస్థల నిర్మాణంతో అభివృద్ధి సాధ్యమవుతుంది అని ప్రాథమికంగా నిర్ధారించే పరిశోధనకు నోబెల్ బహుమతి లభించింది. ఒక దేశంలోని జిడిపి ఎక్కువగాను ఇంకోదేశంలో తక్కువగాను, అవినీతి రాజకీయ నాయకులను మార్చలేని నిస్సహాయత వంటి అవలక్షణాల మూలంగా అభివృద్ధి కుంటుబడింది అన్నారు. వీరు చెప్పిన పరిశోధన అంశాల్లో వలసవాద దశలో యూరప్ దేశాలు చాలా దేశాల్లో కొన్ని వ్యవస్థలను నిర్మించారు.

పెద్ద జనాభా గల దేశాలు తిరుగుబాటుకు ఆస్కారం ఉన్నవాటి కంటే తక్కువ డబ్బు లేదా వేతనంతో లభించే శ్రామికులున్న దేశాల వైపు వలసవాదులు ప్రయాణించారు. ఆ దేశాల్లో ఒక శిష్ట వర్గాన్ని అభివృద్ధిచేసి ఆర్థికంగా ప్రజల నుంచి పిండే వ్యవస్థల ద్వారా వీరికి లభించేలాగ, అక్కడ ఎక్కువ జనాభాకు నష్టం కలిగించారు. అయితే మరికొన్ని వలస దేశాల్లో ఎక్కువమంది వలసవాదులు ప్రవేశించి కొన్ని వ్యవస్థలను నిర్మించటం ద్వారా ప్రజల నుంచి ప్రజాస్వామ్య హక్కుల కోసం వారి లాభాల్లో వాటాకోసం జరిగిన ఘర్షణల్లో కొన్ని రాజకీయపరమైన హక్కులు ఇవ్వటం ద్వారా సంపద పెంచటానికి అవకాశం ఏర్పడింది. అదే స్పానిష్ కాలనీగా ఉన్న మెక్సికో, అమెరికా మధ్య గల తేడా. ఇక్కడ ఫ్రెంచ్, బ్రిటీష్, పోర్చుగీస్ తదితర దేశాల వలసవాదులు ఉన్నారు. ఇది అక్కడ పారిశ్రామిక విప్లవం ద్వారా, భారతదేశం అప్పటికి అమెరికా కంటే ఆర్థికంగా ముందే ఉంది. అయితే సాంకేతికంగా వచ్చిన మార్పులు, ఎక్కడయితే వ్యవస్థలు బాగా అభివృద్ధి చెందాయో అక్కడ ఎక్కువగా ఫలితాలనిచ్చాయి. అప్పట్లో వలసవాదులు తెచ్చిన జబ్బులు మూలంగా భూమధ్య రేఖకు దగ్గరగా ఉన్న ఆఫ్రికా, భారతదేశం వంటి దేశాల్లో ఎక్కువ మానవ హరణం జరిగింది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఎక్కువగా మరణాలు జరగలేదు. ఎక్కడయితే వ్యవస్థలు బలంగాలేక అవినీతి, విశృంఖలత్వం, రూల్ ఆఫ్ లా లేకుండా ఉన్నాయో అక్కడ పేదరికం పెరిగింది. ఎక్కడయితే రాజకీయ ఉన్నతి వర్గం తాలూకా విశ్వసనీయత సన్నగిల్లిందో అక్కడ ప్రజలు నాయకత్వాన్ని మార్చుకున్నారు. అందుకే రాజకీయ నాయకులు ప్రజలను నమ్మలేదు. అక్కడ ప్రజలను పీల్చే వ్యవస్థలు, పేదరికం పెంచే పరిస్థితులు వచ్చాయి. ఎక్కడైతే



ప్రజల్లో చైతన్యం పెరిగి మార్పువైపు ప్రజా విప్లవం వచ్చే పరిస్థితులున్నాయో అక్కడ ప్రజలకు ఆర్థిక రాయితీలు ఇచ్చి కొంతకాలం అధికారం నిలబెట్టుకుంటారు. ఇక్కడ యీ శిష్ట వర్గం (దోపిడి అని వాడలేదు)కు, అనిశ్చిత గందరగోళంకు కారణం ప్రజల నుంచి వచ్చే తిరుగుబాటు వ్యతిరేకత, ప్రజలు వీరు చెప్పే వాగ్దానాలను నమ్మకపోవటం. ఎందుకంటే మళ్లీ పాత పద్ధతులు పునరావృతమవుతాయని. అటువంటి సందర్భంలోనే ప్రజలకు అధికారం అప్పజెప్పటం జరుగుతుంది. అప్పుడు ప్రజాస్వామ్యమే అవసరమవుతుంది. మొత్తం పశ్చిమ దేశాల్లో జరిగిన ప్రజాస్వామ్యీకరణ ఈ విధంగానే జరిగింది. అది 1918లో మొదటిసారి స్వీడన్‌లో ప్రారంభమయింది. సోవియట్ యూనియన్‌లో కూడా జరిగింది. వీరు తమ పరిశోధనల ద్వారా వలసవాదకాలంలో నెలకొల్పిన పీడించే వ్యవస్థలను మార్చటం అంతసులభం కాదు. వ్యవస్థల ప్రజాస్వామ్యీకరించటం ద్వారా సంపద పెంచటం, పంపిణీ, ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుంది అన్నా రు. ఈ ముగ్గురూ చాలాకాలంగా చేస్తున్న పరిశోధనల ఫలితాలు చాలా పుస్తకాలు, పరిశోధన పత్రాల్లో రాశారు. చర్చ జరిగింది. ఇంకా కొనసాగుతుంది.

అసిమెగ్లూ బృందం చెప్పిన సిద్ధాంతాలను పరిశోధన ఫలితాలను అందరూ అంగీకరించలేదు. హార్వర్డ్ యూనివర్శిటీకి చెందిన ఎడ్వర్డ్ గ్లయిసర్ బృందం తమ పరిశోధనలలో వీరు చెప్పిన ఫలితాలకు భిన్నమైన వాదనలు వినిపించారు. వారిలాగే ఆర్థిక గణాంకాలు, పద్ధతులు వాడి ఈ ఆర్థిక పెరుగుదలకు కారణం ప్రజాస్వామ్య వ్యవస్థలు కాదు, మానవ పెట్టుబడి, టెక్నాలజీ పెరుగుదల మూలంగా వచ్చినదే. ఎక్కడయితే ఆర్థిక అభివృద్ధి ఉందో అక్కడ ప్రజాస్వామ్య వ్యవస్థలు బలంగా ఉన్నాయి. దీని మూలంగా అవి ఉన్నాయిగాని వ్యవస్థల మూలంగా ఇవి రాలేదు అన్నారు. అదే విధంగా మార్క్సిస్టులు కూడా వీరి పరిశోధనలను పూర్తిగా అంగీకరించలేదు. గతంలో వామపక్ష పరిశోధకులు చెప్పిన దానికి వీరు చెప్పిన దానికి ప్రజాస్వామ్య బదలాయింపులో తేడాలేదు. అయితే అది ప్రజాస్వామ్య సిద్ధాంతాల మూలంగా ప్రజలు సోషలిజం వైపు వెళ్లకుండా శిష్ట వర్గం ప్రజలకు రాయితీలు ఇచ్చి కాపాడుకుంటుంది తప్ప కొత్తేమీ కాదు. ఈ సందర్భంగా హ్యూగోచావేజ్ ఉదాహరణ చెప్పారు. వీరు చెప్పిన పరిష్కారం లాటిన్ అమెరికా దేశాల్లో విఫలమయింది గదా! అక్కడ మార్తహార్నేకర్ వంటి వారు చెప్పేది ఏమిటంటే శ్రామిక వర్గం పేదరికం నుంచి, కష్టాల నుంచి బయటపడాలంటే చాలా డబ్బు సామాజిక అభివృద్ధి ప్రాజెక్టులపై ఖర్చు చేయవలసి వస్తుంది. అది చాలా తీవ్రమైన పరిణామాలకు దారితీయవచ్చు. అందుకే ప్రజల నమ్మకం పొందటానికి ఈ దేశాల్లో చిన్న చిన్న సామ్యవాద ప్రాజెక్టుల ద్వారా పరిస్థితులను మార్చి ఇప్పుడున్న పరిస్థితులను మార్చటానికి ప్రయత్నించాలి అని. బ్రెజిల్‌లో తొలి ప్రభుత్వం చేసిన ఆర్థిక ప్రయోగాలు చివరకు బడా కాంట్రాక్టర్ల అధీనంలోకి వెళ్లి వారిపై ఆధారపడి రాజకీయాలు నడిపే స్థితికి వచ్చింది. అందుకే ప్రజాస్వామ్యం, పెట్టుబడిదారీవ్యవస్థ లాటిన్ అమెరికాలో పేదరికం, అసమానతలు తగ్గించలేకపోయింది. వెనుజులాలో ప్రజాస్వామ్యాన్ని పట్టుకొని క్రూడ్ ద్వారా వచ్చే ఆదాయాన్ని మార్కెట్ ఆధారితంగా వేతనాలు పెంచటం ద్వారా సాధ్యపడుతుందా, లేక ప్రజలకు రాజకీయ అధికారం ఇవ్వటం ద్వారా ప్రజా కౌన్సిల్‌లు ఏర్పాటు చేసి అధికార వికేంద్రీకరణతో ప్రజలకు ఎక్కువ అధికార బదిలీ చేయటం ద్వారా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యమా లేక వామపక్ష ప్రొలిటేరియన్నా? నిరంకుశత్వమా అన్నది ప్రశ్నార్థకమయింది. చావెజ్ చివరకు మార్పులు కోరుతూ రాజ్యాంగం సవరణలో 2008లో ఓటమి పాలయ్యాడు. ఈ ప్రయోగంలో ఆ దేశంలో పేదరికం బాగా పెరిగింది. మిలిటరీలో పనిచేసి రిటైరయిన ఆఫీసర్లను 26శాతం ప్రభుత్వంలో చేర్చుకున్నాడు. ఘర్షణలు పెరిగాయి. ప్రభుత్వంలో రెండు సమూహాలు ఏర్పడ్డాయి. సంక్షోభం పెరిగింది. అంటే మిలిటరీ మోడల్ పనిచేయలేదు. 2013లో చావెజ్ మరణానంతరం అధికారంలోకి వచ్చిన మదురో ఎన్నిక లు నిర్వహించాడు. 2024 జూలైలో ఏర్పడ్డ ప్రభుత్వంను ప్రతిపక్షం అంగీకరించలేదు. అమెరికా ఆంక్షలు విధించింది. సంక్షోభంలో వెనిజులా ఉంది. ఈ వివరాల మూలంగా అర్థమవుతున్నది కొంతమంది పరిశీలకుల ప్రకారం, ప్రజాస్వామ్యాన్ని ఇప్పుడు తీవ్రంగానే పరిగణించి సోషలిజం సాధించటానికి ఎలా వాడుకోవా లో ప్రయత్నించాలి. అయితే సమస్య ఏమిటంటే వామపక్ష గుర్తింపు దానికి ఉండదు. ఇది జటిలమైన అంశం. చర్చ జరగాలి. ఇదే సందర్భంలో రాహుల్‌గాంధీ సూచించిన ఒక ప్రతిపాదన ఇటీవల వ్యాసం గా ప్రచారమయ్యింది. అది ఏమిటంటే 'భారతదేశంలోని బడా పెట్టుబడిదార్లు చిన్న పరిశ్రమలను దెబ్బతీశారు. ఆర్థికస్థితి కోలుకోలేని దశకు చేరుకుంది. వారంతా అంటే ఎమ్.ఎస్.ఎమ్.ఇ పరిశ్రమలు గుత్తాధిపత్య అధీనంలో నడిచే స్థితికి చేరుకున్నాయి. సంపద సృష్టించినా అది పంపిణీ జరగకుండా కొద్దిమంది వ్యాపార కుటుంబాలకు చేరేలా ఇప్పటి ప్రభుత్వం చేస్తోంది'. ఈ పరిస్థితి మారాలంటే ప్రజాస్వామ్యయుతంగా అందరికీ అవకాశాలు వచ్చేలా చేయాలి. అందరి కీ వ్యాపార నిర్వహణకు ప్రజాస్వామ్యబద్ధంగా అవకాశాలు కల్పించాలి. ఉద్యోగ అవకాశాలు కల్పించాలి అని అసిమెగ్లూ లాంటి వారు సూచన చేశారు. విభిన్న రాజకీయ, సాంస్కృతిక వైవిధ్యం ఉన్న దేశంలో ఆర్థిక విధానాల్లో ప్రజాస్వామ్యం సాధ్యమా, అది ఎలా సాధించాలి అన్న దానిపై ప్రజాస్వామ్యవాదులంతా చర్చించి ఇప్పుడు ఉన్న గుత్త పెట్టుబడిదారీ రాజకీయాలను మార్చటానికి ప్రయత్నించాలి.

## పేదరిక నిర్మూలనకే
# ఇందిరా గాంధీ '20 సూత్రాల పథకం'



నవంబర్ 19, ఇందిరాగాంధీ 105వ జయంతి

భారతదేశంలో మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రి,1966 నుండి1977 వరకు వరుసగా 3 పర్యాయాలు, మళ్ళీ 1980లో ప్రధానమంత్రిగా పనిచేసి 'ఐరన్ లేడీ ఆఫ్ ఇండియా'గా పిలువబడిన ప్రజా నాయకురాలు శ్రీమతి ఇందిరా గాంధీ. 1917 నవంబర్ 19న జన్మించిన ఇందిరాగాంధీ, భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఏకైక కుమార్తె. అసలు పేరు ఇందిరా ప్రియదర్శిని గాంధీ. జవహర్ లాల్ నెహ్రూ, కమలా నెహ్రూ ల ఏకైక సంతానం. ఆమె ఉత్తర ప్రదేశ్‌లోని అలహాబాదులో ఆనంద్ భవన్‌లో జన్మించింది. తన తాత మోతిలాల్ నెహ్రూ అలహాబాదులో పేరుపొందిన న్యాయవాది. ఇందిరా గాంధీ పుట్టేసరికి భారతదేశం ఆంగ్లేయుల పాలనలో ఉంది. దేశం ఆర్థికంగా, సామాజికంగా అల్లకల్లోలంగా ఉండేది. ఇందిరాగాంధీ అలహాబాదులో ప్రాథమిక విద్యాభ్యాసం అనంతరం, పూణే విశ్వవిద్యాల యం నుండి మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణురాలు అయింది. రవీంద్రనాథ్ ఠాగూర్ స్థాపించిన శాంతినికేతన్‌లో చేరి క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడిపింది. జాతీయోద్యమం లో భాగంగా జవహర్‌లాల్ నెహ్రూ, కమలా నెహ్రూ తరచుగా జైలుకు వెళ్లడం వల్ల, తన తల్లి కమలా నెహ్రూ ఆరోగ్యం క్షీణించింది. చికిత్స నిమిత్తం వెళ్లిన తర్వాత అక్కడే తల్లికి తోడుగా ఉంటూ ఒక స్కూల్లో చేరింది. ఎంత చికిత్స చేసినా తల్లి ఆరోగ్యం కుదుట పడకపోవడం వల్ల తమ 17వ ఏటనే కమలా నెహ్రూ మరణించ డంతో ఇందిరాగాంధీ ఒంటరి అయింది. తల్లి మరణం తర్వాత ఒంటరిగా ఉన్న ఇందిరకు నెహ్రూ మనోధైర్యాన్ని ఇస్తూ, నాయకత్వ లక్షణాలు నూరిపోసే వారు. పై చదువుల నిమిత్తం ఇంగ్లాండ్ లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో చేర్పించాడు. ఆమె చదువుతున్న రోజుల్లో జర్నలిస్టు అయిన ఫిరోజ్ గాంధీతో పరిచయం ఏర్పడి వివాహానికి దారితీసింది. కానీ వారిద్దరి వివాహానికి నెహ్రూ ఇష్టపడలేదు, చివరగా మహాత్మాగాంధీ సలహా మేరకు 1942లో ఇందిర,ఫిరోజ్ ల వివాహం జరిగింది. స్వాతంత్ర పోరాటంలో సైతం పాల్గొంటూ తండ్రికి తగ్గ కూతురుగా ఉద్యమంలో ధైర్యంగా పాల్గొనేది.

1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనడం వల్ల పోలీసులు ఆమెను అరెస్టు చేసి జైలుకు పంపారు. జైల్లో ఉండగానే మగ పిల్లవాడికి జన్మనిచ్చింది. 1943 మే 13న విడుదలైన ఇందిరా తన కుమారుడికి రాహుల్ గాంధీ అని పేరు పెట్టింది. ఇందిరాగాంధీ ఎన్నో సంవత్సరాల పాటు నెహ్రూ వెనుకనే ఉంటూ అనుకోకుండా రాజకీయరంగ ప్రవేశం చేసింది. ఆమె సేవలకు గుర్తింపుగా 1959లో భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షురాలు అయింది. ఆ తర్వాత జరిగిన పరిణామంలో నెహ్రూ మరణానంతరం, లాల్ బహదూర్ శాస్త్రి మంత్రివర్గంలో సమాచార ప్రసార శాఖ మంత్రిగా కేబినెట్ హోదాలో పనిచేసి అందరి మన్ననలు పొందారు. తర్వాత 1962 జనవరి24న మొట్టమొదటిసారిగా ప్రధానమంత్రిగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. మొదటి మహిళా ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన ఆమె రికార్డ్ సృష్టించింది. ప్రపంచ నేతలతో మంచి గుర్తింపు పొందుతూ, అందరి దృష్టిని ఆకర్షించేది. ప్రపంచ బ్యాంకు, పశ్చిమ దేశాల సహకారంతో దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దే ప్రయత్నం చేసింది. కొందరు నేతలు రెండోసారి ప్రధానిగా ఒప్పుకోని సమయంలో 'గరీబీ హటావో' నినాదంతో నలభై మూడు రోజులపాటు దేశమంతటా పర్యటిస్తూ 300సభలు, 36 వేల మైళ్లు పర్యటన చేసి ప్రజల దృష్టిలో గొప్ప నాయకురాలుగా పేరు సంపాదించుకుంది. సొంత పార్టీలో, బయటి మిత వాదులు, అభివృద్ధి నిరోధక శక్తులపై తీవ్ర పోరాటం చేశారు. ఆమె పరిపాలన కాలంలో రైల్వే కార్మికులు, ఉద్యోగులు సమ్మెచేసి ప్రభుత్వాన్ని స్థంభింప చేసినప్పు డు, వారిపై చర్యలు తీసుకుంటూ ఉద్యోగాలు తొలగించినప్పుడు వారి ఆగ్రహానికి గురికావడం, వారు కోర్టు ద్వారా మళ్లీ ఉద్యోగాలు పొందడం జరిగింది. ఆ తర్వాత 1977 ఎన్నికల్లో, ఓటు ద్వారా ఇందిరాగాంధీ ప్రభుత్వాన్ని ఓడించడం జరిగింది. అలాగే 1971లో అమేథీ లోక్ సభ నియోజకవర్గం నుండి రాజ్ నారాయణ పై గెలిచిన సందర్భంలో ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని ప్రతిపక్షాలు కోర్టులో సవాల్ చేసిన క్రమంలో 1975లో అలహాబాద్ కోర్టు ఆమె ఎన్నిక చెల్లదని, 6 సంవత్సరాలపాటు ఎన్నికల్లో పాల్గొనరాదని కోర్టు తీర్పునిచ్చింది. కానీ దానిపై స్టే ఆర్డర్ తెచ్చుకుంది. కానీ ప్రతిపక్షాలు ఇందిరా గాంధీకి వ్యతిరేకంగా పెద్ద ర్యాలీ నిర్వహించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించారు. అప్పుడు రాజ్యాంగంలోని 352 ఆర్టికల్ ప్రకారం 1975 జూన్ 25 న రాష్ట్రపతి ఎమర్జెన్సీ విధించారు. భారతదేశంలో పంచవర్ష ప్రణాళికలతో దేశాన్ని అభివృద్ధి చేయాలని తమ తండ్రి ఆకాంక్ష మేరకు పేదరిక నిర్మూలన కోసం 20 సూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టి దేశ ఆర్థిక పరిస్థితిని చక్క పెట్టే ప్రయత్నం చేశారు. రాజకీయాల్లో ఆమెకు కుమారులు రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీలు అండగా నిలిచారు.

ప్రజా సంక్షేమం కోసం ప్రణాళికలు రూపొందించుకుని దేశ ప్రజల కోసం స్వపరిపాలన అందించిన గొప్ప నేత. ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ఇందిరాగాంధీని 1984 అక్టోబర్ 31న ఆమె అంగరక్షకులే కాల్చిచంపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కూడా ఇందిరాగాంధీ పరిపాలన ఆమె ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు గుర్తు చేసుకుంటారు. తెలంగాణలో మహిళా సంఘాలకు ఇందిరా మహిళా శక్తి భవనాలను నిర్మించనున్నారు. ఇందిరమ్మ రాజ్యం తీసుకు వస్తామని పలుమార్లు ముఖ్య మంత్రి, మంత్రులు వివిధ సందర్భాలలో అంటున్నారు.

కామిడి సతీష్ రెడ్డి,
జయశంకర్ భూపాలపల్లి జిల్లా

# ఢిల్లీలో డేంజర్ బెల్స్



దేశ రాజధానిలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 500 దాటింది. ప్రపంచం లో నివాసయోగ్యం కాని నగరాలు ఏదైనా ఉన్నదా అంటే దానికి సమాధానం ఢిల్లీ అని చెప్పవచ్చు. గత ఎనిమిది సంవత్సరాలుగా ఇదే పరిస్థితి. ఢిల్లీ, యుపి, హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో పంటలు తగలబెట్టడం వలన అలాగే పరిశ్రమల నుంచి వెలువడుతున్న విష వాయువుల వల్ల విపరీతమైన దుస్థితి ఏర్పడింది. ఈ పాపం నాది కాదు అంటే నాది కాదని రాష్ట్రాలు ఒకరి మీద ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు.

దేశ రాజధాని నగరం ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకు క్షీణిస్తోం ది. వాయు కాలుష్యం స్థాయిలు పెరగడంపై ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ (సిఎక్యూఎం) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే పలు ఆంక్షలు విధించగా, తాజాగా మరిన్ని కఠిన ఆంక్షలు అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో ఢిల్లీఎన్‌సిఆర్ పరిధిలో 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ)4' కింద మరిన్ని నిబంధనలను సోమవారం నుంచి అమలు చేయనున్నట్లు తెలిపింది. ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ రాత్రి 7 గంటల సమయానికి 457కి పెరగడం గమనా ర్హం. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఢిల్లీలోని పాఠశాలల్లో కేవలం ఆన్‌లైన్ తరగతులే నిర్వహించనున్నట్టు సిఎం ఆతిశీ ప్రకటించారు. ఢిల్లీలో నిత్యావసర వస్తువులు, సర్వీసులు అందించే ట్రక్కులు మినహా అన్ని ట్రాన్స్‌పోర్ట్ వాహనాల ప్రవేశాన్ని నిలిపివేయాలని సిఎక్యూఎం ఆదేశించింది. ఎల్‌ఎన్‌జీ, సిఎన్‌జి, ఎలక్ట్రిక్, బిఎస్4 డీజిల్ ట్రక్కులు మాత్రమే అనుమతించింది. ఢిల్లీ వెలుపల రిజిస్ట్రేషన్‌తో ఉన్న తేలికపాటి కమర్షియల్ వెహికల్స్ ప్రవేశంపై నిషేధం. ఢిల్లీ రిజిస్ట్రేషన్‌తో ఉన్నప్పటికీ బిఎస్4 అంతకన్నా పాత డీజిల్ రవాణా వాహనాల ప్రవేశంపై నిషేధిస్తున్నట్టు ప్రకటించింది.

ఢిల్లీలో ప్రమాద ఘంటికలు మోగిస్తున్న వాయు కాలుష్యం శుక్రవారం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 456, అలాగే రెస్పిరబుల్ పార్టీకులేట్ మ్యాటర్ 525, నైట్రోజన్ డయాక్సైడ్ 36, సల్ఫర్ డయాక్సైడ్15, ఓజోన్ 75, కార్బన్ మోనాక్సైడ్ 24 గా ఉంది. మరికొద్ది రోజులు సైతం ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది. గాలి నాణ్యత క్షీణిస్తున్న నేపథ్యంలో ప్రజలు ముఖ్యం గా వయోజనులు, పిల్లల విషయం లో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. శ్వాసకోశ సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఢిల్లీ సహా పరిసర ప్రాంత ప్రజలు గడపదాటి బయటకు రావాలంటే మాస్కు ధరించక తప్పని పరిస్థితి నెలకొంది. ఇందుకు కారణం కరోనా కొత్త వేవ్ కాదు. కోరలు చాచిన వాయు కాలుష్యం ఈ దుస్థితిని తీసుకొచ్చింది. చలికా లం వచ్చిందంటే చాలు ఢిల్లీలో పీల్చే గాలి విషంగా మారుతుంది. రుతుపవనాల తిరోగమనం అనంతరం ఉత్తరాదిన ఏర్పడే ప్రత్యేక వాతావరణ పరిస్థితులు ఒక కారణమైతే మానవ తప్పిదాలు ఈ వాయు కాలుష్యం స్థాయులను మరింత పెంచి పీల్చేగాలిని విషతుల్యం చేస్తున్నాయి. ఢిల్లీ నగరంలోని వాహన ఉద్గారాలకు తోడు పొరుగు రాష్ట్రాలు పంజాబ్, హర్యానాలో రైతులు పంట వ్యర్థాలను కాల్చడం వల్ల ఏర్పడే పొగ శీతాకాలంలో సహజసిద్ధంగా ఏర్పడే పొగమంచులో కలిసిపోయి ఊపిరి పీల్చుకోలేని ఉక్కిరిబిక్కిరి పరిస్థితిని సృష్టిస్తున్నాయి. భవన నిర్మాణ పనుల కారణంగా ఏర్పడే దుమ్ము, ధూళి అన్నీ కలగలిపి గాలి నాణ్యత దారుణంగా దెబ్బతీస్తున్నాయి. పొల్యూషన్ మానిటరింగ్ మెకానిజం లేక, ప్రజలకు కాలుష్యం దుష్ప్రభావాలు తెలియక తీవ్ర సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు.

ప్రభుత్వాలు అవలంబిస్తున్న పారిశ్రామిక, సాంకేతిక విధానాలు ప్రకృతి విధ్వంసానికి కారణాలు అవుతున్నాయి. ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్ డయాక్సైడ్, ఆర్గాన్ మరియు నీటి ఆవిరి సమతుల్యంగా ఉంటేనే వన్యప్రాణి, వ్యవసాయానికి, మానవుని అభివృద్ధికి తోడ్పడుతుంది. వాయువులు, కణాలు, జీవ అణువులతో సహా హానికరమైన లేదా అధిక పరిమాణంలో ఉన్న పదార్థాలను భూమి యొక్క వాతావరణంలో ప్రవేశపెట్టినప్పుడు వాయుకాలుష్యం సంభవిస్తుంది. ఇది మానవులకు వ్యాధులు, అలెర్జీలు, మరణానికి కారణం కావచ్చు; ఇది జంతువులు, ఆహార పంటలు వంటి ఇతర జీవులకు కూడా హాని కలిగించవచ్చు మరియు సహజమైన లేదా నిర్మించిన వాతావరణాన్ని దెబ్బతీస్తుంది. మానవ కార్యకలాపాలు, సహజ ప్రక్రియలు రెండు వాయు కాలుష్యాన్ని సృష్టించగలవు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం, వాయు కాలుష్యం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఏటా 8 మిలియన్ల మంది మరణాలకు కారణమైంది. పరిశ్రమలు, రవాణా మొదలైన ప్రజల కార్యకలాపాల ద్వారా తయారైన విష పదార్థాలు సమాజాన్ని చుట్టే గాలిని కలుషితం చేస్తాయి. ఆటోమొబై ల్ పెట్రోలియం వాహనాల ద్వారా ఎగ్జాస్ట్ గ్యాస్ వంటి సల్ఫర్ వాయువులో ఉండే నత్రజని ఆక్సైడ్లు. కాలుష్యం ప్రజల ఆరోగ్యాన్ని, ఆస్తిని, జంతువులు మొక్కలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది, సహజ పరిస్థితులు, క్షీణత, శ్వాసకోశ వ్యాధులు వంటి శ్వాసకోశ వ్యాధులు, శ్వాసనాళ ఆస్తమా వంటి వివిధ వ్యాధుల ప్రేరణ. కరోనా పారద్రోలడానికి యజ్ఞాలు, యాగాలు, లైట్లు ఆర్పి కొవ్వొత్తి వెలిగించి, చప్పట్లు కొట్టి వైరస్‌ని నియంత్రించవచ్చు,కాషాయాలు త్రాగి స్వస్థత చేకూర్చుమని ప్రజలకు సలహాలిస్తున్న దేశంలో ఆర్థిక పరిస్థితి బాగుండాలంటే లక్ష్మీ దేవి ఫోటో పెడితే ఆర్థికరంగం పరిగెడుతుందన్న మేధావులున్న దేశంలో కాలుష్య సమస్యకు పరిష్కారం దొరక్కపోదు.

డా ఎం. అఖిల మిత్ర, 9949262231

# మైనర్లు చేస్తున్న మేజర్ మిస్టేక్స్

ఒక దశాబ్దకాలం ముందర అత్యాచారాలు, దొంగతనాలు, ర్యాగింగా లాంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాల్లో మేజర్స్ అంటే పద్దెనిమిది ఏళ్లు దాటిన వారే ఉండేవారు. కాని గత ఐదారు సంవత్సరాలలో చూస్తే ఇటువంటి ప్రమాదకరమైన పనులలో మైనర్లు కూడా పట్టుబడుతున్నారు. వీరిలో పదిహేను నుండి పద్దెనిమిది ఏళ్ల లోపు వారు ఎక్కువగా ఉంటున్నారు. మైనర్లు ఎక్కువగా యెటువంటి తప్పులు చేస్తున్నారు ? కారణం ఏమిటి?

సాధారణంగా పద్దెనిమిది సంవత్సరాలులోపు ఉన్నవారిని మైనర్లుగా పిలుస్తారు. వీరిలో చదువుకున్నవారు లేదా ఏ విద్యాభ్యాసం లేని వారు కూడా ఉంటారు. పాఠశాల లేదా కళాశాల స్థాయిలో ఎదుటి వారికి ఇబ్బంది కలిగించకుండా చేసే అల్లరి పరవాలేదు. కాని శృతిమించిన అల్లరి ప్రమాదకరం. కళాశాలలో స్నేహభావంతో ఉండాల్సిన సహచర ఆడపిల్లలను అబ్బాయిలు టీజింగ్ చేస్తున్నారు. తోటి విద్యార్థులతో గొడవలు పడుతున్నారు. అబ్బాయిలతోపాటు, అమ్మాయిలు కూడా వారి జూనియర్లను ర్యాగింగ్ చేస్తున్నారు. ఇది అక్కడితో ఆగకుండా బయట కూడా ఇటువంటివి చేస్తున్నారు. బాయ్ ఫ్రెండ్ లేదా గర్ల్ ఫ్రెండ్ కలిగి ఉండడం ఒక ఫ్యాషన్ అయిపోయింది. ఫ్యాషన్, స్టైల్, వినోదానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. చూడడానికి ఈ పొరపాట్లు చిన్న విషయాలుగా కనిపించవచ్చు. కానీ క్రమంగా వారి భవిష్యత్తు విద్యా పనితీరును ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. స్నేహం ముసుగులో సమాజహితం కాని కొన్ని పనులు చేస్తున్నారు. అబ్బాయిలు ప్రేమలు అని అమ్మాయిలు వెంటబడుతున్నారు. కాదంటే పైశాచికంగా ప్రవర్తిస్తున్నారు. ఇంకా మించితే వారిపై దాడి చేయడమో ప్రాణాలు తీయడమో లేదా ప్రాణాలు తీసుకోవడమో చేస్తున్నారు. చాలా మంది వ్యసనాలకు బానిసలు అవుతున్నారు. ఇది అక్కడితో ఆగకుండా అక్రమంగా వీటిని విక్రయించడం, సరఫరా చేయడం వంటి పనులుచేసి వ్యక్తిగతంగా వారి జీవితాలను పాడు చేసుకుంటున్నారు. ఈ వయసులో చూడకూడని పోర్న్ సైట్లు వీక్షిస్తున్నారు. ఇంకా కొంతమంది తెలిసో తెలియకో మనకు తెలియదు గాని ఆన్లైన్లో గేమింగ్, బెట్టింగ్లకు అలవాటు పడుతున్నారు. దీనికోసం డబ్బును తగలబెడుతున్నారు. పెట్టుబడికై ఆన్లైన్లోనే రుణాలు తీసుకుంటున్నారు. అవి తీర్చలేక, తల్లిదండ్రులతో చెప్పలేక రుణాలిచ్చేవారి టార్చర్ తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

**పరిష్కారాలు:** మనం అవునన్నా కాదన్నా యువతలో కొందరు చేస్తున్న ఆకృత్యాలకు బాధ్యత వహించాల్సిన వ్యవస్థలు మూడు ఉన్నాయి. అవి కుటుంబం, సమాజం, పాఠశాల. ఒక వ్యక్తిపై ఈ మూడింటి ప్రభావం ఎక్కువ. కుటుంబాలలో తల్లిదండ్రులు వారి మైనర్ పిల్లలకు అనవసరంగా మొబైల్ ఫోన్స్ ఇవ్వకూడదు. అవసరార్థం ఇచ్చినకూడా వారిపై నిఘావేయాలి. ఎట్టి పరిస్థితుల్లో కూడా మోటార్ వాహనాలను నడపనీయరాదు. ఏది మంచో ఏది చెడో ఇంట్లో పెద్దలు చెప్పాలి. సమాజంలో పౌరులు ఎవరు ఎలా పోతే మాకేంటి అనే ధోరణను విడనాడాలి. పిల్లల తల్లిదండ్రుల దృష్టికి పిల్లల చేస్తున్న తప్పులను తీసుకువెళ్ళాలి. యూట్యూబ్లలో వచ్చే చిత్రాలపై కూడా సెన్సార్ ఉండాలి. ప్రభుత్వ పాఠశాలలో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారు. కానీ ర్యాంకులకే పరిమితమైన ప్రైవేటు పాఠశాలలో ఐఐటిలో ఇంజనీరింగ్ లేదా ఎయిమ్స్ లో వైద్యులుగా తయారు చేయడానికి కేవలం గణితం, సైన్స్ సబ్జెక్ట మీదనే బోధన కొనసాగిస్తున్నారు. నైతిక విలువలను బోధించడం లేదు. ఇక్కడ కూడా విలువలు నేర్పే ఇతర పాఠ్యాంశాల మీద కూడా శ్రద్ధ వహించాలి. ఈ బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలి. అప్పుడే మంచి సమాజాన్ని తయారు చేయగలం.

డిజెఎంఆర్, 8247045230

మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 153 | మంగళవారం | 19-11-2024 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00


### 28 వరకు భుజంగరావు బెయిలు పొడిగింపు

ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితుడు అదనపు మాజీ ఎస్‌పి ఎన్. భుజంగరావుకు 28వ తేదీ వరకు హైకోర్టు బెయిల్‌ను పొడిగించింది. అనారోగ్య కారణాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు గతంలోని మధ్యంతర బెయిలు ఉత్తర్వులను పొడిగించింది. బెయిల్ పొడిగింపునకు నాంపల్లి కోర్టు నిరాకరించడంతో భుజంగరావు హైకోర్టులో వేసిన పిటిషన్‌ను జస్టిస్ కె.సుజన సోమవారం విచారించారు. ఇదే ఫోన్ ట్యాపింగ్ కేసులోనే మరో నిందితుడు పి.రాధాకిషన్‌రావు దాఖలు చేసిన బెయిలు పిటిషన్‌పై 21న విచారిస్తామని న్యాయమూర్తి ప్రకటించారు.

## శ్రీలంకకు మహిళా ప్రధాని



### ప్రమాణస్వీకారం చేసిన హరిణి అమరసూరియ

### 21 మందితో దిస్సనాయకే మంత్రివర్గం

**కొలంబో :** శ్రీలంకలో అధికార వామపక్ష కూటమి 21 మందితో చిన్నమంత్రివర్గాన్ని ఏర్పాటు చేసింది. మహిళను ప్రధానమంత్రిగా నియమించింది. కొత్తగా గెలిచిన ఎంపీలకే క్యాబినెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చింది. సోమవారంనాడు ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. మత్స్యశాఖామంత్రి రామలింగం చంద్రశేఖరన్ తమిళభాషలో ప్రమాణస్వీకారం చేయడం వామపక్ష కూటమి ప్రభుత్వంలో ఒక ప్రముఖఘట్టం. తద్వారా వామపక్ష ప్రభుత్వం మైనారిటీలకు సమాన ప్రాధాన్యం ఇస్తుందని అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే చాటిచెప్పారు. గురువారంనాడు కొత్తపార్లమెంటు మొదటిసమావేశం జరగనున్నది. అప్పటినుండీ మూడురోజులపాటు కొత్త ఎంపిల తరువాయి 6లో

## నేడు హన్మకొండకు సిఎం రేవంత్‌రెడ్డి



- ఆర్ట్స్ కాలేజీలో ఇందిరా మహిళా శక్తి సభ
- 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు శంకుస్థాపన
- వరంగల్ మహానగరానికి రూ.4,962.47కోట్లు కేటాయింపు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా ఉత్సవాలు నిర్వహించాలను నిర్ణయించింది. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం వరంగల్‌లో నిర్వహించే వేడుకల్లో సిఎం రేవంత్ రెడ్డి హాజరు తరువాయి 6లో

## లగచర్ల ఘటనలో పరిగి డిఎస్‌పిపై వేటు

### నూతన డిఎస్‌పిగా శ్రీనివాస్

ప్రజాపక్షం / హైదరాబాద్

వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనపై ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. పరిగి డిఎస్‌పి కరుణాకర్ రెడ్డిపై వేటు వేసింది. డిఎస్‌పిని డిజిపి కార్యాలయానికి అటాచ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పరిగి నూతన డిఎస్‌పిగా శ్రీనివాస్‌ను నియమించింది. వికారాబాద్ జిల్లా లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీ ఏర్పాటు విషయంలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులపై ఇటీవల దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. లగచర్ల ఘటనలో ఇప్పటివరకు మొత్తం 17 మందిని అరెస్ట్ చేసింది. ఇందులో బిఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి కూడా ఉన్నారు. ప్రస్తుతం వీరంతా చర్లపల్లి జైలులో ఉన్నారు. మరోవైపు ఈ ఘటనలో తమపై పోలీసులు, ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తోందని లగచర్ల గిరిజన కుటుంబాలు ఎస్‌పి, ఎస్‌టి కమిషన్ దృష్టికి తీసుకెళ్లాయి.

## కిషన్‌రెడ్డి... నల్లగొండలో 3 నెలలు పడుకోండి

### కేంద్రమంత్రికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్

### మంత్రి పదవి ఇచ్చింది రాష్ట్రానికి మేలు చేయడానికా? గల్లీలో ఉండడానికా? అని నిలదీత

### రైతులపై దొంగ ప్రేమ ఒలకబోస్తున్న బిఆర్‌ఎస్

ప్రజాపక్షం / హైదరాబాద్

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ప్రజలు పదవులు ఇచ్చింది ఢిల్లీలో ఉండి రాష్ట్రానికి మేలు చేయడానికా? గల్లీలో ఉండడానికా? అని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. కిషన్‌రెడ్డికి ధైర్యముంటే నల్లగొండలో మూడు నెలలు పడుకుని కాళ్ళు చేతులు వంకర్లు కాకుండా హైదరాబాద్ వస్తారా అని మంత్రి సవాల్ చేశారు. కిషన్‌రెడ్డి ఢిల్లీలో దోమల బాధకు తట్టుకోలేక హైదరాబాద్‌లో ఉంటున్నారని ఎద్దేవా చేశారు. బషీర్‌బాగ్‌లో రైతులపై చంద్రబాబుతో కలిసి కెసిఆర్ కాల్పులు జరిపించి ఇప్పుడు రైతులపై దొంగ ప్రేమ ఒలకబోస్తున్నారని ఆయన ఆరోపించారు. దాదాపు 80వేల పుస్తకాలు తరువాయి 6లో



## 'కులగణన'పై అసత్య ప్రచారం



### 65.02 శాతం సర్వే పూర్తి

### ఒకటి,రెండ్రోజుల్లో 'వికారాబాద్ ఘటన' సమగ్ర వివరాలు

### మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'కులగణన' సర్వే పూర్తయితే తమ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందనే ఉద్దేశంతోనే ప్రతిపక్ష పార్టీ రాజకీయ రంగు పూస్తోందని రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ప్రజల ఆస్తులను కొల్లగొట్టి, తమ ఆస్తులను పెంచుకునేందుకే గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేపట్టిందని, అందుకే ఆవివరాలను ఎవ్వరికీ తెలియకుండా గోప్యంగా పెట్టిందని దుయ్యబట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 18 నాటికి 65.02శాతం సర్వే పూర్తయిందని, కొద్ది రోజుల్లోనే సర్వేపూర్తవుతుందన్నారు. 'వికారాబాద్ ఘటన'కు సంబంధించి ఒకటి, తరువాయి 6లో

## స్వస్తిక్ గ్రూప్‌పై ఐటి దాడులు

### షాద్‌నగర్, చేవెళ్ళ, బంజారాహిల్స్‌లో ఏకకాలంలో సోదాలు




ప్రజాపక్షం/హైదరాబాద్ / రంగారెడ్డి /షాద్‌నగర్

రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో ఉన్న స్వస్తిక్ రియల్ ఎస్టేట్ కార్యాలయాలు, యజమానుల ఇండ్లపై ఆదాయపన్ను శాఖ అధికారులు సోదాలు చేపట్టారు. సోమవారం ఉదయం నగరంలో మూడుచోట్ల ఏకకాలంలో దాడులు చేశారు. తెల్లవారు జాము నుండే రంగారెడ్డి జి ల్లా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రా మ శివారులోని ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న స్వస్తిక్ గ్రూపుకు చెందిన మసాలా ప్లాంట్ ఫోర్ ఆగ్రో ఎల్‌ఎల్‌పిలో ఐటి అధికారులు తనిఖీలు నిర్వహించారు. మసాలా ప్లాంట్‌లోకి ఎవరిని రా నివ్వకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలో ఉన్న స్వస్తిక్ గ్రూపుకు చెందిన పరిశ్రమలో సైతం ఐటి అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఇటీవల కాలంలో స్వస్తిక్ రియల్ ఎస్టేట్ సంస్థ ఒక ఎంఎన్‌సి కంపెనీకి రూ.300కోట్ల భూమి అమ్మినట్లు సమాచారం. ఈ సంస్థకు చెందిన ఏడు చోట్ల ఐటి అధికారులు తరువాయి 6లో



## లగచర్లపై డిజిపి, సిఎస్ వెంటనే నివేదిక ఇవ్వాలి

- లగచర్లను సందర్శించి సంఘటనపై ఆరా తీసిన జాతీయ ఎస్‌టి కమిషన్ మెంబర్ హుసేన్ నాయక్

ప్రజాపక్షం / కొడంగల్

లగచర్ల దాడుల సంఘటనలో గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులపై జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోతు హుసేన్ నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల్ మండలం లగచర్ల, పులిచర్ల తండాలను ఆయన సందర్శించి ఇటీవలి సంఘటనపై ఆరాతీశారు. గిరిజనులపై జరిగిన దమనకాండపై విచారణ జరిపారు. తండా వాసులతోపాటు ఆయన కూడా నేలపైనే కూర్చున్నారు. సంఘటన విషయమై వారితో ఆప్యాయంగా మాట్లాడి పూర్తి వివరాలను తెలుసుకున్నారు. ఫార్మా కంపెనీ వస్తుందని మా పొలాలను, మా ఇండ్లను, ఊరిని ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ నాయకులు, అధికారులు బెదిరింపులకు గురిచేశారని, దీంతో గత 9మాసాల నుంచి దానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నామని కమిషన్ మెంబర్‌కు తండా వాసులు ఆయన ముందు గోడును వెళ్లబోసుకున్నారు. దీనిలో భాగంగానే లగచర్ల గ్రామంలో భూసేకరణపై ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన అధికారులకు వ్యతిరేకంగా తాము నిరసనలు వ్యక్తపర్చామే తప్ప ఎలాంటి దాడులకూ పాల్పడలేదన్నారు. మా గ్రామాలకు, మా భూములకు సంబంధం లేని వ్యక్తులు కొంతమంది తరువాయి 6లో

## నేడు కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం

- ప్రారంభించనున్న సిఎం రేవంత్‌రెడ్డి
- హనుమకొండలో ఇందిరా మహిళా శక్తి సభ




ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

తెలంగాణ సాంస్కృతిక రంగానికి మరింత ఒరవడిని తీసుకొస్తూ చారిత్రక కాకతీయుల నగరం హనుమకొండలో నిర్మితమైన కాళో జీ కళాక్షేత్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ప్రారంభించనున్నారు. ఈ కళాక్షేత్రం 4.25 ఎకరాల విస్తీర్ణంలో, రూ.95 కోట్ల వ్యయంతో నిర్మితమైంది. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ తరువాయి 6లో

## సంక్షోభంలో మణిపూర్ ప్రభుత్వం

### కూటమిపార్టీలతో ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్ భేటీ

### ఆగని హింస : కాల్పుల్లో నిరసనకారుడు మృతి



**ఇంఫాల్ :** మణిపూర్‌లో ఏడుగురు శాసనసభ్యులు ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవడంతో ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ ప్రభుత్వం సంక్షోభంలో పడింది. దీంతో బీరెన్‌సింగ్ ఎన్‌డిఎ కూటమి నాయకులతో సమావేశం జరిపారు. సోమవారం సాయంత్రం ఆరుగంటలకు ఈ సమావేశం జరిగిందని అధికారవర్గాలు తెలియజేశాయి. మణిపూర్‌లో మరోసారి తీవ్ర హింస చెలరేగడం, ప్రజా ప్రతినిధుల ఇళ్ళపై దాడులు, ఇళ్ళలో ఫర్నీచర్ ధ్వంసం, దహనాలువంటి ఘటనల తర్వాత ఏడుగురు ఎంఎల్‌ఎలు ఆదివారంనాడు మద్దతు ఉపసంహరించుకున్నారు. 60మంది సభ్యులున్న మణిపూర్ అసెంబ్లీలో బీరెన్‌సింగ్ ప్రభుత్వానికి 32 మంది శాసనసభ్యులు ఇప్పటివరకూ మద్దతు ఇస్తూ వచ్చారు. రాష్ట్రపాలనలో, శాంతి భద్రతల పునరుద్ధరణలో, రాష్ట్రాన్ని తిరిగి సాధారణస్థితికి తీసుకురావడంలో ముఖ్యమంత్రి పూర్తిగా విఫలమయ్యారని, అసమర్థ కేంద్ర ప్రభుత్వం అని విమర్శిస్తూ ఏడుగురు శాసనసభ్యులు ఆదివారంనాడు మద్దతు ఉపసంహరించుకున్నారు. ఐదుగురు శాసన సభ్యులుగల నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్), ఆరుగురు శాసనసభ్యులున్న జెడి(యు) కూడా మణిపూర్‌లో ఎన్‌డిఎ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నాయి. ఇదిలా ఉండగా, ''రాష్ట్రం సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఈ దశలో ఏ రూపంలోనూ, ఏ విధమైన హింసాత్మక ఆందోళనలకు పూనుకోవద్దు, ఉమ్మడిగా ఎలాంటి చర్యలకూ పాల్పడవద్దు'' అని ఇంఫాల్ లోయలో అత్యంత తరువాయి12లో

## గత ఖరీఫ్ కంటే అధిక ధాన్యం సేకరణ

- ఇప్పటి వరకూ 13.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- గత సీజన్‌లో 12.81 లక్షల మెట్రిక్ టన్నులే
- 3.02 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలకు రూ.9.21కోట్లు విడుదల



ప్రజాపక్షం/హైదరాబాద్

గత ఖరీఫ్ సీజన్‌తో పోల్చితే ఈ సీజన్‌లో ఇప్పటి వరకు అత్యధికంగా ధాన్యం సేకరించినట్లు పౌర సరఫరాల శాఖ కమిషనర్ డివిఎస్.చౌహాన్ తెలిపారు. ఈ సీజన్‌లో 13.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే గత ఏడాది ఇదే సీజన్‌లో 12.81 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం మాత్రమే కొనుగోలు చేయడం జరిగిందన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సివిల్ సప్లై భవన్‌లో కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 1.88 లక్షల రైతుల నుండి రూ. 3045.76 కోట్ల విలువ గల 13.13 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయగా తరువాయి 12లో

## మెట్రో రైలు రెండో దశ నిర్మాణంలో... సవాళ్లెన్నో!

### ప్రైవేట్ సంస్థలు ముందుకు రావడం లేదు : ఎన్‌విఎస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్




మెట్రో రైలు రెండో దశపై ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మెట్రో రెండో దశపై సిఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘంగా చర్చించినట్లు చెప్పారు. భారత ఆడిట్ అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్ కార్యాలయం(ఏజి ఆఫీస్)లో ఆడిట్ వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో దశలో మొత్తం 76 కిలోమీటర్ల మేర మెట్రో రైలు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. మెట్రో రైలు రెండో దశ నిర్మాణం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదన్నారు. మెట్రో రెండో దశ నిర్మాణానికి ప్రైవేట్ సంస్థలు ఏవీ ముందుకు రావడం లేదని వ్యాఖ్యలు చేశారు. మొదటి దశలో ఎల్అండ్ టికి భారీగా నష్టం వాటిల్లడమే ఇందుకు కారణమని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ అనుభవంతోనే తరువాయి 12లో



## ప్రజా వ్యతిరేక విధానాలను కలిసికట్టుగా ప్రతిఘటిద్దాం

### 26న దేశ వ్యాప్త నిరసన కార్యక్రమం

### ఎస్‌కెఎం, కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను కలిసికట్టుగా ప్రతిఘటిద్దామని, సంయుక్త కిసా న్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. రైతు, కార్మిక, ప్రజల జీవనోపాధిని రక్షించాలని, ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న దేశ వ్యాప్తంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు కోరారు. దేశ వ్యాప్త నిరసన కార్యక్రమంలో విజయవంతంలో భాగంగా సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక అధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. బాగం తరువాయి 6లో

# యువతరంగం

ఫోకస్

## డేటా సైంటిస్టులకు ఉత్తమ కెరీర్

ప్రస్తుత పరిస్థితుల్లో డేటా సైంటిస్టులకు ఉత్తమ కెరీర్ ఉంటుందని చెప్తున్నారు. ఇటీవల కాలంలో ఈ విభాగం అవసరం పెరిగింది. ఆధునిక డేటా శాస్త్రవేత్తలు కేవలం డేటాను విశ్లేషించడం మాత్రమేగాక, ఉత్పత్తికి నమూనాలను అమలు చేయడం, క్లీన్ కోడ్ రాయడం, జిఐటి వంటి సాధనాలను ఉపయోగించి బృందాలతో సహకరించగల బహుముఖ నిపుణతలను ప్రదర్శించగలగాలి. డేటా సైంటిస్టా ఉద్యోగానికి సిద్ధంగా ఉండటానికి కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలి. ముందుగా డేటా సైన్స్ అంటే ఏమిటో తెలుసుకోవాలి. ఇందు కోసం యూట్యూబ్ వీడియోలను చూడడం ముఖ్యం. దీని వల్ల ప్రాథమిక పరిభాషలు, ప్రాసెసింగ్ పద్ధతులు, ఫీల్ యొక్క పరిధిని తెలుసుకోవడానికి వీలవుతుంది. బిజినెస్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్, కంప్యూటర్ విజన్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ వంటి సబ్ఫీల్డ్లను కలిగి ఉన్న డేటా సైన్స్ ఎంత విస్తృతమైనది, బహుముఖంగా ఉందో తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది. డేటా సైన్స్ యొక్క సంక్లిష్టతలను సమర్థవంతంగా అర్థం చేసుకోవడంలో, నావిగేట్ చేయడంలో మీకు సహాయపడటానికి ఈ వనరులు విలువైన అంతర్దృష్టులను, ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని అందిస్తాయి. మీరు ప్రొఫెషనల్ డేటా మేనేజర్లో, డేటాబేస్లు, సిఎస్వి ఫైళ్లు, జెఎస్ఓఎన్తోసహా వివిధ మూలాధారాల నుండి డేటాను ఎలా లోడ్ చేయాలో నేర్చుకుంటారు. అదనంగా, డేటా ఫార్మాట్లను నిర్వహించడం, కనిపించకుండాపోయిన డేటాను నిర్వహించడం, డేటాసెట్లను రీషేప్ చేయడం, చేరడం, డేటాను ధృవీకరించడం వంటి సాధారణ డేటా సమస్యలను ఎలా పరిష్కరించాలో మీరు నేర్చుకుంటారు. డేటా విశ్లేషణ బహుళ కీలక దశలను కలిగి ఉంటుంది. లోడ్ చేయడం, ప్రాసెసింగ్, మానిప్యులేషన్ మరియు విశ్లేషణ అన్నీ నిర్దిష్ట వ్యాపార లక్ష్యాలను సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. నిజమైన డేటాసెట్లతో ప్రాక్టీస్ చేయడం ద్వారా, మీరు ఈ పద్ధతులను సమర్థవంతంగా వర్తింపజేయడం నేర్చుకుంటారు. డేటా విజువలైజేషన్ కళలో నైపుణ్యం సాధించడం కష్టం. మీరు ప్రతి ప్లాట్ మరియు గ్రాఫ్ గురించి తెలుసుకోవాలి. వాటిని ఎప్పుడు ఉపయోగించాలో అర్థం చేసుకోవాలి. వ్యక్తులకు, ప్రత్యేకించి సాంకేతిక నేపథ్యం లేని వారికి, అంతర్లీన సమాచారాన్ని గ్రహించడాన్ని సులభతరం చేసే రంగు నమూనాలు, లేబుల్లు మరియు ఇతర భాగాలను అధ్యయనం చేయడం ముఖ్యం. మీరు కంప్యూటర్ విజన్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, డీప్ లెర్నింగ్, రీన్ఫోర్స్మెంట్ లెర్నింగ్, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్, జెనరేటివ్ టెక్నాలజీ, మరిన్ని మెషిన్ లెర్నింగ్ సబ్ఫీల్డ్లను కూడా అన్వేషిస్తారు. అదనంగా, సింపుల్ మెషిన్ లెర్నింగ్ టాస్క్ల కోసం స్కికిట్లెర్న్ పైథాన్ ఫ్రేమ్వర్క్మవ ప్రావీణ్యం పొందుదగలుగుతారు. కాగా, డేటా సైంటిస్ట్, డేటా అనలిస్ట్ మధ్య తేడాను గుర్తించడం చాలా ముఖ్యం. డేటాను విశ్లేషించడానికి, నివేదికలో ఫలితాలను ప్రదర్శించడానికి డేటా సైంటిస్ట్ బాధ్యత వహిస్తాడు. ఉపయోగించిన ప్రతి విజువలైజేషన్ మరియు కాన్సెప్ట్ ఫలితాలను సమర్థవంతంగా కమ్యూనికేట్ చేయడానికి సరళమైన పరంగా వివరించాలి. ఉదాహరణకు, ఒక ఇ–కామర్స్ ప్లాట్ఫామ్లో వినియోగదారుల కొనుగోళ్లలో అంతర్లీన నమూనాలను గుర్తించే పనిని కంపెనీ మీకు అప్పగిస్తే, మీ పని డేటాను విశ్లేషించడం, మీరు కనుగొన్న వాటిపై వివరణాత్మక నివేదికను అందించడం. లాభాలను పెంచడానికి నిర్దిష్ట వ్యక్తులను లక్ష్యంగా చేసుకోవడానికి డేటాను ఎలా ఉపయోగించవచ్చో మీరు వివరించాలి. మీ ఉద్యోగంలో అత్యంత ముఖ్యమైన భాగం మీ పోర్ట్ఫోలియోను నిర్వహించడం... మీ ప్రాజెక్టును ప్రదర్శించడం.... మీరు GitHub మరియు Kaggleలో కొన్ని ప్రాజెక్టును కలిగి ఉండాలి, అలాగే మీడియం లేదా మీ వ్యక్తిగత వెబ్సైట్లో కొన్ని బ్లాగ్ పోస్ట్లను కలిగి ఉండాలి. అదనంగా, క్రియాశీల లింక్డ్ఇన్ ఖాతా అవసరం. ఈ అంశాలన్నీ మీ వ్యక్తిగత బ్రాండ్ను నిర్మించుకోవడంలో, ఉద్యోగ అవకాశాల కోసం తలుపులు తెరిచేందుకు మిమ్మల్ని మీరు సమర్థవంతంగా మార్కెట్ చేసుకోవడంలో సహాయపడతాయి. ఇక్కడ ఉత్పత్తి అంశం ఐచ్ఛికం. అయితే, మీరు ఉద్యోగ వివరణలను పరిశీలిస్తే, చాలా కంపెనీలు తమ డేటా సైంటిస్టులకు AWS లేదా GCP వంటి క్లౌడ్ ప్లాట్ఫామ్స్తో పరిచయం కలిగి ఉండాలని కోరుకుంటాయి. వారు డాకర్ మరియు కుబెర్నెట్లతో అనుభవాన్ని, అలాగే FastAPI లేదా ఏదైనా మోడల్ సర్వింగ్ ఫ్రేమ్వర్క్తో పరిచయాన్ని కూడా ఆశిస్తున్నారు. పరిస్థితులు మారుతున్నాయి, కాబట్టి మోడళ్లను ఉత్పత్తిలో అమలు చేయడంలో అనుభవాన్ని పొందడం, ముఖ్యంగా AWSలో, మీ రెజ్యూమ్ను మెరుగుపరుస్తుంది. మంచి ప్యాకేజీతో ఉద్యోగం సంపాదించడానికి ఉపయోగపడుతుంది. ఈ విషయాలను గమనించి, డేటా సైన్స్లో ఉత్తమ కెరీర్ను నిర్మించుకునే దిశగా అడుగులు మొదలుపెట్టడమే తరువాయి.




సైంటిస్ట్ కావాలనుకుంటే పైథాన్, ఎస్క్యుఎల్ రెండూ అవసరం. అత్యంత ప్రజాదరణ పొందిన డేటా అనలిటిక్స్, విజువలైజేషన్, మెషిన్ లెర్నింగ్ టూల్స్ పైథాన్లో నిర్మితమైన ఉన్నాయి. మీ స్వంత స్క్రిప్ట్లను సృష్టించడం, అమలు చేయడం చాలా సులభం. డేటాబేస్ నుండి డేటాను యాక్సెస్ చేయడానికి, మీరు SQL గురించి ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలి, ప్రశ్నలను ఉపయోగించి డేటాను ఎలా లోడ్ చేయాలి, ప్రాసెస్ చేయాలి, విశ్లేషించాలి. అదే విధంగా గణాంకాలు, సంభావ్యత భావనలు డేటా సైన్స్కు పునాది వేస్తాయని గుర్తుంచుకోవాలి. విశ్లేషణాత్మక పద్ధతులు, మెషిన్ లెర్నింగ్, డేటా ప్రాసెసింగ్ టెక్నిక్లను ఆధారం చేస్తాయి. నిర్దిష్ట వినియోగ సందర్భం కోసం ఈ అల్గారిథమ్లను అర్థం చేసుకోవడానికి, మెరుగుపరచడానికి మీరు ఈ సాంకేతికతల వెనుక ఉన్న సూత్రాలను నేర్చుకోవాలి.

## కృత్రిమ మేధతో ప్రమాదమా?



కృత్రిమ మేధ (ఎఐ) వినియోగంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. దాదాపు అన్ని రంగాల్లోనూ ఎఐ అద్భుత సేవలు అందిస్తున్నదన్న వాదన ఒకవైపు, దీని వల్ల లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోతారన్న భయాందోళనలు మరోవైపు అంతటా చక్కర్లుకొడుతున్నాయి. సోషల్ మీడియా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎవరు, ఎందుకు, ఏం మట్లాడుతున్నారో, ఏఏ అంశాల ప్రాతిపదికన సమర్థిస్తున్నారో లేదా వ్యతిరేకిస్తున్నారో తెలియని పరిస్థితి. ఎవరు అవునన్నా, ఎవరు కాదన్నా.. కృత్రిమ మేధ ఇప్పుడు అనివార్యమైంది. దానికి ఒక పరిధి అంటూ లేకుండా విస్తరిస్తున్నది. ఇది నిజం. ఎఐ అవసరం వద్దు అని మొండిగా వాదించేవాళ్లు నష్టపోతారేగానీ లాభం ఏమీ ఉండదు. ఎందుకంటే, ఏదైనా ఒక ఆవిష్కరణ జరిగిన తర్వాత, అది మరింత విస్తరించుకుంటూ వెళుతుందేతప్ప ఆగదు. ఎఐకి మినహాయింపు ఉంటుందని అనుకోవడానికి వీల్లేదు. వ్యాపార రంగంలో ఎఐ అవసరాన్ని సమర్థింపేవారు, తమతమ ఉత్పత్తులతో ఎఐని ఏకీకృతం చేయడంలో విఫలమైతే, పోటీ ప్రపంచంలో వెనుకబడిపోతారని అంటున్నారు. ఎన్నో సమస్యలకు ఎఐ ద్వారా సమాధానం లభిస్తున్నదని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత విద్యలోనూ ఎఐ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. అయితే, ఎలాంటి ఆవిష్కరణనైనా చెడుమార్గాలకు ఉపయోగించే తీరు వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎఐ ఆధారిత ప్రాజెక్టులను, విశేషణలను సర్వే నివేదికలను తమవిగా చూపిస్తున్న విద్యార్థులు తయారయ్యారు. ఏది వారు స్వయంగా చేసిన పరిశోధనో, ఏది ఎఐ నిర్మించి ఇచ్చినదో అర్థంగాని పరిస్థితి ఉపాధ్యాయులది. మంచీచెడు అనేది అన్నిటా ఉంటాయి. మనకు ఇష్టం ఉన్నా, లేకపోయినా టెక్నాలజీ విజృంభణను అడ్డుకోలేం. దానిని ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకోకపోతే వెనుకబడిపోతాం. పారిశ్రామిక విప్లవం సమయంతో యాంత్రికీకరణను వ్యతిరేకించినవారు కూడా తర్వాత కాలంలో వాటిపై పనులకు అలవాటుపడ్డారు. కొవిడ్ మహమ్మారి తీవ్రంగా ఉన్నప్పుడు... 'దానిని నిరోధించడం అసాధ్యం కాబట్టి, మన జాగ్రత్తలో మనం ఉండడమే మార్గం' అని నిపుణలు చేసిన హెచ్చరికలను ఎఐకి కూడా అన్వయించుకోవచ్చు. దీని విజృంభణను అడ్డుకోలేం... ఉపయోగించుకోవడం నేర్చుకోవాలి. ఎఐ కారణంగా ఉద్యోగాలు పోతాయని భయపడేవారు, అదే రంగంలో అత్యాధునిక సాంకేతితకతను అందిపుచ్చుకోవాలి. ఉద్యోగాలను సంపాదించుకోగలగాలి. సరి కొత్త సాంకేతికతను వద్దనుకునే బదులు, దానినే కెరీర్కు ఉపయోగించుకోవడాన్ని మించిన ఉత్తమ మార్గం మరొకటి లేదు.

## తోకచుక్కల వేటగాడు బిరోస్



పోలాండ్కు చెందిన రాఫాల్ బిరోస్కు అంతరిక్షాన్ని నిశితంగా పరిశీలించడం ఇష్టం. తోకచుక్కలను అన్వేషించడం అని హాబీ. నిజానికి ఇలాంటి అలవాటు ఉండేవారు ఖచ్చితంగా ఖగోళశాస్త్రాన్ని అవపోసనపట్టినవారై ఉంటారు. కానీ, అత్యధిక సంఖ్యలో కొత్త తోకచుక్కలను కనిపెట్లాడు. మొట్టమొదట కొత్త తోకచుక్క (కామెట్)ను కనిపెట్టి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్లో చోటు సంపాదించుకునే సమయానికి బిరోస్ వయసు కేవలం 12 సంవత్సరాల 199 రోజులు. ఆతర్వాత కూడా అతని వేట కొనసాగింది. 14 ఏళ్ల వయసుకే అతను గతంలో మరెవర్వరూ అందుకోలేని శిఖరాలను అందుకున్నాడు. లాక్డౌన్ సమయంలో పాఠశాల మూతపడడంతో, దృశ్యమాధ్యమంగా తరగతులకు హాజరయ్యేవాడు. ఆ సమయంలోనే అతనికి అంతరిక్షంలో కొత్త తోకచుక్కలను వెతకడం అలవాటైంది. తాను మొదట కనిపెట్టిన కామెట్ గురించి వివరించినప్పుడు, అందులో తాను 99 శాతం ఖచ్చితత్వం ఉందని నమ్మినట్టు చెప్తాడు బిరోస్. గిన్నిస్ బుక్ నిపుణులు ధ్రువీకరించడంతో అతనికి రికార్డుల పుస్తకంలో చోటు లభించింది. బిరోస్ తాను కనిపెట్టిన తొలి తోకచుక్కకు SOHO4094 అని పేరు పెట్టాడు. గిన్నిస్ రికార్డు అందిన తర్వాత కూడా తన వేటను కొనసాగించాడు. సామాన్యులు కూడా శాస్త్రీయ పరిశోధనల్లో భాగస్వాములయ్యేందుకు వీలు కల్పించిన 'సిటిజన్ సైన్స్' ప్రాజెక్టు తనకు ఎంతో ఉపయోగపడిందని అంటాడు బిరోస్. సూర్యుడు నిత్యం చలిస్తునే ఉంటాడన్న వాదనను కాదన్న తొలి వ్యక్తి కోపర్నికస్ను మార్గదర్శిగా ఎంచుకున్నాడు. సూర్యుడు ఒక నక్షత్రమని, అది స్థిరంగా ఉంటుందని, గ్రహాలన్నీ దాని చుట్టూ తిరుగుతాయని కోపర్నికర్ సిద్ధాంతీకరించాడు. ఆ రోజుల్లోనే మొదలైన ఖగోళ అన్వేషణ ఇప్పటికీ కొనసాగుతున్నది. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' అత్యంత శక్తివంతమైన టెలిస్కోప్లతో విశ్వ రహస్యాలు తెలుసుకోవడానికి ప్రయత్నిస్తునే ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో ప్రయోగాలు, అధ్యయనాలు, అన్వేషణలు కొనసాగుతున్న తరుణంలో, ఒక బాలుడు ఈ రంగంలో ఆసక్తి ప్రదర్శించడం.. కొత్త తోకచుక్కలను కనిపెట్టడం అద్భుతం.

### యూత్ ఐకాన్స్

*ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..*

బిరోస్ ఇప్పటి వరకూ కనిపెట్టిన తోకచుక్కలు జాబితా...

SOHO4094 13.11.2020 (క్రూట్జ్)
SOHO4155 01.04.2021 (మేయర్)
SOHO4199 03.06.2021 (క్రూట్జ్)
SOHO4219 26.06.2021 (క్రూట్జ్)
SOHO4224 28.06.2021 (క్రూట్జ్)
SOHO4227 29.06.2021 (క్రూట్జ్)
SOHO4228 29.06.2021 (క్రూట్జ్)
SOHO4246 13.07.2021 (క్రెట్జ్),
SOHO4244 19.07.2021 (క్రూట్జ్),
SOHO4262 25.07.2021 (క్రెట్జ్)
SOHO4300 30.10.2021 (క్రూట్జ్).

## సాహితి మృతికి కూనంనేని సంతాపం



**ప్రజాపక్షం/జూలూరుపాడు :** మండల పరిధిలోని అనంతరం గ్రామానికి చెందిన సిపిఐ నాయకులు పాలెపు ప్రభాకర్ కుమార్తె పాలెపు సాహితి (8) అనారోగ్యంతో మృతిచెందింది. సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు సాహితి పార్థీవదేహాన్ని సందర్శించి, పూలమాలవేసి నివాళులర్పించారు. సాహితి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపారు. ప్రభాకర్ మనోధైర్యంగా ఉండాలన్నారు. కుటుంబానికి సిపిఐ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, సిపిఐ మండల కార్యదర్శి గుండే పిన్ని వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి, సిపిఐ నాయకులు గార్ల పాటి వీరభద్రం, షేక్ చందు పాషా, వల్లమల సామేలు నిమ్మటూరి లచ్చయ్య, పత్తిపాటి మహేష్, గార్లపాటి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధాంతాలు, పోరాటాలకు ఆకర్షితులై సిపిఐలో చేరిక

సిపిఐ జిల్లా నాయకులు నేదునూరి రాజమౌళి



**ప్రజాపక్షం/హసన్పర్తి :** పోరాటాలు, సిద్ధాంతాలకు ఆకర్షితులై పలువురు సిపిఐలో చేరుతున్నారని సిపిఐ జిల్లా నాయకులు నేదునూరి రాజమౌళి అన్నారు. హసన్ పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో సోమవారం సిపిఐ జిల్లా నాయకులు, బిసి హక్కుల నేత ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి ఆధ్వర్యంలో సిపిఐ సభ్యత్వాలను నూతనంగా చేర్పించారు. ఈ సందర్భంగా సిపిఐలో చేరిన ఎర్ర శ్యామ్ సుందర్, ఎర్ర భాస్కర్, మర్రి శ్రీనివాసనలకు పార్టీ సభ్యత్వాలను అందజేశారు. సిపిఐ సభ్యత్వం తీసుకున్న శ్యాంసుందర్, భాస్కర్, శ్రీనివాస్లు మాట్లాడుతూ బడుగు, బలహీన, బహుజన వర్గాలకు న్యాయం జరగాలంటే సిపిఐతో సాధ్యమన్నారు. పార్టీ చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులమై సిపిఐలో చేరామన్నారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని డిసెంబర్ 26 కు శతాబ్ద ఉత్సవాలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో శ్రామిక ప్రజల, దళిత బహుజనుల, బడుగు బలహీన వర్గాల హక్కుల కొరకు సమ సమాజ వ్యవస్థ ఏర్పడాలని సమాజంలో కుల వివక్షత ,ఆర్థిక ,సాంఘిక అసమానతలు తొలగిపోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ నిర్విరామ పోరాటాలు చేస్తుందన్నారు. సిపిఐ శత జయంతి ఉత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించుకోవాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# సిపిఐ వందేళ్ల ఉత్సవాలు ఘనంగా జరపాలి

పార్టీ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి పిలుపు





**ప్రజాపక్షం/మునగాల :** 1925లో కాన్పూర్లో ఏర్పడ్డ సిపిఐ పార్టీ ఈ సంవత్సరంతో శత వసంతాలు పూర్తి చేసుకున్నదని, డిసెంబర్ 30న నల్లగొండ ఎన్జి కళాశాలలో జరగనున్న సిపిఐ శత వార్షికోత్సవ ప్రారంభ సభను ఘనంగా నిర్వహించుకోవాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశానికి పల్లా వెంకటరెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సోషలిస్టు కమ్యూనిస్టు భావాలను వ్యాప్తి చేస్తున్నారని 1921లో పెషవర్కర్ కేసు, 1924లో కాన్పూర్లో వ్యవస్థాపక సభకు ముందే కాన్పూర్ కుట్ర కేసు బనాయించారని, నాటి నుండి సిపిఐ పార్టీపై ఎన్నో నిర్బంధాలు కొనసాగాయని, అన్నింటిని తట్టుకుని, ముఖ్యంగా తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నవాబును తరిమికొట్టి హైదరాబాద్ రాష్ట్రాన్ని దేశంలో విలీనం చేసిన ఘన చరిత్ర సిపిఐ పార్టీది అని ఆయన గుర్తు చేశారు. దేశంలో రైతుల కోసం వ్యవసాయ సంస్కరణలు, కార్మికుల కోసం కార్మిక చట్టాలు, ప్రైవేట్ రంగంలో బొగ్గు గనుల బ్యాంకులు, బీమారంగం, ఆర్టిసి లాంటి సంస్థల జాతీయకరణకు అనేక ఉద్యమాలు చేపట్టి వాటిని సాధించడంలో సిపిఐ పాత్ర మరువలేనిదన్నారు. మేకల శ్రీనివాసరావు అధ్యక్షత జరిగిన సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు, మునగాల మండల సిపిఐ కార్యదర్శి చిలంచర్ల ప్రభాకర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యల్లావుల రాములు, ఎస్కె లతీఫ్, పోకల వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు, దేవరం మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### పార్టీ కార్యాలయాలు ఉద్యమ కేంద్రాలు

**కోదాడ(చిలుకూరు) :** పార్టీ కార్యాలయాలు ప్రజా ఉద్యమ కేంద్రాలు కావాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎంఎల్ఎ పల్లా వెంకటరెడ్డి అన్నారు. చిలుకూరు మండలం నారాయణపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సిపిఐ కార్యాలయం (కీసర గాంధీ స్మారక భవన్)ను సోమవారం పల్లా ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ నారాయణపురం గ్రామంలో పేద ప్రజల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వాలని అనేక పోరాటాలు నిర్వహించి పట్టాల సాధనలో గుండాల చేతుల్లో కీసర గాంధీ హత్యగావించబడ్డారన్నారు. పేద కుటుంబాలకు ఇండ్లు నిర్మించి ఇవ్వడంలో కీసర గాంధీ పాత్ర మరువలేనిదన్నారు. 1925లో ఏర్పడ్డ సిపిఐ శతవసంతాలు పూర్తి చేసుకున్నదని, అధికారంలో లేకపోయినా చట్టసభల్లో ప్రాతినిధ్యం ఉన్న లేకపోయినా పేద ప్రజల సమస్యలే ఎజెండగా పనిచేస్తున్న కార్యకర్తల బలమే కమ్యూనిస్టు పార్టీకి అండ అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ మాట్లాడుతూ చిలుకూరు మండలంలో జరిగిన అన్ని ప్రజా ఉద్యమాలలో కీసర గాంధీ ప్రముఖ పాత్ర పోషించారని ఆయన స్మారకార్థం పార్టీ కార్యాలయం నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. మండవ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డా నారాయణరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యు లు యల్లావుల రాములు, మేకల శ్రీనివాసరావు, దూళిపాళ ధనుంజయ నాయుడు, పోకల వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, నంద్యాల రామిరెడ్డి, దొడ్డా వెంకటయ్య, చేపూరి కొండలు, కీసర గాంధీ కుమారులు పాల్గొన్నారు.

## విభజన హామీల అమలులో కేంద్రం విఫలం

నగరంలో భారీపరిశ్రమలు ఏర్పాటు చేయాలి

కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఎప్పుడు ఏర్పాటు చేస్తారో కేంద్రం జవాబు ఇవ్వాలి

సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి డిమాండ్



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** విభజన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాదు మహానగరం తర్వాత రెండో పెద్ద మహానగరంగా విరసిల్లుతున్న వరంగల్ మహానగరంలో హనుమకొండ జిల్లా ఉన్నందున ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడే విధంగా భారీ పరిశ్రమ ఏర్పాటు చేసి ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్నదని ఆయన అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ హనుమకొండ మండల సమితి సమావేశం మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ముఖ్యఅతిధిగా బిక్షపతి హాజరై మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీలలో ఒకటైన కాజీపేటలో రైల్వే కోచ్ పరిశ్రమ ఎప్పుడు ఏర్పాటు చేస్తారో కేంద్ర ప్రభుత్వం ప్రజలకు జవాబు ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. కేంద్రంలో మూడోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈ ప్రాంతంపై తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ప్రజల సంక్షేమం మరిచి కార్పొరేట్ పెట్టుబడి వ్యవస్థకు అనుకూలం వ్యవహరిస్తున్నారన్నారు. దేశంలో ప్రజల సాధించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ లక్షలాది కోట్ల రూపాయలను వారికి రాయితీల పేరు మీద కట్టబెడుతున్నారని ఆరోపించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు, రైతన్న ఆదాయం రెట్టింపు చేస్తామని, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని, అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అందిస్తామని చెప్పి వాటి అమలులో మోదీ తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, ములుగు గిరిజన యునివర్సిటీ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, భారీ పరిశ్రమ ఏర్పాటుకు హామీ ఇచ్చి విస్మరించి తెలంగాణకు అన్యాయం చేసిందన్నారు. వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సిపిఐ పార్టీ శత ఆవిర్భావ దినోత్సవ వేడుకలు డిసెంబర్ 10 నుండి 26 వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామ గ్రామాన, నగరంలో వాడవాడల జెండా ఆవిష్కరణలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీని విస్తరించడానికి కృషి చేస్తూనే ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా నిరంతరం పోరాడుతుందన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, మండల కార్యదర్శి ఏశబోయిన శ్రీనివాస్, నాయకులు కొట్టేపాక రవి, సుదర్శన్, కండె నర్సయ్య, రమేష్ దేవా, రాము, ప్రశాంత్, కంచర్ల ప్రభాకర్, లావుడ్య రామ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేక నిర్ణయాలపై ఉద్యమాలు

సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేపట్టవలసిన కర్తవ్యం పార్టీపై ఉందని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ పార్టీ కార్యదర్శి గోదా శ్రీరాములు అన్నారు. సిపిఐ పార్టీ వంద సంవత్సరాల ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థ నారాయణపురం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశానికి గోదా శ్రీరాములు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సిపిఐ పార్టీ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిందని, వచ్చేనెలతో వంద సంవత్సరాలు పూర్తి చేసుకోకున్న సందర్భంగా గ్రామ గ్రామాన ఎర్రజెండాలు ఎగరవేసి పార్టీ చేసిన పోరాటాలను ఉద్యమ చరిత్రను నేటి తరానికి తెలియజేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్రం కొరకు, అనంతరం ఫ్యూడల్ సంస్థానాల విముక్తి కొరకు, తాడిత, పీడిత ప్రజల హక్కుల సాధనలో వేలాది మంది ప్రాణాలను కోల్పోయిన ఏకైక పార్టీ సిపిఐ అని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సిపిఐ ముఖ్య భూమిక పోషించిందన్నారు. నిజాం నవాబును తరిమికొట్టి హైదరాబాద్ రాష్ట్రాన్ని దేశంలో విలీనం చేసిన ఘన చరిత్ర సిపిఐకి ఉన్నదని ఆయన గుర్తు చేశారు. దేశంలో రైతుల కోసం వ్యవసాయ సంస్కరణలు, కార్మికుల కోసం కార్మిక చట్టాలు, ప్రైవేట్ రంగంలో బొగ్గు గనుల బ్యాంకులు, బీమారంగం, ఆర్టిసి లాంటి సంస్థల జాతీయకరణకు జరిగిన అనేక ఉద్యమాలు చేపట్టి వాటిని సాధించడంలో సిపిఐ ప్రజా సంఘాల పాత్ర మరువలేనిదన్నారు. అలాంటి త్యాగాల చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన మనపై ఉందన్నారు.వామపక్ష, లౌకిక ప్రజాస్వామ్య శక్తులను ఐక్యం చేసి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేపట్టవలసిన కర్తవ్యం మనపై ఉన్నదన్నారు. సమావేశంలో సిపిఐ నాయకులు ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సిపిఐ మండలకార్యదర్శి దుబ్బాక భాస్కర్, చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, యాదయ్య, మంచాల జంగయ్య, పల్లె మల్లారెడ్డి, నరసింహా, కొప్పు సుధాకర్, కొప్పుల నరసింహా, భీమనపల్లి గాలయ్య, ఈదమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

త్వరలో క్వాంటమ్ కంప్యూటింగ్‌లో సెంటర్ ఆఫ్..

# ఎక్స్‌లెన్స్ కేంద్రం ఏర్పాటు

ఎఐ హెల్త్ కేర్ సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్ బాబు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణాను త్వరలో క్వాంటమ్ కంప్యూటింగ్‌కు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా మారుస్తామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. ఇప్పటికే సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ పరిశోధన, అభివృద్ధిలో దేశం దృష్టిని ఆకర్షిస్తున్న రాష్ట్రానికి సిలికాన్ వ్యాలీ సంస్థలను తీసుకొస్తామని ఆయన వెల్లడించారు. 'ఆరోగ్య సంరక్షణ రంగంలో కృత్రిమ మేథ' అనే అంశంపై సోమవారం హైదరాబాద్ వెస్టిన్ హోటల్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఎఐజి చైర్మన్ డా. నాగేశ్వరరెడ్డి, సింగపూర్ నేషనల్ యూనివర్సిటీకి చెందిన డా.డియన్ హో, నారాయణ వైద్యాలయం వైస్ చైర్మన్ వీరేన్ శెట్టి, ప్రపంచ ఆరోగ్యసంస్థ డిజిటల్ హెల్త్ విభాగం సభ్యుడు డా.రాజేంద్ర గుప్తా పాల్గొన్న ఈ సదస్సులో శ్రీధర్ బాబు కీలకోపన్యాసం చేశారు. నాలుగో పారిశ్రామిక విప్లవానికి కేంద్రంగా ఉన్న హైదరాబాద్ నగరం ఆరోగ్య సంరక్షణలో కృత్రిమ మేథను విస్తృతంగా వినియోగించే దిశగా ముందుకు నడుస్తుందని అన్నారు. రేడియాలజీ రోగనిర్ధారణ పరీక్షల్లో స్పెషలిస్టు వైద్యులకు ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తోడ్పడుతోందని, పరిశోధనల ద్వారా దీనిని పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా పరిశోధనలు జరగాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాక్సిన్ కేంద్రంగా ఘనత సాధించడంలో, హెల్త్ సైన్సెస్‌లో నగరాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లిన పారిశ్రామికవేత్తలు, సంస్థలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎఐజిలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సును ఏర్పాటు చేసి ప్రపంచ ఆరోగ్య రంగానికి దిక్సూచిగా మారిన డా.నాగేశ్వరరెడ్డి తమ పరిశోధనలను ఇంకా ముందుకు తీసుకెళ్లి రాష్ట్రం ప్రతిష్ట పెంచాలని శ్రీధర్ బాబు కోరారు. ఎఐజిలో కృత్రిమ మేథతో పనిచేసే 'మిరా' అనే వర్చ్యువల్ వైద్య సహాయకురాలిని ప్రవేశపెట్టి ఈ రంగంలో ఆయన ఆదర్శప్రాయులుగా మారారని శ్రీధర్ బాబు కొనియాడారు. ఆసుపత్రుల్లో రోగుల సమాచారాన్ని పొందుపర్చడంలో పలు సంస్థలు ఇప్పటికే ఎఐ సహాయాన్ని తీసుకుంటున్నాయని, ఇది రోగులకు ఎంతో మేలు చేస్తుందని శ్రీధర్ బాబు తెలిపారు. దేశంలో ఏటా ఈ రంగంలో 20 వేల ఉద్యోగ ఖాళీలు ఏర్పడుతున్నా నిపుణుల కొరత వల్ల అభ్యర్థులు దొరకడంలేదని ఆయన అన్నారు. సైన్స్, ఫార్మా డిగ్రీ విద్యార్థులను కోర్సు పూర్తయ్యేలోగా నైపుణ్యం సమకూర్చి ఉద్యోగానికి సంసిద్ధులుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో ఐటి స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, రాష్ట్ర హెల్త్ సైన్సెస్ ఫౌండేషన్ డైరెక్టర్ శక్తి నాగప్పన్, ప్రభుత్వ ఐటి సలహాదారు సాయిక్రిష్ణ, టిజి ఐఐసి సిఇఒ వి.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పుడు వారెందుకు పార్టీ మారారు?

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పార్టీ మారిన వారి పట్ల బిఆర్ఎస్ వైఖరి అసంబద్ధంగా ఉందని, ఇప్పుడు నీతులు చెపుతున్న కొందరు నేతలు తాము ఎంఎల్‌ఎలుగా ఉన్నప్పుడు ఎందుకు పార్టీ మారారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని ప్రశ్నించారు. గతంలో ప్రజల పేరు చెప్పి అభివృద్ధి జపం చేసి పార్టీలు మారిన నేతలు ఇప్పుడు నీతులు చెపుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఆయన అన్నారు. సోమవారం కొత్తగూడెం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ స్థానికంగా ఉండే ఓ మాజీ ఎంఎల్‌ఎ ఐదు సార్లు పార్టీ మారారని అప్పుడు పార్టీ గుర్తులు, ప్రజల మనోభావాలు గుర్తుకు రాలేదా అని కూనంనేని ప్రశ్నించారు. భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉత్సవాలు జరుపుకుంటుందని కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో అనేక విజయాలను సాధించిందన్నారు. అనేక పార్టీలు పుట్టి కనుమరుగైపోయాయని, కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన నికరంగా నిలబడి పోరాడుతుందన్నారు. పార్టీ కార్యదర్శిగా, ప్రజా ఉద్యమ నిర్మాణం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూనే నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని కూనంనేని తెలిపారు. పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలను కలిపి కార్పొరేషన్ ఏర్పాటు జరుగుతుందని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తాను కొత్తగూడెంలో విమానాశ్రయం కోసం గట్టి ప్రయత్నం చేస్తున్నామని, త్వరలోనే పౌర విమానయాన శాఖ మంత్రి రాంమోహన్‌నాయుడుని కలుస్తామని కూనంనేని తెలిపారు. ఇండస్ట్రియల్ పార్కు, ఐటి హబ్, సింగరేణి కాంప్లెక్స్ సుందరీకరణ, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, అంతర్గత రహదారుల అభివృద్ధిపై దృష్టిసారించామన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**అధికారుల నిర్లక్ష్యంతో ప్రజాధనం వృథా**

**భద్రాచలం :** కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డులోని మేదర్ బస్తీలో ధ్వంసమైన డ్రైనేజీని ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు సోమవారం ప్రజల ఫిర్యాదు మేరకు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మించడం వల్లే ధ్వంసమైందని, దీని పునర్నిర్మాణం కోసం సత్వరమే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఇది ముమ్మాటికీ అధికారుల నిర్లక్ష్యమే అని, కాంట్రాక్టర్లు అవినీతికి పాల్పడటం వల్లే లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోపాలు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, మున్సిపల్ కమిషనర్ శేషాంజన స్వామితో పాటు తదితర అధికారులున్నారు.



## బాధ్యతలకు న్యాయం చేస్తా

తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ గుమ్మడి వెన్నెల గద్దర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను, వృత్తి కళాకారులను గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి పేరుప్రతిష్టలు మరింత పెంచుతానని, తనకిచ్చిన బాధ్యతలకు న్యాయం చేస్తానని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ గుమ్మడి వెన్నెల గద్దర్ చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని సోమవారం ఆమె మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా తనకు బాధ్యతలు ఇవ్వడానికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులకు, టిటిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ తదితరులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



టిపిసిసి రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు

## ఇందిరాగాంధీ ఎక్సలెన్సీ అవార్డు 2024 ప్రదానం

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** జాతీయ సమైక్యత, మత సామరస్యం, శాంతి స్థాపనకు కృషి చేస్తూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో రాష్ట్ర ప్రజలు పాల్గొనాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కోరారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ 'ఇందిరాగాంధీ ఎక్సలెన్సీ అవార్డు –2024'ను బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌కు ప్రకటించింది. ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ సోమవారం బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించి అవార్డును ప్రదానం చేశారు. మహేష్‌కుమార్ గౌడ్ గత నాలుగు దశాబ్దాలుగా జాతీయ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా, పిసిసి కార్యదర్శిగా, అధికార ప్రతినిధిగా సేవలందించారని, తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను ఒకే తాటిపై నడిపిస్తూ అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ కొనియాడారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది జి .సీతారామ రాజు, టిపిసిసి కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, బి.వెంకటేష్ ముదిరాజ్, టిఫ్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ అఖ్తర్ అలీ, నవభారతి నిర్మాణ ఫౌండేషన్ అధ్యక్షులు బత్తుల హేమంత్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గౌని నరసింహ గౌడ్ పాల్గొని మహేష్ కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## 'లగచర్ల'పై అఖిలపక్షం : తమ్మినేని డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫార్మాసిటీకి సంబంధించి లగచర్లలో భూసేకరణ ప్రజా స్వామ్య బద్ధంగా జరగడంలేదని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. లగచర్ల భూసేకరణ అంశంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలన్నారు. హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్ రోడ్‌లోని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఎస్.వీరయ్యలతో కలిసి తమ్మినేని వీరభద్రం మాట్లాడారు. రాష్ట్రంలో వికారాబాద్ జిల్లాలో ఫార్మా సంస్థ కోసం 1,376 ఎకరాల భూమిని సేకరించాలని ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. అందులో 600 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, మిగతాది రైతుల నుంచి సేకరించాలని నిర్ణయించిందన్నారు. ఇందుకు ప్రజాస్వామ్య పద్ధతిని పాటించకుండా ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకెళ్లడం సరైందికాదన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెళ్లిన కలెక్టర్, ఇతర అధికారులపై ప్రజలు, రైతులు దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. భౌతిక దాడి పరిష్కారం కాదన్నారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తే బాగుండేదన్నారు. కానీ లగచర్ల పరిసర గ్రామాల్లో నిర్బంధాన్ని ప్రయోగించడం, ఇంటర్‌నెట్‌ను బంద్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతాంగానికి అండగా నిలబడేందుకు బాధిత కుటుంబాలను పరామర్శించడానికి ఈనెల 21న లగచర్లకు వెళ్తామని చెప్పారు. మూసీ పరిధిలో పేదలు, మధ్యతరగతి ప్రజలు కొనుక్కున్న ఇండ్లను కూల్చడం సరైంది కాదన్నారు. నష్టపరిహారం, డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చిన తర్వాతే పేదల ఇండ్లను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కోసం భూమిని కోల్పోయిన రైతులు ఇంకా పరిహారం కోసం ఎదురు చూస్తున్నారని గుర్తుచేశారు. మూసీ ప్రక్షాళన పేరుతో 12వేల పేదల ఇండ్లను ఇరువైపులా తొలగించడం సరైంది కాదని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు.



## వేములవాడకు వరాల జల్లు

అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ ప్రాంతానికి రాష్ట్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. శ్రీరాజరాజేశ్వర క్షేత్రం అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.127.65కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనుంది. వేములవాడ శ్రీరాజరాజేశ్వర ఆలయ కాంప్లెక్స్ విస్తరణ, భక్తులకు అవసరమైన అధునాతన సదుపాయాలకు రూ.76కోట్లు కేటాయించింది. వేములవాడ ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు ఉన్న రోడ్లును వెడల్పు చేసేందు రూ.47.85 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో రోడ్డు విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను చేపట్టనున్నారు. మూలవాగులో ఉన్న బతుకమ్మ తెప్ప నుంచి జగిత్యాల కమాన్ జంక్షన్ వరకు పైప్ లైన్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.3.8 కోట్ల పనులకు పరిపాలక ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## రూ.50వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన ఎఇ పాండురంగారావు



**ప్రజాపక్షం/ఎర్రవల్లి :** జోగులాంబ గద్వాల్ జిల్లా ఎర్రవల్లి మండలం రాజశ్రీ గార్లపాడు గ్రామంలో మైనార్టీ షాదిఖానా భవన నిర్మాణం పనులకు బిల్లులు చేయడానికి ఓ వ్యక్తి నుంచి రూ.50వేలు లంచం తీసుకుంటూ ఎర్రవల్లి చౌరస్తాలో రెడ్ హ్యాండెడ్‌గా అధికారులకు ఇటిక్యాల మండల పంచాయితీ రాజ్ ఏఈ పాండురంగారావు పట్టుబడ్డారు.

రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లను

## కేంద్ర ప్రభుత్వం విస్మరించడం దుర్మార్గం

అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు




**ప్రజాపక్షం / హైదరాబాద్:** దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల వృద్ధిలో కీలక పాత్ర పోషించిన రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం విస్మరించడం దుర్మార్గమని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఎఐబిఇఎ) జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు అన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ రిటైరీస్ ఆర్గనైజేషన్స్ (యుఎఫ్‌బిఆర్ఓ) పిలుపు మేరకు తెలంగాణ బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ (టిబిఆర్ఎఫ్) వేలాది మంది రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగులతో మహాధర్నాను సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించింది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్లకార్డులు చేతబూని పెద్దఎత్తున రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగులు నినాదాలు చేశారు.

టిబిఆర్ఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎన్.వి.రమణ అధ్యక్షతన జరిగిన ధర్నాను యుఎఫ్‌బిఆర్ఓ జాతీయ అధ్యక్షులు ఎస్.ఎం.దేశ్ పాండే ప్రారంభించగా, ధర్నాను ఉద్దేశించి బి.ఎస్.రాంబాబు ప్రసంగించారు. పెన్షన్ ముఖ్యమైన సామాజిక భద్రతా ప్రమాణాలలో ఒకటని, కేంద్ర ప్రభుత్వం, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ) తక్షణమే స్పందించి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల పెన్షన్ నవీకరణ చేయాలని రాంబాబు డిమాండ్ చేశారు. రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం నిర్వహించే ఉద్యమాలలో పాల్గొంటామని రాంబాబు చెప్పారు. ఎస్.ఎం.దేశ్ పాండే మాట్లాడుతూ ద్రవ్యోల్బణం రేటు, అధిక ధరలు, జీవన ప్రమాణాలలో మార్పు మొదలైనవాటిని పరిగణనలోకి తీసుకుని పెన్షన్ పథకానికి సవరణలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం, ఐబిఎపై ఉందన్నారు. ప్రత్యేక అలవెన్సులు, కమ్యుటేషన్ వ్యవధిని 15 ఏళ్ల నుండి పదేళ్లకు తగ్గించడం, ప్రైవేట్ రంగ బ్యాంకుల ద్వారా పదవీ విరమణ పొందిన వారికి పెన్షన్, ఎక్స్‌గ్రేషియా చెల్లింపు, జిఎస్‌టిని తొలగించి రిటైర్డ్ ఉద్యోగుల గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్‌ను మెరుగుపరచడం వంటి ప్రధాన డిమాండ్లను యుఎఫ్‌బిఆర్ఓ ప్రతినిధులతో ఐబిఎ చర్చించి పరిష్కరించాలని దేశ్‌పాండే డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో టిబిఆర్ఎఫ్ చైర్మన్ ఎ.రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు ఎం.ఎన్.రావు, ఆర్.లక్ష్మణ్‌రావు, ఉప ప్రధాన కార్యదర్శి ఎన్.ఎస్.ఎన్.రెడ్డి, ఎఐబిఆర్ఎఫ్ కార్యదర్శులు వారణాసి, వి.కృష్ణమూర్తి, టిబిఆర్ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వి.నారాయణరావు పాల్గొన్నారు.

## 20న వేములవాడకు సిఎం రేవంత్

రూ.5 లక్షల గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా చెల్లింపు దేశ చరిత్రలోనే ప్రథమం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈనెల 20న వేములవాడకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్లనున్నారు. వేములవాడ సభలో గల్ఫ్ బాధిత కుటుంబాలకు నష్టపరిహారం పంపిణీ చేయనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 17 మంది గల్ఫ్ మృతుల వారసులకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లింపు కోసం రూ.85 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. గల్ఫ్ కార్మికులు ఆయురారోగ్యాలతో క్షేమంగా, సురక్షితంగా ఉండాలని సిఎం రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో ఆకాంక్షించారు. దురదృష్టవశాత్తు కానరాని దేశంలో కన్నుమూసిన గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు ఆదుకోవడానికి రూ.5లక్షల మృత ధన సహాయం పథకాన్ని అమలు చేస్తున్నారు. ట్రెజరీ ద్వారా సొమ్ము వారి బ్యాంకు ఖాతాలలోకి నేరుగా బదిలీ అవుతుంది. గల్ఫ్ దేశాలలో చనిపోయిన ప్రవాసి కార్మికులకు ఒక రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల మృతధన సహాయం చేయడం దేశ చరిత్రలోనే ప్రథమం. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో 'అభయ హస్తం'లో 'గల్ఫ్ కార్మికుల సంక్షేమం, ఎన్నారైల సంక్షేమం' కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో సెప్టెంబర్ 16న జి.ఓ నెంబర్ 205 జారీచేసిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నదని టిపిసిసి ఎన్నారై సెల్ చైర్మన్, అంబాసిడర్ డాక్టర్ బి.ఎం. వినోద్ కుమార్ అన్నారు. గల్ఫ్ గ్యారంటీల అమలుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, టిపిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి బి. మహేష్ కుమార్ గౌడ్, ఎంఎల్‌సి టి. జీవన్ రెడ్డి, ఎంఎల్‌ఎలు ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, సిఎం ముఖ్యసలహాదారు వేంనరేందర్ రెడ్డి, ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ అనిల్ నాయకులకు కాంగ్రెస్ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

**గల్ఫ్ మృతుల వారసులకు కెసిఆర్ రూ.100 కోట్లు బాకీ**

టిఆర్ఎస్, బిఆర్ఎస్ పదేళ్ల పరిపాలనకాలంలో గల్ఫ్ దేశాలలో తెలంగాణ కార్మికులు సుమారు రెండు వేల మంది చనిపోయారు. పలు సందర్భాల్లో కెసిఆర్, కెటిఆర్, హరీశ్ రావులు గల్ఫ్ మృతులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రస్తావించారు. ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున లెక్క వేస్తే వంద కోట్లు అవుతుంది. ఈ లెక్కన కెసిఆర్, కెటిఆర్, హరీశ్ రావులు గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.100 కోట్ల మేర బాకీ ఉన్నారని టిపిసిసి గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి అన్నారు.

పంట విస్తీర్ణం భారీగా పెరగడంవల్లే..

## ధాన్యం అధిక దిగుబడి

మాజీ ఎంపి వినోద్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పంట విస్తీర్ణం భారీగా పెరిగినందువల్లనే ధాన్యం దిగుబడి పెరగడానికి కారణమైందని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కెసిఆర్ ప్రభుత్వం 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేసిందని, ఇది కొనసాగుతోందని, తద్వారా ధాన్యం దిగుబడి పెరిగిందని వివరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తట్టెడు మట్టి కూడా తీయని రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి రాష్ట్రంలో పండిన ధాన్యాన్ని తమ ఖాతాలో వేసుకునే హక్కు లేదన్నారు. కెసిఆర్ తీసుకున్న రకరకాల రైతాంగ అనుకూల విధానాలు సాగు విస్తీర్ణం పెరగడానికి కారణమైందని, కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నిర్మించినందుకే నీళ్లు వస్తాయనే ధైర్యంతో రైతులు వ్యవసాయాన్ని పెంచారని వినోద్ కుమార్ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఉన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను వర్షాకాలంలో బాగా వానలు పడినప్పుడు నాటి కెసిఆర్ ప్రభుత్వ హయాంలో కూడా నీటిని వాడలేదని గుర్తుచేశారు. ప్రాణహిత నీటిని వాడుకునే అవకాశాలను కాళేశ్వరం ప్రాజెక్టు కల్పిస్తుందని వివరించారు. ఎల్లంపల్లి, మిడ్‌మానేరు పంపింగ్ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగం కాదా?, సిఎం రేవంత్ రెడ్డి అవగాహన లేకుండా, అనాలోచితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 1990 నుంచి 2014 వరకు క్రమంగా తగ్గిన వరి పంట విస్తీర్ణం, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 తర్వాత ఎందుకు పెరిగిందని ఆయన ప్రశ్నించారు. ఈ మీడియా సమావేశంలో బిఆర్ఎస్‌వి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, నాయకులు బాలరాజు యాదవ్, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

# సమగ్ర కులసర్వే చరిత్రాత్మక నిర్ణయం

బిసిల హక్కుల పరిరక్షణకే కమిషన్

రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్



**ప్రజా పక్షం /నల్లగొండ ప్రతినిధి :** సమాజంలో వెనకబడిన బలహీనవర్గాల ప్రజలు ఎంతమంది ఉన్నారో తెలిస్తే వారికి అవకాశాలు కల్పించేందుకు ఆస్కారం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. సోమవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన స్థితిగతులు, వెనుకబాటుతనం, వారికి కల్పించాల్సిన అవకాశాలు తదితర అంశాలపై అధ్యయనం నిమిత్తం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయావరణలోని ఉదయాదిత్య భవన్లో బిసి కమిషన్ బహిరంగ విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా వివిధ కుల సంఘాలు, వ్యక్తులు, సంస్థలతో విజ్ఞాపనలను స్వీకరించిన అనంతరం బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకొని వారి హక్కుల రక్షణ కోసం కృషి చేసేందుకు రాష్ట్ర బిసి కమిషన్ బహిరంగ విచారణలు నిర్వహిస్తున్నదని, ఇప్పటివరకు 5విచారణలు పూర్తి చేయగా, ఇది 6వదని అన్నారు. ఈ నెల 26 వరకు కమిషన్ బహిరంగ విచారణలు ఆయా జిల్లాల్లో కొనసాగుతాయని చెప్పారు. బిసి హక్కుల పరిరక్షణ కోసం బిసి కమిషన్ పనిచేస్తుందని, బిసి కమిషన్ ఈ విషయంలో ముక్కుసూటిగా వ్యవహరిస్తుందని, ఎక్కడైనా దాడులు జరిగినట్లయితే చర్య తీసుకునేందుకైనా కమిషన్ వెనకాడదని తెలిపారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న సమగ్ర కుల సర్వే చారిత్రాత్మక నిర్ణయం అని, దీనివల్ల రాష్ట్రంలో జనాభాలో బిసిలు ఎంతమంది ఉన్నారో తెలుస్తుందన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో కోటి 15 లక్షల పైచిలుకు కుటుంబాలను రాష్ట్రవ్యాప్తంగా గుర్తించడం జరిగిందని, ఇందులో 87,000 మంది ఎన్యుమరేటర్లు ఇప్పటివరకు ఇండ్లకు వెళ్లి సమాచారాన్ని సేకరిస్తున్నారని, సమగ్ర కుటుంబ సర్వే వివరాలు పూర్తిగా పబ్లిక్ డొమైన్‌లో పెట్టడం జరుగుతుందని చెప్పారు. అయితే ఈ సర్వేపై కొందరు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని, సమాజంలో వెనుకబడి, బలహీనంగా ఉన్నవారు ఎంత మందో తెలిస్తే మంచి అవకాశాలు కల్పించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. సమాజంలో బలహీనంగా ఉన్న వారి అభివృద్ధి కోరుకునే వారికి అందరూ సహకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇప్పటివరకు 65 నుండి 70 సర్వే పూర్తయిందని, జిల్లాలో 5 లక్షల 4542 మంది కుటుంబాలకు గాను ఇప్పటివరకు 4 లక్షల ఇరవై వేల 954 కుటుంబాలను సర్వే చేసి 84 సర్వే పూర్తి చేయడం పట్ల ఆయన అభినందించారు. భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, బిసి స్థితిగతులను తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సామాజిక ఆర్థిక ఉపాధి రాజకీయ కుల గణన తలపెట్టిందని, అనాది కాలం నుండి వివక్షకు గురవుతున్నారని, కులవృత్తుల వారు ఇబ్బంది పడుతున్నారని, కొంతలో మార్పు వచ్చినప్పటికీ ఇంకా మార్పు రావాల్సిన అవసరం ఉందని, కులవృత్తుల వారు కులాలు చేయడం లేదని, దాంతో వారు ఉపాధి కోల్పోతున్నారని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని బిసిల అభ్యున్నతికి బిసి కమిషన్ కృషి చేయాలని కోరారు. బిసి కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు,సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా బిసి సంక్షేమ అధికారి నిజాం అలీ, అనసూయ, యాదయ్య తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**GYANA JYOTHI COLLEGE OF PHARMACY**
(Approved by AICTE, PCI & Affiliated to JNTU, Hyderabad)
Uppal Bus Depot, Hyderabad 500098. Ph.: 9393144415/12/18
Email: gyanajyothicollege@gmail.com Web: www.gjcp.ac.in

**B.CATEGORY NOTIFICATION: TGEAPCET - 2024**

| S.No. | Course | Intake | B.Categoryseats |
|---|---|---|---|
| 1 | B-Pharmacy | 100 | 30 |

Applications are invited under **B category** for the above mentioned courses for the academic year **2024-2025.** Interested and eligible candidates may submit applications along with the copies of certificates in the college. Admissions criteria will be as per the guidelines of TSCHE.

Sd/- Principal

**హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్**
(మెట్రో రైల్ భవన్, రసూల్‌పుర, హైదరాబాద్)
NIT. No. 03/HMRL/Engg/EE-VI/2024-25 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన తేది: 18.11.2024
**పని పేరు:** భరత్‌నగర్ ఫ్లై ఓవర్ మరియు మెట్రో వైడక్ట్ మధ్య ప్రదేశం మూసివేయడానికి చైన్‌లింక్ ఫెన్సింగ్ ఏర్పాటు. సర్వీస్ రోడ్డు వైపు మరియు ఎర్రగడ్డ ఫ్లై ఓవర్ వైపు ఫెన్సింగ్ షీట్ అమర్చడం. **పని విలువ:** రూ.40.50 లక్షలు, ముగింపు తేది: 27.11.2024న మ.03.00 గం.ల వరకు, మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ అనగా https://tender.telangana.gov.in లేదా EE-VI, HMRI, ఫోన్ నెం. 040-23388588 ను సంప్రదించవచ్చు.
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-VI (I/C)
DIPR R.O. No. : 6742-PP/CL/ADVT/1/2024-25, Date: 18-11-2024 హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
మల్కాజ్‌గిరి సర్కిల్-28
NIT. No. 40/EE-28/SBZ/GHMC/2024-25
**పని పేరు:** నిర్మాణ పనులు: ఇతర-1. **అంచనా విలువ** (లక్షల రూపాయలు) : 981125.00, **బిడ్ స్వీకరణకు ప్రారంభ తేది & సమయం / బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 18.11.2024న మ.02.00గం.ల నుండి 25.11.2024న మ.02.00గం.ల వరకు. **అధికారి పేరు మరియు చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్. సెల్: 9154796465. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 6719-PP/CL/ADVT/1/2024-25, Date: 18-11-2024

# మూడో ప్రపంచ యుద్ధానికి బైడెన్ యత్నం

## రష్యా డ్యూమా ప్రతినిధి బూటినా



**మాస్కో:** అమెరికా తయారీ దీర్ఘశ్రేణి ఆయుధాలు రష్యాపై వాడేందుకు కీవ్‌కు అనుమతిచ్చి బైడెన్ ప్రభుత్వం ప్రమాదకర నిర్ణయం తీసుకొందని రష్యా డ్యూమా సభ్యురాలు మారియా బూటినా విమర్శించారు. మూడో ప్రపంచ యుద్ధం వైపు నెట్టే చర్యగా దీనిని ఆమె అభివర్ణించారు. 'పదవిలో ఉన్నంత కాలం బైడెన్ కార్యవర్గం ఉద్రిక్తతలను గరిష్ఠస్థాయిలో రాజేస్తుంది. ట్రంప్ వచ్చాక ఈ నిర్ణయాలను ఉపసంహరించుకొంటారని ఆశిస్తున్నా. మూడో ప్రపంచ యుద్ధాన్ని ఎవరూ కోరుకోవడం లేదు. అమెరికాలో కొందరు తాము పోగొట్టుకోవడానికి ఏమీ లేదుగా అని భావిస్తుంటారు' అని ఓ ఆంగ్ల వార్తా సంస్థ వద్ద ఆమె వ్యాఖ్యానించారు. అమెరికాలో రష్యా ఏజెంటుగా పనిచేస్తోందనే ఆరోపణలపై బూటినా దాదాపు 15 నెలలపాటు జైల్లో గడిపారు. ప్రస్తుతం ఆమె యునైటెడ్ రష్యా పార్టీ తరపున డ్యూమా సభ్యురాలు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధగతిని మార్చేలా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆదివారం ఓ నిర్ణయం తీసుకున్నారు. కీవ్‌కు తాము అందిస్తున్న దీర్ఘ శ్రేణి క్షిపణులను రష్యా భూభాగంపై దాడికి వినియోగించుకునేందుకు అనుమతిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో రష్యాపైకి దీర్ఘశ్రేణి క్షిపణులను ఉపయోగించుకోవడానికి ఉక్రెయిన్‌కు అవకాశం దక్కుతుంది. ఈ విషయాన్ని న్యూయార్క్ టైమ్స్ పత్రిక పేర్కొంది. మరోవైపు ఈ నిర్ణయంపై రష్యా అధ్యక్ష కార్యాలయమైన క్రెమ్లిన్ ఇప్పటి వరకు స్పందించలేదు. సెప్టెంబర్ 12వ తేదీన పుతిన్ మాట్లాడుతూ రష్యాపై దీర్ఘశ్రేణి ఆయుధాల వినియోగాన్ని పశ్చిమ దేశాలు అంగీకరిస్తే... నాటో, అమెరికా, ఐరోపా దేశాలు నేరుగా యుద్ధంలో పాల్గొన్నట్లే భావిస్తామని తెలిపారు. దీంతో నాటో సైనిక, సాయుధ సంపత్తి లక్ష్యంగా




దాడులు చేస్తామన్నారు. తాము నాటో, అమెరికా కోసం విభిన్నమైన ప్రతిస్పందనను సిద్ధం చేసుకొన్నట్లు తెలిపారు.

# మా లోపాలను దుర్మార్గులు వాడుకున్నారు

## కెనడా ప్రధాని ట్రూడో పశ్చాత్తాపం



**అట్టావా:** కెనడా వలసల నియంత్రణ విధానంలో సహేతుకతను ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో వెల్లడించారు. ఈ మేరకు ఏడు నిమిషాల వీడియో విడుదల చేశారు. కొందరు దుర్మార్గులు వ్యవస్థలోని లోపాలను వాడుకొని ప్రజలను దోచుకుంటున్నారని ట్రూడో ఆవేదన వెలిబుచ్చారు. ముఖ్యంగా అమాయకులైన వలసదారులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని, డిప్లొమాలు పూర్తిచేయిస్తామని, పౌరసత్వం తేలిగ్గా లభిస్తుందని ఆశలు చూపి మోసం చేస్తున్నారన్నారు. ఈ సమస్యలు పరిష్కరించడానికే సరికొత్త పాలసీ తీసుకొచ్చామన్నారు. దీనిలో భాగంగా రానున్న మూడేళ్లలో తాత్కాలిక, శాశ్వత నివాసాల కోసం వచ్చే వారి సంఖ్యను గణనీయంగా తగ్గిస్తామని చెప్పారు. కోవిడ్ తర్వాత ఉద్యోగుల కొరత తగ్గించేందుకు వలస విధానంలో చేసిన మార్పులను ఫేక్ కాలేజీలు, భారీ కార్పొరేషన్లు తమ లాభాల కోసం దానిని దుర్వినియోగం చేశాయన్నారు. 'తాత్కాలిక ఉద్యోగులు కూడా మా శ్రామికశక్తిలో భాగమయ్యారు. దీంతో మేము ఇమ్మిగ్రేషన్‌ను ప్లాన్ చేసేవేళ వారిని చేర్చకపోవడం తప్పవుతుంది. డిమాండ్ ఆధారంగానే మా వలస విధానం ఉంటుంది. ప్రస్తుత మౌలిక వసతులను దృష్టిలో పెట్టుకొని దీనిని సమతౌల్యంగా ఉండేట్లు చూసుకోవాలి. చాలా సంస్థలు, పరిశ్రమలు వలస కార్మికులను ఆహ్వానిస్తున్నాయి. కానీ, ఇక్కడి హౌసింగ్, ఆరోగ్య సౌకర్యాలు, సోషల్ సర్వీస్ అంతే వేగంగా విస్తరించడం లేదు. వలస విధానంలో తాజా మార్పులతో ఇక్కడి కమ్యూనిటీలు లక్షల కొద్దీ ఇళ్లు నిర్మించి సిద్ధమయ్యేందుకు సమయం లభిస్తుంది' అని ట్రూడో వివరించారు. అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యను నియంత్రించడంతో టొరెంటో, వాంకోవర్ వంటి నగరాల్లో అద్దెల ధరలు దిగి వస్తున్నాయని ట్రూడో చెప్పారు.

# హసీనాపై దర్యాప్తు వచ్చే నెలలో పూర్తి

**ఢాకా :** గత వేసవిలో జరిగిన వందలాది మంది హత్యల విషయంలో బంగ్లాదేశ్‌లో మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనా, ఆమె సన్నిహితుల చర్యలపై నియమితమైన ప్రత్యేక ట్రిబ్యూనల్ నెల రోజుల్లో దర్యాప్తు పూర్తి చేయాలని దర్యాప్తు చేస్తున్న వారిని ఆదేశించింది. గోలం మొర్తుజా మజుందార్ నేతృత్వంలోని త్రిసభ్య అంతర్జాతీయ ట్రిబ్యూనల్‌ను గత డిసెంబర్ 17న ఏర్పాటు చేశారు. ఈ ట్రిబ్యూనల్ హసీనాను, ఆమె సన్నిహుతులను అరెస్టు చకేసేందుకు భద్రతా దళాలు ఏమి చేశాయని సోమవారం నాడు పోలీసులను ప్రశ్నించింది. దీంతో తమకు కొంత సమయం కావాలని ప్రాసిక్యూటర్‌లకు ట్రిబ్యూనల్‌ను కోరారు. హసీనా ఆగస్టు 5న బంగ్లాదేశ్‌ను వీడి భారతదేశానికి వచ్చి, అజ్ఞాతంలో ఉంటున్నారు. ఢాకాకు చెందిన అంతర్జాతీయ క్రైమ్స్ ట్రిబ్యునల్ అక్టోబర్ 17న



హసీనా, 45 మంది మాజీ క్యాబినెట్ మంత్రులు, సలహాదారులు, మిలిటరి, సివిల్ అధికారులకు అరెస్టు వారెంట్లు జారీ చేసింది. మాజీ న్యాయ శాఖ మంత్రి, హసీనా ప్రవేట్ సెక్టర్ సలహాదారుడు సహా 13 మంది సోమవారం నాడు ట్రిబ్యునల్ విచారణకు హాజరయ్యారు. మరో కేసులో భాగంగా పోలీసు కస్టడిలో విచారణలో ఉన్న మరో మాజీ క్యాబినెట్ మత్రి ట్రిబ్యునల్‌కు హాజరుకాలేదు. మరో ఆరుగురు బుధవారం హాజరుకునున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో 20 మంది అనుమానితులను అరెస్టు చేశారు.

**హసీనాను అప్పగించాలని కోరతాం :** షేక్ హసీనాను తమకు అప్పగించాలని భారత ప్రభుత్వాన్ని కోరతామని బంగ్లాదేశ్ ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ప్రధాన సలహాదారుడు యూనిస్ ఆదివారం జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో వెల్లడించారు. ఇప్పటికే హసీనాను అరెస్టు చేసేందుకు సహకరించాలని ఇప్పటికే ఇంటర్‌పోల్‌ను పోలీస్ ఛీఫ్ కోరినట్లు ట్రిబ్యూనల్‌కు ప్రాసిక్యూటర్ తెలియజేశారు.

# అణ్వాయుధాల తయారీకి సిద్ధం: కిమ్

**ప్యాంగ్యాంగ్:** అపరిమిత సంఖ్యలో అణ్వాయుధాలు తయారు చేయాలని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ తన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అమెరికాను అడ్డుకొనేందుకు ఈ వ్యూహం అనుసరించాలని సూచించినట్లు తెలుస్తోంది. అమెరికాలో ట్రంప్ ఎన్నికైన నాటి నుంచి కిమ్ మరింత దూకుడు పెంచారు. ఇటీవల తన అధికారులతో ఉత్తరకొరియా అధినేత సమావేశమయ్యారు. దక్షిణకొరియాతో కలిసి అమెరికా అణ్వస్త్ర వ్యూహాలకు పదునుపెట్టడాన్ని ఖండించారు. జపాన్‌తో కలిసి ఆసియా నాటో ఏర్పాటుచేయాలన్న ఆలోచనలను ఆయన తీవ్రంగా పరిగణించారు. మరోవైపు రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కీవ్‌కు వాషింగ్టన్ సహకరించడాన్ని ఆయన విమర్శించారు. మాస్కోపై ఉక్రెయిన్‌ను పశ్చిమదేశాలు పావుగా వాడుకొంటున్నాయ



న్నారు. అమెరికా సైన్యం తన పలుకుబడి పెంచుకోవడానికి ఈ యుద్ధాన్ని ఆయుధంగా మలుచుకొందని ఆరోపించారు. ఇటీవల కాలంలో కిమ్‌పుతిన్ బంధం బలపడింది. సరికొత్త ప్రచ్ఛన్న యుద్ధానికి తెరతీసేలా ఈ యుద్ధంలో రెండు దేశాల సేనలు ఉక్రెయిన్‌పై పోరాడుతున్నాయి. రష్యాకు సహకారంపై ప్రత్యక్షంగా ఇప్పటివరకు కిమ్‌జోంగ్ ఉన్ బహిరంగంగా అంగీకరించలేదు. మరోవైపు దక్షిణ కొరియా, అమెరికాపై దాడి చేయడానికి అవసరమైన శక్తి సామర్థ్యాలను కిమ్ సేనలు వేగంగా పెంచుకొంటున్నాయి. అణ్వాయుధాలు, ఖండాంతర క్షిపణులను వేగంగా తయారుచేస్తోంది. కిమ్ సాయానికి ప్రతిగా రష్యాకు చెందిన నిపుణులు ఉత్తర కొరియా అణ్వాయుధాల అభివద్ధి, క్షిపణుల తయారీలో సాయం చేస్తున్నారని ఇటీవల అమెరికా ఎన్ఎస్ఏ జాక్‌సులీవాన్ వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియా త్వరలోనే అణుబాంబు పరీక్ష నిర్వహించవచ్చని దక్షిణ కొరియా ఇంటెలిజెన్స్ సంస్థలు రెండు వారాల క్రితం నివేదికలు ఇచ్చాయి. దీనికి తగినట్లే తాజాగా కిమ్ ప్రకటన వెలువడంతో కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు మరింత రాజేసినట్లైంది.

# ఏ ఒక్క మంచి పని చేయలేదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎం రేవంత్ రెడ్డి తన ఏడాది కాలం లో విద్వేషాన్ని పెంచారే తప్ప, ఏ ఒక్క మంచి పని కూడా చేయలేదని బిఆర్ఎస్ ఎంఎల్‌సి మధుసూధనచారి ఆరోపించారు. తమ ఏడాది పాలనలో కాంగ్రెస్ ఏం ఉద్ధరించిందని సంబరాలు జరుపుతున్నారని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చే సిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ జరపాల్సింది విశ్వాస ఘాతుక సభలు ,విధ్వంస సభలు అని ఎద్దేవా చేశారు. కాళోజి సత్యవాది అని, రేవంత్ రెడ్డి అసత్యవాది అని, అలాంటి సిఎం వరంగల్‌లో కాళోజీ కళామందిరాన్ని ప్రారంభిస్తే కాళోజి ఆత్మ ఘోషిస్తుందని అన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌ను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి వరంగల్‌లో సభ పెట్టే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదన్నారు. నెలకు రూ.18వేల కోట్ల ఆదాయం వస్తుందని సిఎం చెబుతున్నారని, మరి ఏ పథకాలకు కోత వేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కెసిఆర్‌ను తక్కువ చేసి చూపడం తప్ప, రేవంత్ ప్రభుత్వానికి ఏదీ చేతకావడం లేదని ఆరోపించారు.

## ఐటి సోదాలు (మూడవ పేజీ తరువాయి)

తనిఖీలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. షాద్‌నగర్ ప్రాంతంలో రూ.300కోట్ల విలువ చేసే భూమిని మల్టీ నేషనల్ కంపెనీకి విక్రయించిందని, ఈ లావాదేవీలకు సంబంధించిన సొమ్మును స్వస్తిక్ గ్రూప్ తన బ్యాలెన్స్ షీట్‌లో చూపించనందువల్లే తనిఖీలు చేస్తున్నట్లు ఐటి అధికారులు పేర్కొంటున్నారు. స్వస్తిక్ గ్రూపు యజమానుల నివాసాలతోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలు, రియల్ ఎస్టేట్ ఆఫీసుల్లో లావాదేవీలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. అదే విధంగా షాద్‌నగర్ పట్టణంలోని ప్రముఖ వ్యాపారుల ఇళ్ళు, కార్యాలయాల్లో సైతం ఐటి అధికారులు తనిఖీలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. స్వస్తిక్ గ్రూప్ యజమానులు కల్పన రాజేంద్ర, లక్ష్మణ్‌ల నివాసాలతో పాటు షాద్‌నగర్, చేవెళ్ల, బంజారాహిల్స్‌లోని ఇళ్లు, ఆఫీసులలో తనిఖీలు చేపట్టి విలువైన డాక్యుమెట్లను ఐటి అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

## శ్రీలంకకు మహిళా ప్రధాని

(మూడవ పేజీ తరువాయి)

ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుంది. దిస్సనాయకే కొత్తమంత్రివర్గంతో మాట్లాడుతూ, ''తప్పులు చేయకండి, ప్రజలు మనకు ఇచ్చిన ఇంత గొప్ప అధికారాన్ని దుర్వినియోగం చేయకూడదు'' అని హెచ్చరించారు. ప్రధానమంత్రిగా నియమితురాలైన మహిళ హరిణి అమరసూరియ విద్యాశాఖ నిర్వహిస్తారు. మరో మహిళా ఎంపి సరోజా సావిత్రి పాల్‌రాజ్ స్త్రీ–శిశు సంక్షేమశాఖను నిర్వహిస్తారు. కొత్తగా రాజకీయాల్లోకి అడుగుపెట్టి పార్లమెంటు సభ్యులుగా గెలిచిన 12 మందికి వామపక్ష ఎన్‌పిపి (నేషనల్ పీపుల్స్ పవర్) కూటమి ప్రభుత్వం ముఖ్యమైన క్యాబినెట్ శాఖలు అప్పగించింది. కీలకమైన ఆర్థికశాఖను దేశాధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే తనవద్దనే ఉంచుకున్నారు. ఈ కొత్త ముఖాల్లో ఐదుగురు విద్యావేత్తలున్నారు. మంత్రివర్గంలో ప్రధానమంత్రిసహా ఇద్దరు మహిళలు ఉన్నారు. గడచిన 24 సంవత్సరాలుగా పార్లమెంటరీ అనుభవం ఉన్న ఎనిమిదిమంది ఎంపీలకు కూడా ముఖ్యబాధ్యతలు అప్పగించారు. ''ప్రజలు మనకు విస్తారమైన అధికారాలు ఇచ్చారు, ఈ అధికారాలను మనం దుర్వినియోగం చేయకూడదు, ఎవరూ తప్పులు చేయకండి, మీకు ఇచ్చిన అధికారాలకు పరిమితులున్నాయి, వాటిని గుర్తుపెట్టుకుని ఆ విలువలను సమున్నతంగా కాపాడతారని మేం నమ్ముతున్నాం'' అని మంత్రివర్గానికి చెప్పారు.

## కలిసికట్టుగా ప్రతిఘటిద్దాం

(మూడవ పేజీ తరువాయి)

హేమనంతరావు, ఎండి యూసుఫ్, ఎం.శోభన్, కెచ్చెల రంగారెడ్డి, విస్సా కిరణ్ కుమర్, భూపాల్ నాగన్న గౌడ్, ఎస్.ఎల్.పద్మ, శివబాబు, అరుణ, తుడుం అనిల్ కుమార్, వస్కుల మట్టయ్య, జి.గోపాల్, మండల వెంకన్నల అధ్యక్షవర్గంగా ఈ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు పశ్యపద్మ ,టి.సాగర్, కె.కాంతయ్య, వి. ప్రభాకర్, మాజీ ఎంఎల్‌ఎ గుమ్మడి నరసయ్య, వేముపల్లి వెంకట రామయ్య, బి.కొండల్, మామిడాల భిక్షపతి, పి.రమేశ్, బి.భాస్కర్, జక్కుల వెంకటయ్య, వెంకటరాముల, జి.వెంకటేశ్వర్లు, గోనె కుమారస్వామి. సెంట్రల్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఎస్.బాల్‌రాజు,.జి.వెంకటేశ్, కె.సూర్యం, విజయ్‌కుమార్, రాంబాదు, ఎం.శ్రీనివాస్, ఐ.కృష్ణలుమాట్లాడారు. ఈ సందర్భంగా పశ్యపద్మ మాట్లాడుతూ 13 నెలల పాటు ఢిల్లీని అష్ట దిగ్బంధనం చేసి కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రికి, ముచ్చెమటలు పట్టించిన రైతు ఉద్యమం స్ఫూర్తితో ఈ నెల26న నిర్వహించనున్న దేశ వ్యాప్త నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పిలుపు నిచ్చారు. రైతు పండించిన పంటకు గిట్టు బాటు ధరతో సాధించునేవరకు విశ్రమించబోమని పేర్కొన్నారు. బాల్‌రాజు మాట్లాడుతూ కార్మికులు తమ రక్తాన్ని చిద్దించి సాధించుకున్న 46 కార్మిక చట్టాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఏకపక్షగా రద్దు చేసి బడా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా 4 లేబర్ కోడ్‌ల రూపంలో కొత్త చట్టాలను తీసుకు రావడం దారుణమన్నారు. వీటినిఅడ్డుకునేందుకు కార్మిక వర్గం కదిలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు సదస్సు 12 కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి 12, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి 3 మొత్తం 15 డిమాండ్లతో కూడ తీర్మానాన్ని ఆమోదించారు.

# నల్లగొండలో 3 నెలలు పడుకోండి

(మూడవ పేజీ తరువాయి)

చదివిన కెసిఆర్ మూసీ శుద్ధీకరణ వద్దు అని ప్రకటన చేయగలరా అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. సచివాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రైతుల ముసుగులో బిఆర్ఎస్ లీడర్లు, కార్యకర్తలు కలెక్టర్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని తీవ్రంగా ఖండించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో రైతులు, ప్రజలు లగచర్ల మాదిరిగానే దాడి చేస్తే అనాడు కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేసేవారా అని మంత్రి ప్రశ్నించారు. రేప్ కేసులో ఉన్న రౌడీ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఐఎఎస్‌పై దాడులు చేస్తుంటే ఖండించాల్సింది పోయి మా కార్యకర్తేనని సిగ్గులేకుండా కెటిఆర్ స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులపై చట్టం తన పని తాను చేసుకుంటూ వెళ్తోందని కాంగ్రెస్ ప్రభుత్వానిది అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఫాలో అయ్యే పార్టీ అని, అందుకే ప్రతీది చట్ట ప్రకారం జరుగుతుందని తెలిపారు. బిఆర్ఎస్ నాయకులది కెసిఆర్ రాజ్యాంగమని,అందులో న్యాయం, ధర్మం, చట్టం ఉండదని, వాళ్లకు నచ్చకపోతే జైలుకు పోయే పరిస్థితులను మనం కళ్లారా చూసామని ఆయన చెప్పారు. తాను ఎంఎల్‌ఎ, ఎపిగా ఉన్నపుడు కెసిఆర్ తనను అనేకసార్లు హౌస్ అరెస్టు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను ఎట్లా అభివృద్ధి చేయాలో అని ప్రణాళికలు వేసుకుని ప్రయత్నాలు చేస్తుంటే.. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతీదాన్ని రాజకీయం చేస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. వరంగల్ జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాదాపు రూ.4 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని ఆయన చెప్పారు.

**8 నెలల్లో మామునూర్ ఎయిర్ పోర్ట్ ప్రారంభిస్తాం**

ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల చిరకాలవాంఛ అయిన మామునూర్ ఎయిర్ పోర్ట్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు. ఎయిర్ పోర్ట్‌ను రానున్న 8 నెలల కాలంలో ప్రారంభం చేయనున్నామని ఆయన చెప్పారు. మొదటి దశలో మామునూర్ ఎయిర్ పోర్ట్‌ను స్మాల్ ఎయిర్ క్రాఫ్ట్స్ రాకపోకలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు, మాస్టర్ ప్లాన్ తయారీ, ఎయిర్ పోర్ట్ డెవలప్‌మెంట్ చేసేందుకు 8 నెలల పూర్తవుతుందని చెప్పారు. రెండవ దశలో రోజంతా ఇంటర్ నేషనల్ విమానాలు కార్గో విమానాల ఆపరేషన్ చేయడానికి రానున్న 18 నెలల్లో అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, దీనికి సంబంధించి ఇప్పటికే ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి ఆదేశాలు వచ్చాయని ఆయన ప్రకటించారు. ఎయిర్ పోర్ట్ విస్తరణకు అవసరమైన 253 ఎకరాల భూసేకరణకు రూ.205 కోట్లను విడుదల చేసినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో భద్రాద్రి కొత్తగూడెం, రామగుండం గ్రీన్ ఫీల్డ్ ఏయిర్ పోర్టులకు వీలైనంత త్వరగా అనుమతులు సాధించి నిర్మాణం చేపడతామని చెప్పారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో చర్చించామని , అందుకు సానుకూలంగా స్పందించారని మంత్రి గుర్తుచేశారు. బిఆర్ఎస్ పార్టీ పదేండ్లలో సాధించని ఎయిర్ పోర్టులను నాలుగేండ్లలో సాధించి చూపిస్తామని మంత్రి తెలిపారు.

**హైదరాబాద్–విజయవాడ రహదారి అభివృద్ధి :** హైదరాబాద్ – విజయవాడ (ఎన్‌హెచ్65) విస్తరణ పనులు చేపట్టాలని నేను అడిగిన వెంటనే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ 6 వరుసల ఎక్స్‌ప్రెస్ హైవేను మంజూరు చేశారని మంత్రి చెప్పారు ప్రస్తుతం దానికి సంబంధించిన డిపిఆర్ పూర్తయ్యే స్టేజీలో ఉందని, డిపిఆర్ పూర్తయిన వెంటనే జనవరి లేదా ఫిబ్రవరిలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. దీంతో హైదరాబాద్ – విజయవాడ మధ్య ప్రయాణం మరింత మెరుగవుతుందని, ప్రయాణ సమయం తగ్గుతుందని తద్వారా విమానాల్లో వెళ్లే ప్రయాణికులు సైతం రోడ్డు మార్గంలో వెళ్తారని ఆయన వెల్లడించారు.

హైదరాబాద్ – భూపాలపట్నం ఎన్‌హెచ్163 పరిధిలో నిర్మిస్తున్న ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులను ఆగష్టు 2018లో శంకుస్థాపన చేశారని.. గత ప్రభుత్వంలో కేవలం 30 శాతం పనులనను మాత్రమే పూర్తిచేశారని, హైదరాబాద్ అభివృద్ధి చేశామని చెప్పుకుని తిరిగే బిఆర్ఎస్ నాయకులు నాలుగున్నరేండ్లలో ఉప్పల్ ఫ్లైఓవర్‌ను ఎందుకు పూర్తి చేయలేకపోయారని ఆయన ప్రశ్నించారు. ఉప్పల్ నుంచి మేడిపల్లి వరకు ఫ్లైఓవర్ పూర్తి కావడానికి ఒకటిన్నర సంవత్సరం పడుతుందన్నారు.

**ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని రాష్ట్రమే నిర్మిస్తుంది.**

హైదరాబాద్ అభివృద్ధికి, తెలంగాణ అభివృద్ధికి సూపర్ గేమ్ ఛేంజర్ లాంటి ఆర్ఆర్ఆర్ ను నిర్లక్షం చేసిన వారు రెండు బ్రిడ్జులు కట్టి మేమే హైదరాబాద్ నిర్మాతలమని చెప్పుకు తిరిగడం కొందరికే చెల్లిందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆర్ఆర్ఆర్ (రీజినల్ రింగ్ రోడ్డు) ను 2017–18 లో ప్రారంభించి ఇప్పటిదాకా ఒక్క పనిని కూడా చేయకపోవడం వారికే చెల్లిందని ఆయన ఎద్దేవా చేశారు. ఆర్ఆర్ఆర్ రోడ్డు నిర్మాణం మొదట కేంద్రమే నిర్మిస్తుందని చెప్పారని, కానీ ఇప్పటికీ కూడా కేంద్ర ప్రభుత్వం దీనిపై ఎలాంటి క్లారిటి గానీ, కమిట్ మెంట్ గానీ ఇవ్వలేదన్నారు. దీంతో పనులు ఆలస్యం జరిగితే రాష్ట్ర అభివృద్ధికి ఆటంకం జరుగుతుందనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వమే ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం స్వయంగా నిర్మించాలనుకుంటున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

**తెలంగాణ తల్లి విగ్రహ పనులను పరిశీలించిన మంత్రి** :సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ నిర్మాణ పనులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పరిశీలించారు. డిసెంబర్ మొదటి వారంలో పనులు పూర్తి చేసేలా అధికారులకు దిశానిర్ధేశం చేశారు. లక్షలమంది సాక్షిగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని చెప్పారు. తెలంగాణ ప్రజల బాగుకోసం అహర్నిశలు శ్రమిస్తున్నామని, వారి ఆశీర్వాదం ఉంటే ఏ పక్షం కాంగ్రెస్ పార్టీ ని ఏమీ చేయలేవని వచ్చే ఇరవై ఏండ్లు కాంగ్రెస్ పార్టీదేనని తేల్చిచెప్పారు.

## నేడు కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం (మూడవ పేజీ తరువాయి)

అథారిటీ (కుడా) పర్యవేక్షణలో పూర్తి అయింది. ఈ కళాక్షేత్రంలో ఎన్నో ప్రధాన ఆకర్షణలున్నాయి. ఈ కళాక్షేత్రం 1.77 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించబడింది. ప్రధాన ఆడిటోరియంలో 1,127 మందికి సీటింగ్ సామర్థ్యం ఉండడంతో పాటు మొత్తం సెంట్రలైజ్డ్ ఏయిర్ కండీషన్‌తో నిర్మించారు. అలాగే అత్యాధునిక ఆడియోవిజువల్ సిస్టమ్‌లతో ఇది సాంస్కృతిక కార్యక్రమాలు, థియేటర్ ప్రదర్శనలు, ఇతర కళారంగ కార్యక్రమాలకు అనువైన వేదికగా మారనుంది. చిన్న సాంస్కృతిక సమావేశాల కోసం ప్రత్యేకంగా నాలుగు మినీ హాళ్లు కూడా కళాక్షేత్రంలో ఏర్పాటు చేశారు. కాగా ఆర్ట్ గ్యాలరీ పేరుతో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనశాల ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ప్రముఖ కవి కాళోజీ నారాయణరావు ఫొటోలు, జ్ఞాపకాలు, పురస్కారాలు వంటి అంశాలు ఇందులో ప్రదర్శించబడతాయి. కళాక్షేత్రం ప్రారంభోత్సవానికి ముందుగా కాళోజీ నారాయణరావు విగ్రహాన్ని ఆవిష్కరించి, ఆర్ట్ గ్యాలరీని సందర్శిస్తారు. అనంతరం కాళోజీ జీవితం కళాక్షేత్రం అభివృద్ధిపై చేసిన షార్ట్ ఫిల్మ్‌ను వీక్షించనున్నారు. సిఎం రేవంత్ రెడ్డితో పాటు ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి, అటవీ, పర్యావరణ మంత్రి కొండ సురేఖ, పంచాయతీ రాజ్ మంత్రి దనసరి అనసూయ, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపిలు పోరిక బాలరాం నాయక్, కడియం కావ్య, ఉమ్మడి వరంగల్ జిల్లాల ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామరెడ్డి, సమాచార, ప్రజా సంబంధాల కమిషనర్ ఎస్. హరీష్, పంచాయతీ రాజ్ కమిషనర్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, సెర్ప్ సిఇఒలు, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ అశ్విని తనాజీ వాకడే, కాళోజీ ట్రస్ట్ సభ్యులు పాల్గొననున్నారు. కాగా ఇప్పటికే జిల్లా యంత్రాంగం ఈ ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది.

**వరంగల్‌కు కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి నిధులు**

ఇందిరా మహిళా శక్తి సభ ఏర్పాట్లను మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కొండ సురేఖ, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఏమ్మెల్యే లు నాయిని రాజేందర్ రెడ్డి , కెఆర్ నాగరాజు,వద్దూరి లక్ష్మణ్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ , కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి రెడ్డి తదితరులు పరిశీలించారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కొండ సురేఖ మాట్లాడుతూ వరంగల్ ప్రజలకు గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతూ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధికి నిధులను కేటాయించి నేడు వరంగల్ జిల్లాకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి కి సాదర స్వాగతం పలుకుతున్నామని అన్నారు. అత్యధిక నిధులు కేటాయించినందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల పక్షాన ప్రత్యేకంగా ధన్యవాదాలు,కృతజ్ఞతలు తెలియజేస్తూన్నామన్నారు. ఇందిరా మహిళా శక్తి సభకు ముఖ్యమంత్రి రాకను మనమందరం స్వాగతించాలని,మహిళలు పెద్దయెత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

## గిరిజనులపై ఇదేం వెఖరి ? (మూడవ పేజీ తరువాయి)

అక్కడికి వచ్చి దాడులకు పాల్పడి ఉంటారేమో తప్ప తాము ఎలాంటి దాడులకు పాల్పడలేదని స్పష్టం చేశారు. దాడుల ఘటన తరువాత అర్ధ రాత్రి పోలీసులు తండాలలోకి వచ్చి కరెంటు తీసి వేసి ఇండ్లలోకి చొరబడి ఆడవాళ్లు అని కూడా చూడకుండా తాగిన మైకంలో ఎక్కడ బడితే తాకి నలిపేస్తూ చిత్ర హింసలకు గిరిచేయడం జరిగిందని కన్నీరుమున్నీరయ్యారు. కొంతమంది నాయకులకు పోలీసులు ఎస్కార్ట్ కల్పిస్తూ బందోబస్తు ఎందుకు ఇస్తున్నారని, అలాంటప్పుడు జిల్లా కలెక్టర్ కు ఎందుకు ఎస్కార్ట్ ఇవ్వరని నిలదీశారు. దాడులకు మాకు ఎలాంటి సంబంధం లేదని, అసభ్యకరంగా ప్రవర్తించిన పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బాధిత గిరిజనులు డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన జాతీయ కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్ పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ జిల్లా ఎస్‌పి నారాయణపై మండిపడ్డారు. తండాలలో ఎక్కడా పోలీసులు కనబడకూడదని, గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను తొలగించి ఇక నుంచి ఎలాంటి అరెస్టులు చేయరాదని హెచ్చరించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఇలాంటి దుర్ఘటనలు చోటుచేసుకోవడం మంచిది కాదన్నారు. గిరిజనుల పట్ల ఇదేమి వైఖరి అని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ వస్తే పోలీసులు ఎందుకు రక్షణ కల్పించలేకపోయారో తెలియాల్సి ఉందని, దీనిపై తక్షణమే డిజిపి, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి స్పందించి వెంటనే నివేదిక ఇవ్వాలన్నారు. మహిళలు అని చూడకుండా పోలీసులు వ్యవహరించిన తీరుపై మండిపడుతూ దీనికి కారణమైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని హుస్సేన్ నాయక్ ఐజి సత్యనారాయణను ఆదేశించారు.

**అసలు ప్రభుత్వం ఏం చేయాలనుకుంది ?**

పోలేపల్లి, లగచర్ల గ్రామాలలో ప్రభుత్వం ఏం చేయాలనుకున్నదని హుసేన్ నాయక్ ప్రశ్నించారు. ఫార్మా కంపెనీ పెట్టాలనుకున్నదా ? అలా అయితే ఎలాంటి పరిశ్రమలు పెట్టాలనుకుందో స్పష్టత ఇవ్వాల్సి ఉందన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన తరువాత హైద్రాబాద్‌లో కొంతమంది నాయకులు తనను కలిసి గోదు వెళ్లబుచ్చారని, న్యాయం చేయాలని అభ్యర్థించారని ఆయన వెల్లడించారు. తాము అక్కడ ఫార్మా కంపెనీ పెట్టడం లేదని చెప్పారని, అలాంటప్పుడు ఎలాంటి కంపెనీ పెడుతుందో స్పష్టత ఇవ్వకపోవడం ఆక్షేపణీయమన్నారు. భూములకు తక్కువ ధరలో విలువ కడుతూ మోసం చేయడం తగదన్నారు. కొంత మంది కుట్రపూరితంగా తండావాసులను అడ్డంపెట్టుకని దాడులకు పాల్పడటం జరిగిందని అలాంటి వారిపై పోలీసులు గట్టి నిఘాను ఏర్పాటు చేసి కారకులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

## నేడు హన్మకొండకు సిఎం రేవంత్‌రెడ్డి

(మూడవ పేజీ తరువాయి)

కానున్నారు. ఈ నేపథ్యంలో హన్మకొండ, వరంగల్, కాజీపేట ట్రైసిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వరంగల్ మహానగర అభివృద్ధికి మునుపెన్నడూ ఏలని విధంగా దాదాపు రూ. 5 వేల కోట్లతో వివిధ పనులకు నిధులను కేటాయించింది. సిఎం పర్యటనలో భాగంగా మంగళవారం నాడు ప్రారంభోత్సవాలు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ముఖ్యంగా కాళోజీ కళాక్షేత్రాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. అనంతరం హన్మకొండ ఆర్ట్స్ కాలేజీలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. సభకు ఇందిరా మహిళా శక్తి సభగా నామకరణం చేశారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వారం రోజులుగా మంత్రులు అక్కడే మోహరించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**సిఎం షెడ్యూల్ :** మధ్యాహ్నం 2:30 గంటలకు హన్మకొండ కుడా గ్రౌండ్స్ హెలిపాడ్‌కు సిఎం చేరుకుంటారు. ముందుగా కాళోజీ కళాక్షేత్రం ప్రారంభించి ఆర్ట్ గ్యాలరీని సందర్శిస్తారు. 3 గంటలకు ఆర్ట్స్ కాలేజ్ లో ఏర్పాటు చేసిన విజయోత్సవ వేదికకు చేరుకుంటారు. 3:20 గంటలకు అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శించి.. మహిళా స్వయం సహాయక సంఘాలు, మండల సమాఖ్య, జిల్లా సమాఖ్య సభ్యులతో ముఖాముఖి మాట్లాడుతారు. 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు ముఖ్యమంత్రి అక్కడే శంకుస్థాపన చేస్తారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా బ్యాంక్ లింకేజ్ చెక్కులు, బీమా చెక్కులు పంపిణీ చేస్తారు. అనంతరం వేదికపై ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు.

**ఉమ్మడి వరంగల్‌కు రూ. 4962.47 కోట్లు**

వరంగల్ మహా నగరం అభివృద్ధి కి గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 4962.47 కోట్లు కేటాయించింది ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల తో వివిధ విభాగాల పరిధిలో నగరంలో చేపట్టే పనులకు ఈ నిధులు మంజూరు చేసింది. విజయోత్సవం లో భాగంగా కొన్ని పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ వరుసగా ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ : రూ.4,170 కోట్లు మామునూరు ఎయిర్ పోర్ట్ భూసేకరణ: రూ. 205 కోట్లు కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ : 160.92 కోట్లు టెక్స్ టైల్ పార్కులో రోడ్లు, స్కూల్స్, సదుపాయాలు ..రూ.33.60 కోట్లు టెక్స్ టైల్ పార్క్ కు భూములు ఇచ్చిన రైతులకు 863 ఇందిరమ్మ ఇండ్లు.. రూ. 43.15 కోట్లు కాళోజీ కళాక్షేత్రం రూ.85 కోట్లు పరకాల నుంచి ఎర్రగట్టు గుట్ట వరకు రోడ్డు విస్తరణ : రూ. 65 కోట్లు నయీమ్ నగర్ బ్రిడ్జి నిర్మాణం: రూ.8.3 కోట్లు వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ బిల్డింగ్ రూ. 32.50 కోట్లు ఇన్నర్ రింగ్ రోడ్ రూ.80 కోట్లు భద్రకాళి ఆలయం వద్ద పాలిటెక్నిక్ కాలేజీ న్యూ బిల్డింగ్ : రూ.28 కోట్లు గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు : రూ. 49.50 వరంగల్ ఉర్దూ భవన్, షాదీ ఖానా : 1.50 కోట్లు

## 'కులగణన'పై అస్యత ప్రచారం

(మూడవ పేజీ తరువాయి)

రెండు రోజుల్లో సమగ్ర వివరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కులగణన సర్వే ఒక బోగస్ అని, సర్వేలో పాల్గొంటే స్కీములు పోతాయని ప్రతిపక్ష పార్టీ తప్పుడు,అసత్య ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. కులగణనపై ప్రతిపక్ష పార్టీ చేపడుతున్న గోబెల్ ప్రచారాన్ని ప్రజలు ఎవ్వరూ నమ్మవద్దని, ఈ సర్వే వల్ల ఎటువంటి నష్టం జరగబోదని, ఏ స్కీములను రద్దు చేయబోమని మంత్రి పొంగులేటి భరోసనిచ్చారు. ములుగు జిల్లాల్లో 87.7 శాతం, నల్లగొండలో 81.4 శాతం, జనగాంలో 77.6 శాతం, హైదరాబాద్‌లో 38.3 శాతం సర్వే పూర్తయిందని వివరించారు. ఈ సర్వేలో ఇప్పటికే కెసిఆర్ కుమార్తె కవిత పాల్గొన్నారని, కెసిఆర్, కెటిఆర్, హరీశ్ రావు కూడా సర్వేలో పాల్గొనాలని ఆయన సూచించారు. సమగ్ర కుటుంబ సర్వేతో రాష్ట్రానికి, ప్రజలకు ఏమైనా మేలు జరిగిందా అని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. సమగ్ర కుటుంబ సర్వే నివేదిక ఎక్కడుందో తమకే తెలియదని, ఈ నివేదికను బయటికి తీస్తామని చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఖమ్మంలో మిర్చి రైతులను జైలులో పెట్టారని, లాఠీచార్జీ చేశారని గుర్తు చేశారు. రైతులను కష్టపెట్టాలని తమ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉండబోదని స్పష్టం చేశారు. రైతుల ముసుగులో కలెక్టర్, ఉన్నతాధికారులపైన దాడి చేశారని , వీటికి సంబంధించిన అన్ని విషయాలు వెలుగులోనికి వస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## 15 ఏళ్ల వయస్సు నుంచే పార్టీతో అనుబంధం

### 91 సంవత్సరాల సుశీల



**ప్రజాపక్షం/ఖమ్మం :** కుటుంబ, బం ధుత్వాల కంటే కమ్యూనిస్టు పార్టీతో బంధం బలమైనదని, తుది శ్వాస వరకు ఆ బంధాన్ని కొనసాగి స్తానని 91 సంవత్సరాల పాలడుగు సుశీల తెలిపారు. భారత కమ్యూ నిస్టు పార్టీ శత వసంత వేళ ఆమె కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని స్వీకరిం చారు. 15 ఏళ్ల ప్రాయం నుంచే కమ్యూనిస్టు పార్టీలో పనిచేశానన్న సుశీల మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి నుంచి సోమవారం సభ్యత్వ రుసుము చెల్లించి పార్టీ సభ్యురాలిగా చేరారు. అప్పటి కృష్ణాజిల్లా తిరువూరు ప్రాంతానికి చెందిన పాలడుగు సుశీల యుక్త వయస్సులోనే కమ్యూనిస్టు పార్టీ అనుబంధ ప్రజానాట్యమండలిలో పనిచేశారు. బుర్రకథ దళాలతో కలిసి గ్రామగ్రామాన తిరిగారు. పలు కళారూపాల్లో ఆమె నటిం చారు. మహిళా సమాఖ్యలో కార్యకర్తగా పని చేశారు. తుదిశ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీతో తన అనుబంధాన్ని కొనసాగిస్తానని, తమ పుట్టింటి వారిది కమ్యూనిస్టు పార్టీ కుటుంబమని, తన భర్త వేరే పార్టీకి చెందిన వ్యక్తి అయినప్పటికీ తాను మాత్రం కమ్యూనిస్టుగానే జీవించానని సుశీల గ ర్వంగా తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ప్రస్థానం తనను ఎంతో సంతోషపరిచిందని సుశీల తెలిపారు.

## 50 ఏళ్లుగా ఎర్రజెండానే : అప్పస్వామి



**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలిసీ తెలియని వయ స్సులో ఎర్రజెండా పట్టుకున్నానని, తుది శ్వాస వరకు దానిని వదిలేది లేదని ఖమ్మం నగర పరిధిలోని చెందిన వాకదాని పెద్ద అప్ప స్వామి తెలిపారు. తన తండ్రి భిక్షమయ్య, తిరుపతమ్మలు కమ్యూనిస్టుపార్టీలో ఉండేవా రని తాను కూడా చిన్నతనం నుంచే కమ్యూ నిస్టు పార్టీ కార్యక్రమాలకు మా నాన్నతో పాటు హాజరయ్యేవాడినని, కమ్యూనిస్టు నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, రజబ్‌అలీ అంటే తమకు అమిత ప్రేమ అని అప్పస్వామి తెలిపారు. 76 ఏళ్ల వయస్సులో కమ్యూ నిస్టు పార్టీ సభ్యత్వం పొందుతున్నందుకు సంతోషిస్తున్నానని కమ్యూనిస్టు పార్టీ వందేళ్లు పూర్తి చేసుకుంటున్నందుకు ఆనందం గా ఉందన్నారు. ఖానాపురం హవేలీ కార్యదర్శి ఏనుగు గాంధీ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ సోమవారం అప్పస్వామి సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ విజయాలను చూడాలనేదే నా ఆకాంక్ష అన్నారు.

## పేదలు, కార్మికుల పక్షపాతి సిపిఐ

### పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల



**ప్రజాపక్షం/మధిర :** పేదలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పక్షాన పోరాటాలు చేస్తున్న పార్టీ సిపిఐ అని పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఐ కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు అన్నారు. సోమవారం మున్సిపాల్టీ పరిధిలోని మడుపల్లి సిపిఐ కార్యాలయం అజయ్ భవన్‌లో పార్టీ కౌన్సిల్ సమావేశం సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండల రావు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబర్ 26నాటికి సిపిఐ వందేళ్ల వసంతాలు పూర్తి చేసుకుం టున్న తరుణంలో ఉత్సవాలను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని, పార్టీ చరిత్రను, త్యాగాలను ప్రజలకు వివరించడంతో పాటు అమరులకు నివాళులర్పించాలన్నారు. అనంతరం సమావేశంలో హాజరైన సభ్యుల్లో 40మంది పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, సిపిఐ నాయకులు రహీం, రైతు సంఘం మండల అధ్యక్షులు పంగా శేషగిరిరావు, సిలువేరు శ్రీనివాస రావు, అన్నవరపు సత్యనారాయణ, రంగు నాగకృష్ణ, పున్నవెల్లి అప్పా రావు, జల్ల బ్రహ్మం, ఎస్కే కొండ పాల్గొన్నారు.

## మానవీయతను చాటిన మల్లన్న



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** ఆర్‌టిసిలో డ్రైవ ర్‌గా పనిచేస్తున్న మణుగూరు డిపోకు చెందిన మల్లన్న మానవతను చాటాడు. బస్సు నడప డంతో పాటు ప్రయాణికుల యోగక్షేమాలు, వారిని సురక్షితంగా గమ్యం చేర్చడంపై దృష్టి సారించే మల్లయ్య సోమవారం ప్రయాణికు రాలికి తోడుగా నిలిచి అధికారుల, ప్రయాణి కుల ప్రశంసలు పొందారు. మణుగూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్‌టిసి బస్సులో ఓ ప్రయాణికురాలు చంటిపాప ఉంది. ఖమ్మం బస్టాం డ్‌కు రాగానే ఆమె వ్యక్తిగత అవసరాల కోసం కిందకు దిగుదామంటే ఆ చిన్నారిని పట్టుకునే వారు ఎవరులేరు. మహిళ ఇబ్బందిని గమనించిన డ్రైవర్ మల్లయ్య ఆ పాపను ఎత్తుకుని తల్లి వచ్చేంత వరకు లాలించాడు. ఆ ప్రయాణికురాలు మల్లన్నకు కృతజ్ఞతలు తెలిపింది. విషయాన్ని తెలుసు కున్న ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ సరిరామ్ మల్లయ్యను సత్కరించారు.

## హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వినతి



**ప్రజాపక్షం/ఖమ్మం :** సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని జార్జీ రెడ్డి పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఎస్‌సి కార్పోరేషన్ డిడి కస్తాల సత్య నారాయణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జార్జీరెడ్డి పిడిఎస్‌యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందా సురేష్, భూక్యా ప్రభుదేవా మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు చలికి ఇబ్బందులు పడుతున్నారని, దుప్పట్లు, స్వెట్టర్లు అందించాలని అన్ని సంక్షేమ హాస్టళ్లలోనూ వేడి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవా లని కోరారు. శీతాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు.

## సీతారత్నం చారిటబుల్ ట్రస్టు చేయూత



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉన్నత విద్యకు పేదరికం అడ్డు కాకూడదనే లక్ష్యంతో పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు నిరుపేద విద్యార్థులకు చేయూ తనందిస్తుంది. రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందిన గుర్రం వర్షిత కుటుంబం ఫీజులు చెల్లించలేని స్థితిలో పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టును ఆశ్రయించారు. స్పందించిన పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ పరిశ పుల్లయ్య బీమా ఉదయ్‌కిరణ్, కృష్ణకుమారి దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా వారి కోరిక వర్షితకు రూ.20వేల ఆర్థిక సహా యాన్ని, జ్ఞాపికను సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో కనపర్తి వెంకటేశ్వర్లు, విద్యార్థిని తల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు.

# దేవుని సేవకు దరఖాస్తులు



### అభివృద్ధి, ఆలయ భూముల రక్షణపైనే భక్తుల ఆశలు

### ఉమ్మడి జిల్లాలో 14,391 ఎకరాల ఆలయ భూములు



**ప్రజాపక్షం/ఖమ్మం :** దేవుని సేవకు దరఖాస్తుల సందడి మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లాలోని ప్రధాన ఆలయాలకు పాలక మండళ్లను ఏర్పాటు చేయాలని ఉత్త ర్వులను జారీ చేసింది. ఈ ఉత్తర్వులను ఈనెల 13న జారీ చేసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 13 ఆలయా లకు పాలక మండళ్లను ఏర్పాటు చేసే క్రమంలో దేవుని సేవ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానించింది. దర ఖాస్తు ప్రక్రియ నామమాత్రమేనని అందరికీ తెలిసిన విష యమే. ఎక్కువ భాగం ఆలయ పాలక మండలి సభ్యులు గా, ఛైర్మన్‌గా అధికార పార్టీ వారే నియమితులవుతారు. కానీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ అయినా 20 రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తు చేసుకునే వ్యక్తు లు భగవంతునిపై నమ్మకం కలిగి ఉండడంతో పాటు గతంలో దివాళా పిటిషన్లు దాఖలు చేయకుండా ఉండి ఉండాలి. మానసిక దివ్యాంగులు, అంటువ్యాధులతో బాధపడుతున్న వారు, క్రిమినల్ కేసులు ఉన్నవారు దేవా దాయశాఖ నుంచి వేతనం పొందుతున్న వారు, హిందూ మతాన్ని వ్యతిరేకించే వారు ధర్మకర్తలుగా ఉండడానికి అనర్హులు. దరఖాస్తుల ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆలయ పాలక మండళ్ల నియామకం జరుగుతుంది. అధి కార పార్టీకి చెందిన పలువురు తమ తమ స్థాయిలను బట్టి పైరవీలు ప్రారంభించారు. ప్రధానం గా భద్రాచలం రామాలయం, పాల్వంచ పెద్ద మ్మగుడి, జమలాపురం వెంక టేశ్వరస్వామి దేవాలయంతో పాటు ఖమ్మం రూరల్ మండ లంలోని మారెమ్మగుడి, ఖమ్మం కమాన్‌బజార్‌లోని వెంకటేశ్వర స్వామి, స్థం భాద్రి లక్ష్మి నర్సింహాస్వామి, కందుకూరు వెంకటేశ్వర స్వామి, గార్లొడ్డులోని లక్ష్మి నర్సింహాస్వామి, తీర్థాల సంఘమేశ్వర స్వామి, అన్నపురెడ్డిపల్లిలోని బాలాజీ, పెనుబల్లి మండలంలోని నీలాద్రి, కొత్తగూడెంలోని విజయ విఘ్నేశ్వర స్వామి ఆలయాలు ఉన్నాయి. భద్రా చలం రామాలయంకు పాలక మండళ్లు లేక దాదాపు దశాబ్ద కాలం ముగిసింది. రూ. 80 కోట్ల వార్షిక ఆదాయం కలిగిన భద్రాద్రి దేవాలయం ట్రస్టు బోర్డు చైర్మన్ కోసం పెద్ద ఎత్తున పైరవీలు మొదలయ్యా యి. అదే పరిస్థితి పాల్వంచ పెద్దమ్మగుడి, జమలాపురం వెంకటేశ్వర స్వామి దేవాలయం ట్రస్టు బోర్డు ఛైర్మన్ పద వికి తీవ్రమైన పోటీ ఉంది. మిగిలిన ఆలయాలకు ఆయా స్థాయిలను బట్టి పోటీపడుతున్నారు. కాంగ్రెస్ అధికారం లోకి వచ్చి ఏడాది గడిచిన సందర్భం గా పదవులపై పలు వురు నేతలు ఆశలు పెంచుకున్నారు. దరఖాస్తులతో పాటు పైరవీల జోరు కూడా ప్రారంభమైంది. కాంగ్రెస్‌లోని ప్రధాన నాయకుల అనుచరులు తమ పరిచయాలతో పదవులు దక్కించుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు మొదలు పెట్టారు.

### అభివృద్ధి, భూముల రక్షణే ముఖ్యం

గత కొంతకాలంగా ఆలయాల అభివృద్ధి కుంటు పడడమేగాక ఆయా ఆలయాలకు ఉన్న ఆస్తులు కూడా పలు విధాలుగా ఆక్రమణలకు గురి కావ డం, లిటిగేషన్లలో ఉండడం జరిగింది. దక్షిణ అయో ధ్యగా పేరు గాంచిన భద్రాచలం రామాలయం భూము లు కూడా ఇప్పుడు ఒకరకమైన వివాదంలో ఉన్నాయి. రాముడు తెలంగాణలో భూములు ఆంధ్రాలో ఉండడం కొంత మేర ఇబ్బందికరంగా ఉంది. ఆలయ భూములు ఉన్న పురుషోత్తమ పట్టణం సహా ఐదు గ్రామాలను తెలం గాణలో విలీనం చేయాలన్న డిమాండ్ ఊపందుకుం టుంది. పాలక మండలి ఏర్పాటైతే పాలక మండలి నేతృ త్వంలో ఆందోళనలు చేయడం ప్రభుత్వపరంగా భూ ములున్న గ్రామాన్ని ఈవైపుకు తిప్పుకునేందుకు ప్ర య త్నాలు తీవ్రతరం చేయవచ్చునని భక్తులు ఆశతో ఉన్నారు. అలాగే చింతకాని మండలంలోని చెన్నకేశవ దేవాలయ భూములు కూడా ఇదే రకమైన వివాదంలో ఉన్నాయి. ఇక నగరాలు, పట్టణాల్లో ఉన్న దేవాలయ ఆస్తులు కబ్జాలకు గురయ్యాయి. కొన్ని భూములు అన్యా క్రాంతమయ్యాయి. ఈనేపథ్యంలో దేవాలయ భూములు రక్షణ కోసం దేవాలయ అభివృద్ధి కోసం నూతనంగా ఏర్పడే పాలక మండళ్లు పనిచేస్తాయన్న ఆశతో ఉన్నారు.

### భూములు అన్యాక్రాంతం

ఉమ్మడి ఖమ్మంజిల్లాలో 200లకు పైగా ఉన్న దేవాల యాలకు 14391.32 ఎకరాల భూములు ఉన్నాయి. ఇందులో ఖమ్మంజిల్లాలో 4755.3 ఎకరాలు ఉండగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 9636.02 ఎకరాల భూమి ఉంది. ఇందులో 1595 ఎకరాల భూమి అర్చక మండళ్లు వివిధ రకాల సేవల క్రింద ఉండగా 9675 ఎక రాలు కౌలుకు ఇస్తున్నారు. ఖమ్మంజిల్లాలో 833 ఎక రాలు, భద్రాద్రి కొత్తగూడెంలో 1151 ఎకరాలు వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. 1137 ఎక రాలు సాగుకు లాకి కాని భూమి ఉంది. ఈ దేవాదాయ భూములకు సంబంధించి పలుచోట్ల ఆక్రమణలు జరిగి నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఖమ్మం నగరంలో ఓ ప్రధాన దేవాలయానికి సంబంధించిన విలువైన భూములు కబ్జాకు గురయ్యాయి. పలువురు ఆక్రమించి వివిధ నిర్మాణాలు చేపట్టారన్న ఆరోపణలు ఎదురవుతు న్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడే పాలక మండళ్లు అభివృద్ధితో పాటు ఆలయాల ఆస్తుల రక్షణపై దృష్టిసా రించాలని భక్తులు కోరుతున్నారు.

# నాణ్యమైన సేవలతోనే గుర్తింపు





### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజలకు నాణ్యమైన వైద్య సేవ లను అందించి వారి అభిమానాన్ని చూరగొనాలని రాష్ట్ర వ్యవ సాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు తెలిపారు. ఖమ్మం నగరంలోని వైరా రోడ్డు పాత ఆరో గ్య ఆసుపత్రిలో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు తోట లక్ష్మణ్‌కు మార్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన టిఆర్‌ఆర్ ఆర్థో, యాక్సిడెంటల్ కేర్ యూనిట్‌ను సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందు తున్న ఖమ్మం నగరంలో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అధునాతన సౌకర్యాలతో తక్కువ ఖర్చుతో అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన టిఆర్‌ఆర్ ఆసుపత్రి వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తేనే గుర్తింపు లభిస్తుందన్నారు. ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి అత్యవసర సేవల విభాగం, ఆపరేషన్ థియేటర్లను ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఎంపి మాట్లాడుతూ నాణ్యమైన వైద్యసేవలను అందించి ప్రజల అభిమానాన్ని చూరగొనాలన్నారు. డాక్టర్ తోట లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు తక్కువ ఖర్చుతో అత్యాధునీక సౌకర్యాలతో ఆర్థోపెడిక్ విభాగంలో వైద్య సేవ లను అందించాలనే లక్ష్యంతో తన తండ్రి పేరుతో టిఆర్‌ఆర్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆర్థోపెడిక్‌కు సంబంధించి అన్నిరకాల వైద్యసేవలు తమ ఆసుపత్రిలో అం దుబాటులో ఉన్నట్లు తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు ఆసుపత్రి ప్రారం భోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట గోవిందమ్మ, రామారావు, శీలంశెట్టి రమావీరభద్రం, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది రానివ్వొద్దు

### పోలీస్ కమిషనర్ సునీల్‌దత్



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బం దులు కలగనీయవద్దని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ను సోమవారం సిపి ఆకస్మికంగా సంద ర్శించారు. రైతులతో మాట్లాడారు...వారి సమస్య లను అడిగి తెలుసుకున్నారు. దిగుబడులు, పెట్టు బడులు, రవాణా, క్రయ, విక్రయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు ద్వారా మార్కెట్ ద్వారా జరిగే క్రయ, విక్రయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులకు అందిస్తున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బం దులు కలగనీయకుండా తగిన చర్యలు తీసుకోవా లని సూచించారు. కాంటాలు వేగవంతం చేయా లని, ఎప్పటికప్పుడు రవాణా చేపట్టాలని సూచిం చారు. నిర్వహకులు నిర్లక్ష్యం చేయవద్దని సూచిం చారు. రైతుల ఆసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల పై ప్రత్యేక దృష్టి సారించాలని అదికారులను ఆదేశిం చారు. స్వయంగా పత్తి తేమ శాతం ను పరిశీలిం చారు. అనంతరం సింగారెడ్డిపాలెం లోని గురు కుల బాలికల పాఠశాలను సందర్శించారు. విద్యా ర్థుల సమస్యలపై ఆరా తీశారు. వారికి ఏ సమ స్యలు రాకుండా చూడాలని ప్రిన్సిపాల్ పద్మావతి ని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో పిచ్చి గడ్డి పెరగకుండా, మురుగు నీరు నిల్వ లేకుండా చర్య లు తీసుకోవాలని ఆదేశించారు. వారికి ఏదైనా ఇబ్బంది కలిగితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మంగాపురతండాకు చెందిన రైతు కు పరిహారం ఇవ్వలేదని ఫిర్యాదు చేయటంతో ఎఓ రాధను వివరణ అడిగారు. సమస్యను పరిష్క రించాలని ఆదేశించారు. అదే విధంగా అదివారం రాజేశ్వరపురం రైస్ మిల్లులో రైతుల ఆందోళనపై ఆరా తీశారు. వివరాలు అడిగిత తెలుసుకున్నారు. రైస్ మిల్లులో క్రయ, విక్రయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో కూసుమంచి సిఐ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/భద్రాచలం :** పినపాక మండల పరిధిలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం తనిఖీ చేశారు. సోమవారం ప్రజాపక్షం' పత్రికలో ప్రచురితమైన ధాన్యం కొనుగోళ్లలో దళారుల రాజ్యం' కథనానికి స్పందించిన ఆయన పినపాక మండల పరిధిలో డిసిఎంఎస్, జిసిసి, ఐకేపి, పిఎసిఎస్‌ల ద్వారా నిర్వహి స్తున్న పలు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. పినపాక మండల పరి ధిలోని ఉప్పాక గ్రామానికి చేరుకుని గ్రామంలో డిసిఎంఎస్ ద్వారా నిర్వ హిస్తున్న కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడున్న రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. రైతులు పంటను దళారులకు అమ్మవ ద్దని వారు తక్కువ ధర ఇస్తారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్ణయించిన కనీస మద్దతు ధరతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా క్వింటాళ్లకు రూ.500 బోనస్ ఇస్తుందని, ఆ ప్రోత్సహాన్ని రైతులు సద్విని యోగం చేసుకోవాలన్నారు. పినపాక గ్రామంలో నిర్వహిస్తున్న పిఎసిఎస్ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి కుర్షీద్ అహ్మద్, డిసిఎంఎస్ మేనేజర్, సిబ్బంది, ఏడిఏ తాతారావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, తహాశీల్దార్, వ్యవసాయాధికారి, మండల పంచాయితీ అధికారి, ఐకేపి ఏపిఎంలు, ఏపిఓలు, ఇజిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నాణ్యమైన ధాన్యం వెంటనే కొనుగోలు



ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



కాల్ సెంటర్ ఫిర్యాదులను డిజిటలైజ్ చేయాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వెంటనే ధాన్యం నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజ మ్మిల్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ ముజ మ్మిల్ ఖాన్ కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో సన్న రకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్టలతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో సన్న రకం ధాన్యం కొనుగోలు రిజిస్టర్‌ను పరిశీలించారు. గన్నీ సంచుల నాణ్యతను కలె క్టర్ పరిశీలించారు. నాణ్యత తక్కువ, చిరిగి ఉన్న గన్నీ సంచులను వినియోగిం చవద్దని, సరఫరా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. పాలేరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 99 మంది రైతుల వద్ద నుంచి పంట కొనుగోలు పూర్తి చేశామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివ రాలను ఎప్పటికప్పుడు ఓపిఎంఎస్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశిం చారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం ప్రత్యేకంగా క్వింటాకు రూ. 500 బోనస్ ప్రకటించిందన్నారు. ధాన్యం విక్రయించే సమయంలో రైతుల బ్యాంకు ఖాతాల్లో బోనస్ డబ్బులు పడతాయని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే సంబంధిత మిల్లులకు పంపించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఐకెపి ఇంచార్జి కొత్తా జ్యోతి, ఎపిఎం సత్యవర్ధన్ రాజ్, ఎఒ రామదుగు వాణి, రైతులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటిక ప్పుడు డిజిటలైజ్ చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారు లకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉన్న కాల్ సెంటర్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. కాల్ సెంటర్‌లో నమోదైన ఫిర్యాదుల వివరాలను అడిగి తెలు సుకున్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, ధాన్యం కొనుగోలు, పత్తి కొను గోళ్లలో ప్రజలకు, రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నెం 1077కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని ఆ ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలి పారు. కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారం లభించేలా అధి కారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

### సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమా వేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్టతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమాల్లో జిల్లా రెవెన్యూ అధికారిణి రాజేశ్వరి, డిఆర్‌డిఒ ఎస్.సన్యాసయ్య, కలెక్టరేట్ ఎఒ అరుణ, జిల్లా అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో నకిలీ అల్లం పేస్ట్ కలకలం



### తయారీ కేంద్రాలపై అధికారుల దాడులు

### 960 కేజీల అల్లం, వెల్లుల్లి మిశ్రమం సీజ్

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆహార తయారీలో నాణ్యత లోపం, కల్తీ విషయంపై ప్రజల నుంచి ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఖమ్మంలో సోమ వారం తయారీ కేంద్రాలపై దాడులు చేశారు. ఖమ్మం పట్టణంలోని రిక్కాబజా ర్‌లో మ్యాజిక్ అల్లం, వెల్లుల్లి తయారీ కేంద్రాలలో తనిఖీలు నిర్వహించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. లైసెన్స్ లేకుండా తయారు చేయడం తో పాటు బాటిల్స్‌పై చట్టబద్ధమైన లేబుల్స్ లేవని నిర్వహణ లోపాలు ఉన్నా యని అధికారులు గుర్తించారు. అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను రసాయనాల పక్కన నిల్వ చేయడం వల్ల అది పేస్టు కల్తీ జరుగుతుందని అది నకిలీ పేస్టుగా అధి కారులు భావించారు. పేస్టు నుంచి దుర్గంధం రావడం, తక్కువ ధరకు విక్ర యాలు జరుపుతుండడంతో నాణ్యతలోపంతో తయారైందిగా భావించి నమూ నాలు సేకరించారు. మొత్తం రూ.1.32లక్షల విలువైన 960 కేజీల అల్లం, వెల్లుల్లి మిశ్రమాన్ని సీజ్ చేశారు. దీనిని పరీక్షలకు పంపిస్తున్నామని తదనం తరం చర్యలు తీసుకుంటామని తెలిపారు. చర్చి కాంపౌండ్‌లో గల విజయ లక్ష్మి పిండి వంటల తయారీ కేంద్రాన్ని అధికారులు తనిఖీ చేశారు. అపరి శుభ్రవాతావరణంలో వంటలు చేస్తున్నారని క్యాన్సర్ కారకలైనటువంటి రంగులను వినియోగిస్తున్నారని తయారీ తారీఖు, లైసెన్స్ లేనటు వంటి రూ. 6550 విలువ గల మిస్ బ్రాండెడ్ పిండి వంటలను, పచ్చళ్లను ధ్వంసం చేసి శాంపిల్స్ సేకరించి పరీక్ష నిమిత్తం తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి నోటీసులు జారీ చేశారు. మయూరీ సెంట ర్‌లో గల హరి స్వీట్స్‌లో తనిఖీ చేయగా అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేస్తున్నారని అధిక మోతాదులో రంగులను వాడుతున్నారని గుర్తించి అధికారులు ఆహార పదార్థాలను గుర్తించి ధ్వంసం చేసి నోటీసులు జారీ చేశారు. తనిఖీలలో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ జోనల్ హెడ్ జ్యోతిర్మయి,టాస్క్‌ఫోర్స్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు రోహిత్‌రెడ్డి, స్వాతి, మనోజ్ కుమార్, రతన్‌రావులతో కూడిన బృందం పాల్గొంది.

## యాంటీబయోటిక్స్ వాడొద్దు

### డిఎంహెచ్ఒ కళావతిబాయి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అనవసరంగా యాంటీబయోటిక్స్ వాడడం తో శరీర వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉందని డిఎంహెచ్ఒ డాక్టర్ బి.కళా వతిబాయి తెలిపారు. ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ కార్యక్ర మంపై అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఖమ్మం నగరం లోని మామిళ్లగూడెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన అవ గాహన కార్యక్రమంలో డిఎంహెచ్ఒ కళావతిబాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలిసి తెలియని ఆర్ఎంపిలు, పిఎంపిలు చెప్పారని యాంటీ బయోటిక్స్ వాడితే ఇబ్బందులు ఉంటాయని తెలి పారు. అర్హత కలిగిన వైద్యులు చెప్పినవిధంగా ఎన్ని రోజులు వాడాలో అన్ని రోజులు వాడితే యాంటీ బయోటిక్స్ పనిచేస్తాయని ఆరోగ్య సమ స్యలు తలెత్తకుండా ఆరోగ్యాన్ని కాపాడతాయని ఆమె తెలిపారు. కార్యక్ర మంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సైదులు, వైద్యాధికారి కృష్ణచైతన్య, డెమో జి.సాంబశివరెడ్డి, టి.ఉపేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

## తీసుకుని దాచుకోవడం తప్ప బిఆర్ఎస్ చేసింది ఏమీలేదు

డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి




**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** మహిళా అభ్యున్నతి, లక్ష కోట్ల రుణాలు ఇచ్చి లక్షాధికారుల్ని చేయడం కోసం మంగళవారం హన్మకొండలోని జరిగే మహిళా సభను జయప్రదం చేయాలని జనగామ డిసిసి అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతారని, జనగామ జిల్లా నుండి 20 వేల మంది మహిళల్ని తరలించాలన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులతో పాటు మహిళా సంఘాల ప్రతినిధులు, మహిళలు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే అనేక హామీలు అమలు చేయడం జరిగిందన్నారు. ఉచిత బస్సు, 500 రూపాయలకే గ్యాస్ సిలెండర్, ఉచిత విద్యుత్, లక్షల కోట్ల రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. త్వరలోనే ప్రతి మహిళకు 2500 రూపాయలు ఇవ్వడాన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. గత పదేండ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ఏ ఒక్క పని చేయలేదని దోచుకొని దాసుకోవడం తప్ప మరేమి జరగలేదన్నారు. అధికారం కోల్పోయామనే అహంకారంతో కెటిఆర్, హరీశ్‌రావులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఇక దొంగ ఓట్లతో గెలుపొందిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూమి మీదనే లేకుండా చిన్నా పెద్దా లేకుండా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. 10 ఏండ్ల కాలంలో ఎవరు వందల కోట్లకు ఎదిగారో ఆలోచించుకోవాలన్నారు. హామీలు అమలు చేయడంతో పాటు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారన్నారన్నారు. ఫాంహౌస్‌కు పరిమితమైన నాయకులు అడ్డదారిలో వేల కోట్ల సంపాదించారని మండిపడ్డారు. అక్రమంగా సంపాదించిన సొమ్మును కక్కిస్తామన్నారు. మంగళవారం హన్మకొండలో జరిగే ముఖ్యమంత్రి సభకు భారీగా మహిళలు తరలి రావాలని కోరారు.

## ప్రజాపాలన విజయోత్సవ సభకు తరలిరండి: ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలన సందర్భంగా నేడు హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో జరిగే కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు ఒక్కొక్కటిగా అమలుచేస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రజాశ్రేయస్సు, ప్రజాపాలన లక్ష్యంగా తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి కార్యచరణ ప్రణాళిక బద్ధంగా అమలుచేస్తున్నట్లు తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గంలో అయితే స్వాతంత్రం వచ్చినట్లుగా ప్రజలు బావిస్తున్నారని గతంలో ఏ విధంగా ఉంది, పాలన ఇప్పుడు ఎట్లా ఉందో అందరికీ తెలుసన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండల పార్టీ అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, నల్ల శ్రీరాములు, సురేష్ నాయక్, పార్టీ నాయకులు జలగం కుమార్, కమ్మగాని నాగయ్య, గంగు క్ష్ణమూర్తి, బైరు భార్గవ్, రాఘవరావు, వి యాకాంతరావు, బి భాస్కర్, మహేందర్‌రెడ్డి, బిర్రు సోమేశ్వర్, పాండు, కృష్ణమూర్తి, పోగు శ్రీనివాస్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## లగచర్ల గిరిజనులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్



**ప్రజాపక్షం/రాయపర్తి:** కొడంగల్ నియోజవర్గం లోని లగచర్ల గిరిజన రైతులకు న్యాయం జరిగేంత వరకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సోమవారం మండల కేంద్రం లోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై బిఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ, లగచర్ల గిరిజనులపై రేవంత్ సర్కార్ అక్రమంగా, కుట్రపూరితంగా పెట్టిన కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లగచర్లలో ఫార్మాసిటీ పేరుతో గిరిజనుల భూములు లాక్కొని సిఎం రేవంత్ రెడ్డి అల్లునికి కట్టబెట్టాలని చూస్తున్నారని అన్నారు. గిరిజనులపై అక్రమ కేసులు పెట్టి రేవంత్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని అన్నారు. వెంటనే గిరిజన రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ నేత పరుపాటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహ నాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, జడ్‌పిటిసి రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, ఉపాధ్యక్షుడు ఎండి నయీమ్,ఎలామంచి శ్రీనివాస్ రెడ్డి, గారే నర్సయ్య, జగన్, బద్రు నాయక్, లక్ష్మి నారాయణ, సుందర్ నాయక్, జాజు నాయక్, ఐత రాంచందర్, చందు రాము యాదవ్, రంగయ్య, లేతకుల మధుకర్ రెడ్డి, లేతకుల రంగారెడ్డి, సుధాకర్ రెడ్డి, గజవెల్లి ప్రసాద్, సంకినేని ఎల్ల స్వామి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇన్‌చార్జి సంపత్‌రావు అధికారులకు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇన్‌చార్జి సంపత్‌రావు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి, ప్రజాదర్బార్‌కు సంబంధించిన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ శాఖ 13, పెన్షన్లు 2, ఇందిరమ్మ ఇళ్లు 1, ఉద్యోగ ఉపాధి కొరకు 1, ఇతర శాఖలకు సంబంధించినవి 9 మొత్తం 26 దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల ఇన్‌చార్జి సంపత్‌రావు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ ఎన్ గోపాల్‌రావు, డిసిఓ సర్దార్ సింగ్, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి తుల రవి, విద్యుత్ శాఖ డిఈ ఇన్‌చార్జి సదానందం, డిఎఒ తేజోవతి, డిడబ్ల్యూఓ ఇన్‌చార్జి శిరీష, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకులవి ఝూటా మాటలు

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపి,మేయర్ ధ్వజం



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** బిఆర్ఎస్ నాయకులవి ఝూటా మాటలు అని సిగ్గు శెరం లేకుండా అబద్దాలు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపి, మేయర్ విమర్శించారు. మామూనూరు విమానాశ్రాయం, మున్సిపల్ నూతన భవనానికి నిధుల కేటాయింపు హర్షిస్తూ ఉమ్మడి జిల్లా ప్రజల పక్షాన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి వర్గానికి ధన్యవాదాలు తెలుపుతూ సోమవారం సిఎం,మంత్రుల ప్లెక్సీకి పాలాభిషేకం చేశారు. అనంతరం డిసిసి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,వరంగల్ ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, కెఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ చేసిన అభివృద్ధి పనులను ఆధారాలతో మీడియా ముందు పెడుతున్నామని అన్నారు. వరంగల్ చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి పనులను చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. వాస్తవాలను అవాస్తవాలుగా చిత్రీకరించడం బిఆర్ఎస్ నాయకులకు వెన్నతోపెట్టి విద్య అన్నారు.1000పై చిలుకు స్కాంలు చేసి, గాలిలో బాణాలు వేస్తున్న నేతలకు సిగ్గుండాలని, ఉమ్మడి వరంగల్ జిల్లాలోకి గత 10 ఏళ్లలో చేయాలని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదని అన్నారు.స్థానిక నేతలుగా హర్షించాల్సింది పోయి విమర్శిస్తుంటే ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో 7లక్షల కోట్లపై చిలుకు అప్పులు చేసి ఆగం చేసి పోతే అన్ని సర్దుకుంటూ నిధులు కేటాయించుకుంటున్నామని, ముఖ్యమంత్రి పర్యటన పట్ల ఏవేవో మాట్లాడి పోవాలని స్టువర్ట్ పురం బ్యాచ్ మొత్తం దిగిందని, నాడు తెలంగాణ ఉద్యమంలో లేని మొఖాలు ఇవ్వాళ కాళోజి నారాయణ రావు గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని, 90 శాతం కాళోజీ పనులు పూర్తి చేసినాం అని చెప్పుకునే మీరు ఎందుకు ప్రారంభించలేదని సూటిగా ప్రశ్నిస్తున్నానని అన్నారు.మీ హయాంలో భూమి కేటాయించి 25 కోట్ల నిధులు కేటాయించి అందులోనుంచి 15 కోట్లు జేబులో వేసుకొని గమ్మున ఉన్న మీరు గొప్పనా..75 కోట్ల పై చిలుకు నిధులను కేటాయించి దగ్గర ఉండి పనులను జరిపించుకున్న మేము గొప్పనా మీడియా ముఖంగా చర్చకు సిద్ధమా...అని సవాల్ విసిరారు. మీ కమీషన్‌ల కోసం కక్కుర్తి బుద్ధితో కాళోజీ కళాక్షేత్రం ఆగం చేస్తే నిధులు తెచ్చుకుని సుందరంగా తీర్చిదిద్ది నేడు ప్రారంభిస్తుంటే మీరు జీర్ణించుకోలేక పోతున్నారని, అలాగే 32 కోట్లతో నూతన మున్సిపల్ భవన నిర్మాణం కోసం, మామునూరు విమానాశ్రయం కోసం 205 కోట్లతో భూమి సేకరణ చేపట్టి జీఓ లు విడుదల చేసిన ఘనత మా ప్రభుత్వానిది అని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ డిసిసి అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, ముఖ్యమంత్రి పర్యటన నియోజకవర్గ పర్యవేక్షకులు, రాష్ట్ర టూరిజం సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దొమ్మటి సాంబయ్య, పుల్ల పద్మ, కుచన రవి, పుల్ల పద్మ, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు మరియు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దేశానికి ఆదర్శంగా నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/జఫర్‌గఢ్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత రైతుల సంక్షేమం కోసం పాటుపడుతుందని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సన్నవడ్లకు బోనస్ రూ.500 రైతులకు ఇచ్చిన సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని పిఎసిఎస్ ఆవరణలో పిఎసిఎస్ చైర్మన్ తీగల కరుణాకర్ రావు ఆధ్వర్యంలో రైతు సంబరాలు, రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బోనస్ పడిన రైతులతో కలిసి పాలాభిషేకం చేపట్టారు. ముఖ్య అతిథిగా కడియంశ్రీహరి, టెస్కాబ్ చైర్మన్, డిసిసిబి చైర్మన్ మార్నేని రవీందర్ రావులతో కలిసి కడియం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందన్నారు. కాంగ్రెస్ ఎలక్షన్లకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేస్తుందన్నారు. కెటిఆర్ ఎందుకు తొందర పడుతున్నాడో, 10 ఏళ్లల్లో కాని అభివృద్ధి ఒక్క సంవత్సరంలో అవుతుందా అని ప్రశ్నించారు. అధికారం పోయిందనే అక్కసుతో, ఇన్ని రోజులు అధికారం చలాయించిన వారు, ప్రజలను మరిచిపోయి అహంకారంతో ఉన్నవారు, తెలంగాణ వనరులను దోచుకున్నవారు ప్రభుత్వంపై అక్కసువెల్లగక్కుతున్నారని మండిపడ్డారు. కెటిఆర్‌కు జైలుకు పోవడం కన్నా హరీశ్‌రావు అంటే ఎందుకు భయపడుతున్నారో అర్థం కావట్లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు.ఇప్పటికే 23 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్లు రైతులకు పంట రుణాలు మాఫీ చేశాం, మిగతా రైతులకు కూడా త్వరలోనే పూర్తి రుణమాఫీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘనపూర్ మార్కెట్ చైర్మన్ లావణ్యరెడ్డి, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య, పిఎసిఎస్ వైస్ చైర్మన్ నర్సింగం, మార్కెట్ డైరక్టర్లు భూక్యా సురేష్, ఇల్లందుల బాబు, మాజీ మార్కెట్ చైర్మన్ భిక్షపతి, బ్రహ్మారెడ్డి, రాజు, మాజీ ఎంపిపి సుదర్శన్, కనకయ్య, ఎంపిడిఓ సుమన్, తహసీల్దార్ శంకరయ్య, పిఎసిఎస్ డిసిఓ ప్రవీణ్ కుమార్, అగ్రికల్చర్ ఆఫీసర్ కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో మొదటిస్థానంలో ములుగు జిల్లా



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో రాష్ట్రంలోనే ములుగు జిల్లా 87.1 మొదటి స్థానంలో ఉంచినందుకు గాను జిల్లా కలెక్టర్, జిల్లా, మండల, గ్రామ అధికారులను సర్వేలో భాగస్వాములుగా ఉన్న ప్రజలకు రాష్ట్ర మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. దేశ చరిత్రలోనే అపూర్వమైన రీతిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే తెలంగాణ సమాజపు సంక్లిష్టతకు, మౌలిక సమస్యలకు అద్దం పట్టేలా ఈ సర్వే జరుగుతుందని సమగ్ర కుటుంబ సర్వే ఇచ్చిన వాస్తవిక అంచనాల నూతన రాష్ట్ర ప్రభుత్వానికి దిశా నిర్దేశం చేయడమే కాదు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో కీలకమైన సూక్ష్మస్థాయి ప్రణాళిక రచనకు దోహదపడేవిగా ఉంటాయని నూతన రాష్ట్రంలో ప్రజలు ప్రధానంగా భూమి, నీరు, నీడ, ఉపాధుల కోసం తపిస్తున్నారని సర్వే నిగ్గు తెలుస్తుంది. ఆ లక్ష్యాల సాధనకు అన్ని వర్గాలను కలుపుకొని సమిష్టిగా కృషి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని, సమగ్ర కుటుంబ సర్వేలో ప్రజలు భాగస్వాములు కావాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

## పట్టణంలో పలు పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట పట్టణంలో నాలుగున్నర కోట్లు 14వ ఆర్థిక సంఘం నిధులు. టియుఎఫ్ఐడిసి నిధులు నుండి పలు వార్డులలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలో అంతర్గత రోడ్లు, మురికి కాలువలు, కల్వర్టులు నూతన నిర్మాణం కోసం 14వ ఆర్థిక సంఘం నిధుల నుండి నాలుగున్నర కోట్లు నిధులు, రూ. 25 కోట్లు వెచించి పట్టణమంతా సుందరీకరణ చేస్తున్నామని, పనులు త్వరితగతన పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గత ఐదు సంవత్సరాలలో నిధుల కోరుతూ అభివృద్ధి జరగలేదని, పట్టణంలో మురికి కాలువలు, రోడ్లు, శిథిలమైపోయాయని ప్రజలకు రవాణా సౌకర్యంతో పాటు మురికినీరు ఎక్కడికి అక్కడ పేరుకుపోయి పట్టణం దుర్గంధంతో మునిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో పట్టణంలో రోడ్లు గాని డ్రైనేజీలు గాని శుభ్రంగా ఉంటాయని, శుద్ధి చేసిన మంచినీటిని నిత్యం అందించేలా చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా 15,4, 6,8 ,9 ,18 ,19, 20, 24 డివిజన్లలో శంకుస్థాపనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, చైర్‌పర్సన్, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దొంతిని విమర్శించే స్థాయి కాదు



**ప్రజాపక్షం/నెక్కొండ:** నర్సంపేట శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డి ని విమర్శించే స్థాయి మీకు లేదని ఆదివారం నెక్కొండలో విలేకరుల సమావేశంలో నెక్కొండ మండల పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డిలు అన్నారు. దొంతి మాధవరెడ్డి దగ్గర రాజకీయ ఓనమాలు నేర్చిన మీరు స్థాయి మరచి దొంతి మాధవరెడ్డి ని విమర్శించడం సరికాదని మేము ఎక్కడ ప్రోటోకాల్ తప్పలేదని మండల కేంద్రంలోని కొన్ని గ్రామాలలో కొనుగోలు కేంద్రాల్లో పిఎసిఎస్ చైర్మన్ లతో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్న సందర్భంలో మేము పాల్గొన్నామె తప్ప ప్రోటోకాల్ దాటలేదని వారు గుర్తు చేశారు. దొంతి మాధవరెడ్డి మండలాన్ని పట్టించుకోలేదు అనడం అర్థరహితమని గత శాసన సభ్యుడు కోట్ల రూపాయల సొంత నిధులు ఖర్చు చేయలేని దద్దమ్మని, ఆనిదులు సొంత పార్టీ కార్యకర్తలకు ఇచ్చిన పని చేసి బాగుపడేవారని అలా చేయలేని వ్యక్తి మీకు ఎలా నాయకుడని వారు ప్రశ్నించారు. నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ను నియమించడంలో విఫలమయ్యారని ఎవరిని నియమించ కుండా సొంత కార్యకర్తలకే అన్యాయం చేశారని, ఇది మీకు తెలుసు కానీ చెప్పలేని స్థితిలో ఉన్నారని వారు గుర్తు చేశారు. దొంతి మాధవరెడ్డి శాసన సభ్యులుగా ఎన్నికైన అనంతరం నెక్కొండ మండలంలో రైల్వే స్టేషన్ నుండి అమీర్‌పేట్ వరకు నాలుగు వరసల రహదారి లైటింగ్ మంజూరు చేశారని, అలాగే సినిమా థియేటర్ నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు కూడా నాలుగు వరసల రహదారి లైటింగ్ మంజూరు చేయించారని, గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు మంజూరులో ఏ వ్యక్తి ఎంత అవకతవకలకు పాల్పడ్డారో, పేదలకు పంపిణీ చేయవలసిన పిడిఎస్ బియ్యం దందా చేసే వ్యక్తి ఎవరో మాకు తెలుసని ప్రజలకు కూడా తెలుసు అని మీరే సరైన మార్గంలో లేరు కానీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ని విమర్శించే స్థాయి మీది కాదనూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నెక్కొండకు సివిల్ హాస్పిటల్ రావడానికి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిని ముఖ్యులను ఏనాడో దొంతి మాధవ రెడ్డి కలిశారని మీరు చెబితే ఆయన చేయరని ప్రజల కోసం ఏం చేయాలో ఏం చేయకూడదో ఆయనకు తెలుసని వారు అన్నారు. ఎన్నికల ముందు ఓటు దండు కోవడం కోసమా లేక ప్రలోభ మాటల కోసమా ఆనాటి ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు ను నెక్కొండకు తీసుకువచ్చి నెక్కొండ మండలాన్ని దత్తత తీసు కుంటున్నానని హరీష్ రావు ప్రకటించి మండలానికి అతని నిధుల నుండి స్వయంగా ఏమీ విడుదల చేశారో ప్రజలకు తెలిపాల్సిన బాధ్యత మీపై ఉందని, దత్తపుత్రుడు దరిదాపుల్లోకి రాకుండా పారిపోయారా అని వారు ఎద్దేవా చేశారు. దొంతి మాధవరెడ్డిని విమర్శిస్తే మేము ఊరుకోమని సరైన రీతిలో మీకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి కల్పించుకోవద్దని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు రామారావు శిరీష, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకుడు బక్కి నరేష్,మాజీ వార్డు సభ్యుడు సింగం ప్రశాంత్, కొల్లు సుబ్బారెడ్డి, మహమ్మద్ అన్వర్, తమ్మిశెట్టి సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

## టెక్స్‌టైల్స్ పార్కులో బిఆర్ఎస్‌ది బ్రోకర్ పాత్ర

పరకాల ఎంఎల్ఎ రేవూరి ప్రకాష్‌రెడ్డి



**ప్రజాపక్షం/పరకాల:** కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు విషయంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం బ్రోకర్ పాత్రను పోషించిందని పరకాల ఎంఎల్ఏ రేవూరి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. సోమవారం పరకాల ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పెద్దపల్లి ఎంఎల్ఏ విజయ రమణారావుతో కలిసి ఎంఎల్ఏ రేవూరి మాట్లాడారు. టెక్స్‌టైల్ పార్కులో బిఆర్ఎస్ నాయకులు బ్రోకర్ల మాదిరిగా వ్యవహరించి రైతుల భూముల విషయంలో నిలువునా ముంచారని అన్నారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్లగా పనిచేసి సుమారు రూ.400 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. అభివృద్ధి పేరిట దోచుకున్న మాజీ ఎంఎల్ఏ ధర్మారెడ్డి తన స్వలాభం కోసమే ఆలోచించారని అన్నారు. సిఎంఆర్ నిధులను ఫోర్జరీ సంతకాలు చేసి దోచుకున్న మాజీ ఎంఎల్ఏ ధర్మారెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. పరకాల నుండి ఎర్రగట్టు గుట్ట వరకు రూ.65 కోట్లతో నాలుగు లైన్ల రోడ్డును మంజూరు చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత టెక్స్‌టైల్ పార్కులో భూములు కోల్పోయిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉందని తెలిపారు. టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధికి కృషి చేసి, భూములు ఇచ్చిన రైతులకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రూ.43 కోట్ల 51లక్షలతో 863 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. పెద్దపల్లి ఎంఎల్ఏ విజయ రమణారావు మాట్లాడుతూ మంగళవారం హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో జరిగే ఇందిరా మహిళ శక్తి భారీ బహిరంగ సభకు పరకాల నియోజకవర్గం నుండి 20వేల మందిని తరలించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడమే కాకుండా, చెప్పని వాటిని కూడా అమలు చేసిన ప్రభుత్వం తమదని అన్నారు. మాజీ ఎంఎల్ఏ మొలుగూరి బిక్షపతి, పార్టీ నాయకులు, పలువురు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రైతుల ప్రభుత్వం

ఎంఎల్ఎ గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/చిట్యాల:** రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం మండల లోని దూత్‌పల్లి, చిట్యాల, నవాబుపేట, గిద్దెముత్తారం, కాల్వపల్లి, అందుకుతండా గ్రామాలల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ ముఖ్య నేతలతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఆ యా గ్రామాలల్లో ఎమ్మెల్యే మాట్లాడుతు రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో విక్రయించాలని రైతులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం క్వింటాల్ వరి ధాన్యానికి రూ.2320 ఇస్తుందని, అదే విధంగా, సాధారణ రకానికి రూ.2300 ఇస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, క్వింటా సన్న ధాన్యానికి అదనంగా మరో రూ.500 బోనస్, జనవరి నుండి రేషన్ షాపులకు సన్న బియ్యం పంపించనునట్లు తెలిపారు.

### ఇందిరా మహిళా శక్తి బహిరంగ సభను సక్సెస్ చేయండి:కాంగ్రెస్ నేతలకు ఎంఎల్ఎ జీఎస్సార్ పిలుపు

నేడు మధ్యాహ్నం 2 గంటలకు ఇందిరా మహిళా శక్తి బహిరంగ సభను సక్సెస్ చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అయిత ప్రకాశ్ రెడ్డి, ఆర్ఎన్ ఆర్, వ్యవసాయ మార్కెట్ అధికారి కనుక శేఖర్, ఆర్ ఐ భాస్కర్ల రాజు, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, చిట్యాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, కార్యదర్శి గడ్డం కొమురయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, జిల్లా నాయకులు చిలుకల రాయకొముఋు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమం విజయవంతంగా నిర్వహణ

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** నవంబర్ 19వ తేది నుండి డిసెంబర్ 7వ తేదీ వరకు జరుగనున్న ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 19వ తేదీ నుండి డిసెంబర్ 7వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే ప్రతి రోజు మూడు ప్రజాపాలన కళా యాత్ర కార్యక్రమాలు నిర్వహించే విధంగా షెడ్యూల్ తయారు చేసినట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని భూపాలపల్లి, మంథని నియోజకవర్గాల్లో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఒక్కొక్క కార్యక్రమం గంటన్నరకు తగ్గకుండా ప్రజాపాలన కళాజాత నిర్వహించాలని ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలకు నేరుగా సేవల అందుబాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం తీసుకున్న చర్యలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు ప్రజల్లోకి తీసుకువెళ్లే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సమర్థవంతమైన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అన్ని కార్యక్రమాలు ప్రజల నడుమ మరింత పారదర్శకతతో, సమగ్రంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా ప్రజల సహకారం ఎంతో కీలకమని, అందరూ భాగస్వామ్యం కావాలని, ప్రజాసేవలపై మరింత అవగాహన పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిపిఆర్వో శ్రీనివాస్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ -3 పరీక్షలు ప్రశాంతం

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** గ్రూప్3 పరీక్షలు జనగామ జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. సోమవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు మూడో పేపర్ పరీక్షలు జరగగా పలు సెంటర్లను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, నెహ్రూ పార్కు వద్ద సెయింట్ పాల్ హై స్కూల్, ధర్మకంచె కళాశాలలో పరిశీలించారు. 5446 మందికి ఆను 2366 మంది హాజరయ్యారు. ఆది, సోమవారం రెండు రోజుల పాటు పరీక్షలు జరగగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను సందర్శించిన వారిలో ఆర్‌డిఓ గోపిరామ్, హౌసింగ్ ఈఈ దామోదర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి మాధవిలత, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పావనికుమారి తదితరులు ఉన్నారు



## శతవసంతాలు గ్రామ గ్రామాన నిర్వహిద్దాం

**ప్రజాపక్షం/డిండి:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 100 సంవత్సరాల ఆవిర్భావ వేడుకలు గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ అన్నారు. ఆదివారం రాత్రి జరిగిన చెరుకుపల్లి గ్రామ శాఖ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన సిపిఐ 100 సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా డిసెంబర్ 26న గ్రామ గ్రామాన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలు ఘనంగా నిర్వహించాలని, స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని అన్నారు. పార్టీ ఏ పిలుపు ఇచ్చిన ప్రతి కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని, పార్టీ సభ్యత్వం పునరుద్ధరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ డిండి మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దిన్, మండల సహాయ కార్యదర్శి శైలేష్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, గ్రామ శాఖ కార్యదర్శి హనుమంతు, సహాయ కార్యదర్శి రాములు, శాఖ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి రాంబాబు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా శాఖల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో భూ సమస్యలపై 28, డిడబ్ల్యూఓ 2, డిఆర్‌డిఓ 6, డిపిఓ 2, డిఏఓ 1, డిఎంహెచ్ఓ 2తో పాటు ఇతర శాఖలకు 27 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి అశోక్ సిపిఓ ఎల్ కిషన్ నాయక్, డిడబ్ల్యూఓ నరసింహారావు, డిఎంహెచ్ఓ కోటాచలం, సంక్షేమ శాఖల అధికారులు శంకర్, లత, డిపిఓ నారాయణరెడ్డి, వివిధ శాఖల అధికారులు శ్రీనివాసరావు, సుదర్శన్ రెడ్డి, పద్మారావు పాల్గొన్నారు.

## అక్రమ బియ్యం వ్యాపారులపై పిడియాక్టు నమోదు

**ప్రజాపక్షం/సూర్యాపేట:** పిడిఎస్ బియ్యం అక్రమ రవాణ కేసులో ఇద్దరు వ్యక్తులపై పిడియాక్టు నమోదైనట్లు జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జూలై నెలలో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణ వ్యాపారం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్‌టిఆర్ జిల్లా వత్సవాయి మండలం లింగాల గ్రామానికి చెందిన పసుపుల నర్సింహ్మారావు, ఖమ్మం పట్టణానికి చెందిన ఆత్మకూర్ జగదీష్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజా పంపిణి వ్యవస్థకు భంగం కల్పించిన, ప్రజల ఆహార భద్రతకు నష్టం కలిగించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి అక్రమ వ్యాపారాలపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గతంలో వీరిపై పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. ఈ కేసులో వీరి నుండి 32.5 టన్నుల బియ్యాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. కలెక్టర్ ఆదేశాలతో వీరిని చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

## ముగిసిన గ్రూప్3 పరీక్షలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్3 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగిన పరీక్షల్లో జిల్లా వ్యాప్తంగా 16,543 మంది అభ్యర్థులకుగాను 9,232 మంది హాజరు కాగా 7,311 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. సగటు 55.8 శాతం హాజరు నమోదయ్యిందన్నారు. పరీక్షలకు విధులు నిర్వహించిన అధికారులకు సిబ్బందికి, పోలీసు అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు.

## ఐఎయల్ జిల్లా అధ్యక్షుడిగా పరమేశ్ గౌడ్

ప్రధాన కార్యదర్శి బిఆర్ విల్సన్





**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ మహబూబ్‌నగర్ జిల్లా మహాసభలో ఐఏఎల్ జిల్లా అధ్యక్షులు బి.పరమేశ్ గౌడ్ ప్రధాన కార్యదర్శి బిఆర్ విల్సన్ ఎన్నికయ్యారు. వీరితో పాటు 25 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకోబడ్డారు. ఈ నూతన కమిటీ ఐఎఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ సమక్షంలో ఎన్నుకోబడింది. గౌరవ అధ్యక్షులు బెక్కం జనార్ధన్, జిల్లా అధ్యక్షులుగా పరమేశ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బిఆర్ విల్సన్, కార్యదర్శిగా ఆర్ ఆర్ మణ్యం, జాయింట్ కార్యదర్శి లక్ష్మారెడ్డి, ఉపాధ్యాక్షులుగా వెంకట్రావు, సజ్జద్ హామీదు, కమిటీ సభ్యులుగా జగదీశ్, ఎన్‌వి మహేశ్, నరసింహ, రామకృష్ణ గౌడ్, ఉబేద్, సజ్జత్, అమేద్, వేణుగోపాల్ గౌడ్, మహమ్మద్, ఇలియాసు ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ న్యాయవాదుల హక్కుల కోసం, ఐఏఎల్ బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు.

## ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు

**ప్రజాపక్షం/ఎర్రవల్లి:** ఎస్ఎన్ఎస్ కంపెనీ వెదజల్లుతున్న విషపూరితమైన కాలుష్యాన్ని నివారించాలని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కంపెనీ యాజమాన్యంపై చర్య తీసుకోవాలని వారిని కోరారు. మా జీవించే హక్కును కాలరాస్తున్న ఎస్ఎన్ఎస్ కంపెనీ ని శాశ్వతంగా మూసి వేయాలని ప్రజలు డిమాండు చేశారు. ఇటిక్యాల ఉమ్మడి మండల తాజా మాజీ ఎంపిపి భర్త శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మూడు గ్రామాల తాజా మాజీ జింకలపల్లి మాజీ సర్పంచు ఈదన్న, మాజీ జడ్పిటిసి సత్యరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్, వీరబాబు, శేఖు, నారాయణ, బోయ మద్దిలేటి, శివ, గోవిందు, చిన్న మద్దిలేటి , ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/ఎర్రవల్లి :** అలంపూర్ నియోజకవర్గం ఎర్రవల్లి మండలం కొండేరు గ్రామం నందు వడ్ల కొనుగోలు కేంద్రంలో ప్రారంభించిన ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోమనాద్రి పోతురాజు , ఐకెపి కన్వీనర్ తలారి కుమార్, ఎఈఓ ప్రవలిక, ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఐకేపీ కన్వీనర్ తలారి కుమార్, ఎఈఓ ప్రవలిక, మహిళ సంఘం లీడర్లు పద్మమ్మ, లక్ష్మి , మార్తమ్మ, వెంకటేశ్, యాదవ్, కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్, సోమనాద్రి పోతురాజు, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# రూ.28లక్షల గంజాయి సీజ్

మూడు కార్లు, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం

ఏడుగురు నిందితుల అరెస్టు

జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ వెల్లడి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఖరీదైన కారుల్లో బంపర్ దూం మధ్యలో ఓ ప్రత్యేకమై జాలీ ఏర్పాటు చేసి అందులో గంజాయి ప్యాకెట్లు పెట్టి ఎవ్వరికీ అనుమానం రాకుండా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నా ముఠాను సూర్యాపేట పట్టణ, కోదాడ పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సూర్యాపేట రెండవ పట్టణ పరిధిలో ఈనెల 17వ తేదీన సాయంత్రం 2టౌన్ ఎస్ఐ గోపికృష్ణ తన సిబ్బందితో కలిసి 65వ జాతీయ రహదారి రాజీవ్ పార్కు సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఏపి 31 సిఎఫ్ 6688, ఏపి 16 ఏవి 9459 నెంబర్లు గల రెండు కార్లు అనుమానస్పదంగా ఒకదాని వెనుక మరోకటి వస్తుండగా ఆపి తనిఖీ చేస్తుండగా అందులో ఉన్నఆరుగురు ఫరారీకి ప్రయత్నించగా వారిని పట్టుకొని విచారించి వాహనాలను తనిఖీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బచ్చలి మోహనకృష్ణ, కోరా అచ్యుత్ రాజు అలియాస్ సుధాకర్, షెక్ కాశీం, కర్ణాటక రాష్ట్రానికి చెందిన హు క్కావాయి విజయ్ కుమార్ అలియాస్ విజయ్ కృష్ణ, బొమ్మగాని శ్రీకాంత్ గౌడ్‌లుగా గుర్తించారు. వీరు గం జాయి ప్యాకెట్లను ఒక కారులో 9, మరో కారులో 8 మొ త్తం 17 ప్యాకెట్లును స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 75కేజీలు ఉంటుందని చెప్పారు. రెండు కార్లతో పాటు 8 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఏ3 నిందితుడైన కాశీంకు పరిచయం ఉన్న కర్ణాటకకు చెందిన హుక్కావాయి విజయ్ కుమార్ అలియాస్ విజయ్ కృష్ణ అతని కుమారుడు సుభంలు కర్ణాటక రాష్ట్రంలోని బిదర్ ప్రాంతంలో గంజాయి అమ్ముతూ అధిక లాభాలు వస్తుండడంతో చూసి ఒరిస్సాకు వెళ్లి షెక్ కాశీంతో పాటు కలిసి రెండు కార్లలో ఆ రాష్ట్రంలోని మల్కాన్‌గిరి జిల్లా చింత్రకొండ ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేశారు. కేజీ గంజాయి రూ. 2500చొప్పున కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నారు. అక్కడి నుండి కర్ణాటక రాష్ట్రంలోని బిదర్ ప్రాంతానికి చేరేందుకు వయ విజయవాడ నుండి సూర్యాపేటహైద్రాబాద్ వెళ్తుండగా పోలీసులకు చిక్కారు.

**కోదాడ రూరల్ :** కోదాడ రూరల్ పోలీసులు ఈనెల 17న సాయంత్రం 5గంటలకు కోదాడ సమీపంలోని చిమిర్యాల క్రాస్ రోడ్డు వద్ద నమ్మదగ్గిన వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఏపి 11ఎఎం 9991 గంజాయి ఉన్నట్లు గుర్తించారు. నిందితులను అదుపులో తీసుకోని విచారించగా మహారాష్ట్రకు చెందిన నిరగానే ప్రభాకర్ రోడ్డు కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పని చేస్తూ గంజాయి వ్యసనానికి గురయ్యాడు. అతడికి వచ్చే జీతం సరిపోకపోవడంతో డబ్బు లు సంపాదించాలని గంజాయి అక్రమ రవాణా వ్యాపారాన్ని మొదలు పెట్టారు. ఒరిస్సా రాష్ట్రంలోని మల్కాన్ గిరి జిల్లాలోని చుట్టుపక్కల ప్రాంతాల నుండి గత సంవత్సరం నుండి గంజాయిని అక్రమ రవాణా చేస్తూ విక్రయిస్తున్నారు. అందులో ఉన్న 37.460 కిలోల గంజా యి, అతను ప్రయాణిస్తున్న కారు, సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ. 9లక్షల 25వేలుగా వెల్లడించారు. ఇతడిపై గతంలో భద్రాచలం, విశాఖపట్నంలో పలు కేసులు నమోదు అయ్యాయి. విచారణ అనంతరం వీరిని రిమాండ్‌కు తరలించారు. కేసును చేధించడంలో చాకచక్యంగా వ్యవహరించిన డిఎస్‌పిలు రవి, మట్టయ్య, సిసిఐ సిఐలు శివకుమార్, కోదాడ రూరల్, సూర్యాపేట పట్టణ సిఐలు రజితారెడ్డి, రాజశేఖర్, ఎస్ఐలు శ్రీకాంత్, అనిల్ రెడ్డి, గోపికృష్ణ, నవీన్‌లను అభినందించి రివార్డులను అందజేశారు.

## అసమానతలు లేని సమాజం కోసం పోరాడుదాం

భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన



**ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి:** అసమానతలు లేని సమాజం కోసం నిరంతరం పోరాటాలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన పిలుపునిచ్చారు.సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అణిచివేతలను అసమానతలను అత్యాచారాల కు వ్యతిరేకంగా పోరాటాలు సాగించాలన్నారు. మహిళలకు విద్యా,ఉద్యోగ,ఉపాధి రాజకీయ రంగాల్లో ప్రథమ స్థానం కల్పించినప్పుడే మహిళ సాధికారిక సాధ్యమవుతుందన్నారు. రాష్టంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలలో మహిళలకే ప్రాధాన్యత ఇవాలన్నారు. అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డులు,డబుల్ బెడ్ రూమ్‌లో ఇవ్వాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మహిళ మైనార్టీలపై నిత్యం దాడులు చేస్తున్న వాటిని అరికట్టడంలో చట్టాలను సమగ్రంగా అమలు చేయలేకపోవడం వలన ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి అన్నారు. అనేక సంవత్సరాలు మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులను సైతం ఇటు పాలకులు అటు న్యాయస్థానాలు కాలరాస్తున్నారని ఆరోపించారు.మహిళల సాధికారిత కొరకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సమాఖ్య జిల్లా కన్వీనర్ గిరి రమ,జిల్లా సమితి సభ్యులు సుజాత, హాసం దుర్గమ్మ, విజయ, సత్యనారాయణ నాయ క్ తదితరులు పాల్గొన్నారు.

## ‘గ్రీవెన్స్ డే’తో బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు : ఎస్‌పి



**ప్రజాపక్షం/నల్లగొండః** ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు.ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 32 మంది అర్జీదారులతో జిల్లా ఎస్‌పి నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని,పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా,నమ్మకం కలిగించాలని అన్నారు. ఎవరైనా చట్టవ్యతిరకమైన చర్యలు చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అన్నారు.బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

## దివ్యాంగులకు ఆర్‌టిసి ఉచిత ప్రయాణం కల్పించాలి : శ్రీనివాస్

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు.వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలను ప్రారంభించి ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు 4000 నుండి 6000 రూపాయలు చేయూత పింఛన్ అందజేస్తామని హామీ ఇచ్చారని ఇంతవరకు ఇచ్చిన హామీని అమలుపరచలేదన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలని వికలాంగుల శాఖను స్వతంత్ర శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. ఈనెల 26న చేపట్టే వికలాంగుల మహాగర్జనకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విహెచ్‌పిఎస్ ఉపాధ్యక్షులు,నల్లగొండ నియోజక వర్గం ఇన్చార్జి కొత్త వెంకన్న యాదవ్,ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఇరిగి శ్రీశైలం,విహెచ్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రెడ్డిమస్ ఇందిరా,ప్రధాన కార్యదర్శి పెరిక శ్రీను వాస్,జిల్లా అధ్యక్షులు కొమ్ము హరి,జిల్లా కో కన్వీనర్ తగ్గిల్ల వెంకన్న,వీరబోయిన సైదులు,జిల్లా మహిళా అధ్యక్షురాలు కసిరెడ్డి చైతన్య రెడ్డి,జిల్లా నాయకులు శంకర్,బొడ్డు సైదులు,ఇంద్రకంటి నగేష్,యాదగిరి,జిల్లా వెంకటేశ్వర్లు,నక్క సైదులు,లక్ష్మి పాల్గొన్నారు.




## రైస్ మిల్లర్లు లారీ ట్రాన్స్‌పోర్ట్ సహకారంతో త్వరలో ధాన్యం సేకరణ పూర్తి

యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** జిల్లావ్యాప్తంగా రైస్ మిల్లర్లు కేటాయించిన లారీ ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం సహకారంతో రెండు మూడు రోజుల్లోనే ప్రస్తుతం మార్కెట్ యార్డుల్లో ఉన్న ధాన్యం సేకరణ పూర్తి అవుతుందని యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. సోమవారం అయిన మూడోసారి పట్టణ కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్ళను ఇంకా స్పీడ్ అప్ చేసి నిర్ణయించిన సమయంలోనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే 100 నుండి 150 ధాన్యపు కొనుగోలు సెంటర్లలో రెండు, మూడు రోజుల్లో ధాన్యపు సేకరణ పూర్తయి ఖాళీ అవుతాయని అన్నారు. ఇంకా ఎక్కడైనా మిగిలిపోయిన ధాన్యం ఉంటే రైతులు వెంటనే అమ్ముకోవాలని సూచించారు. ధాన్యం అమ్ముకున్న రైతులకు 48 గంటల్లోనే తమ ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడ కూడా ఆలస్యం జరగకుండా కాంటా వేసిన వెంటనే ధాన్యపు బస్తాలను రైస్ మిల్లులకు తరలిస్తున్నట్టు తెలిపారు. ఈసారి రైస్ మిల్లర్లు లారీ ట్రాన్స్పోర్ట్ యాజమాన్యం సహకారం సిబ్బంది అందరూ సమన్వయంతో పద్ధతి ప్రకారంగా పనిచేయడం వల్ల ధాన్యం కొనుగోళ్ళు అనుకున్న సమయం కంటే ముందే పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. సెంటర్ ఇన్చార్జి నుంచి మొదలుకొని ఉన్నత స్థాయి అధికారుల వరకు ఎప్పటికప్పుడు టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ తగు సూచనలు ఇస్తూ కొనుగోళ్ళను త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటికే 122 రైతులకు రూ.3.30 కోట్లను రైతులకు చెల్లించినట్లు తెలిపారు. సర్వే ప్రకారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 69 శాతం పూర్తి లేటెస్ట్ సర్వే ప్రకారం జిల్లా వ్యాప్తంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 60 శాతం పూర్తయినట్లు కలెక్టర్ హనుమంతరావు వెల్లడించారు. మరింత తొందరగా సర్వే పూర్తి కావాలంటే ప్రజలు పూర్తిగా సహకరించాలని కావాల్సిన డాక్యుమెంట్లను ముందుగానే సిద్ధం చేసుకుంటే ఎన్యుమరేటర్లకు డేటా ఎంట్రీ సులభం అవుతుందని తెలిపారు. ఎంపీడీవోల ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల సూచనల మేరకు సర్వే శరవేగంగా కొనసాగుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరిగే విధంగా చేస్తున్న సర్వే కాబట్టి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. డేటా మొత్తాన్ని కంప్యూటరైజ్ చేయడానికి సిస్టంతో సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సర్వే పూర్తయిన వెంటనే మొత్తం పూర్తి డేటాను ఆన్లైన్లో ఉంచడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు స్పష్టం చేశారు. ఎండిఓ రాపర్తి భాస్కర్, ఎమ్మార్వో మహేందర్ రెడ్డి, ఆర్ఐ వెంకట్ రెడ్డి, పిఎసిఎస్ సీఈవో బాల్ రెడ్డి, నల్ల నాగేష్, రైతులు పిట్ట వెంకట్ రెడ్డి తదితరులు పరిశీలనలో ఉన్నారు.

## మట్టి గొంతులను వెలికి తీస్తాం

ప్రజాకవి వరంగల్ శ్రీనివాస్




**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** నూరేళ్లు నా ఊరు అనే గేయ కావ్యం లో భాగస్వాములు కావడానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండి అనేక మట్టి గొంతులను వెలికి తీసేందుకు 243 చరణాలతో 243 మంది గాయని గాయకులను ఆహ్వానించడం జరుగుతుందని ప్రముఖ గేయ రచయిత వాగ్గేయకారుడు వరంగల్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాకారులను గాయని గాయకులను తాము చేపట్టే కార్యక్రమానికి ఎంపిక చేసుకునేందుకు ఊరూరా తిరుగుతూ నల్లగొండకు రావడం జరిగిందని ఈ అవకాశాన్ని కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నా నూరేండ్ల ఊరు ఎట్లుండెను ఆనాటి ప్రజల జీవన స్థితిగతులు ఏవిధంగా ఉన్నాయో సమాజం ప్రస్తుతం ఎంత మార్పు జరిగిందో మనుషుల్లో ఇటువంటి మార్పులు వచ్చాయి వారి మానసిక పరిస్థితుల గురించి విశదీకరించి కవి ఆత్మకంగా రాసిన సుదీర్ఘ గేయ కావ్యం పాడడం కోసం కళాకారులను ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఈనెల 21న నకిరేకల్ మండల కేంద్రంలోని మూసి రోడ్లో గల గీతా మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి కవులు కళాకారులు గాయని గాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. వచ్చిన కళాకారులకు అన్ని వసతులు కల్పించడం జరుగుతుందని రెండు రాష్ట్రాల నుంచి కళాకారులు కవులు గాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో గాయకులు వేముల పుష్ప కవి అంబటి వెంకన్న మద్దెల సందీప్ జూపాక శివ గూడూరు మహేష్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ / సన్మానం



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** 57 జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నల్లగొండ కేంద్ర గ్రంథాలయంలో ఐదో రోజు సోమవారం గ్రంథాలయ సంస్థలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గాదె వినోద్ రెడ్డి, వయోజన విద్య అధికారి నర్సింహ రెడ్డి, సంస్థ కార్యదర్శి బి. బాలమ్మ.లు హాజరై విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి, పి .నాగేశ్వరావు, వేణుగోపాల చార్యులు గ్రంథపాలకులు, యం. నిర్మాలా దేవి, కట్టా నాగయ్య, యం. రాజేష్, బి. శ్రీనివాస్ ఉన్నారు.

## విద్యార్థుల హామీలు అమలు చేయరా?

రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్




**ప్రజాపక్షం/భువనగిరి:** ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలు సంవత్సరం కావస్తున్న అమలు ఏది అని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ అన్నారు. సోమవారం భువనగిరిలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉప్పుల శాంతి కుమార్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం గందరగోళంగా ఉందని, ఓ పక్క ఫీజు బకాయిల విడుదల లేవని, మరోపక్క గురుకులాల విద్యార్థులకు ఫుడ్ పాయిజన్‌లు జరుగుతున్నాయన్నారు. ఎన్నికల్లో విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, ల్యాప్‌టాప్ హామీల అమలు పదకొండు నెలలు అయిన లేదని సిఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ తన వద్ద పెట్టుకొని సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ప్రజా విజయోత్సవాలకు ఖర్చు చేయడానికి ఉన్న పైసలు విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిల విడుదలకు లేవా అని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చి డిసెంబర్ 7కి సంవత్సరం పూర్తి కావస్తున్న సందర్భంగా ప్రజా విజయోత్సవ వేడుకలు 25 రోజులు నిర్వహిస్తున్న ప్రభుత్వం ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు ఎం చేసిందో చెప్పాలన్నారు. రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉందంటూ ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తూ ఫీజు బకాయిల పై అనాడు చెప్పిన ఇచ్చిన మాట తప్పిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం నేడు ప్రజా విజయోత్సవల పేరిట వృధా ఖర్చు చేయడం కంటే ఫీజు బకాయిలు విడుదల చేస్తే విద్యార్థి లోకం, కళాశాలల సిబ్బంది సంతోషిస్తారన్నారు. రాష్ట్రంలో గురుకులాల విద్యాలయాల్లో నిత్యం ఫుడ్ పాయిజన్‌లు జరుగుతున్నాయని, వందలాది మంది విద్యార్థులు అనారోగ్యానికి గురి అవుతున్నారన్నారు. గురుకులాల పాఠశాలల్లో ఉన్న సమస్యల పరిష్కారం చేయడం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, బాసర త్రిబుల్ ఐటీలో విద్యార్థులు ఆత్మహత్యలు ఆగడం లేదని మేము అధికారంలోకి రాగానే బాసర త్రిబుల్ ఐటీ సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటానని చెప్పిన రేవంత్ రెడ్డి నేడు అధికారంలోకి వచ్చి 11 నెలలైనా బాసర త్రిబుల్ ఐటీ పై మాట ఎత్తడం లేదని, యూనివర్సిటీలల్లోఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ లేదన్నారు. విద్యారంగ సమస్యలపై విన్నవిద్దామంటే అపాయింట్మెంట్ ఇవ్వడం లేదని రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో గందరగోళంగా ఉన్న విద్యవ్యవస్థను బలోపేతం చేయాలని అదేవిధంగా రాష్ట్రంలో ఎస్సీ వెల్ఫేర్ గిరిజన శాఖ సహకారంతో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు రెండు సంవత్సరాలుగా బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని వెంటనే బకాయిలు విడుదల చేయాలని శాంతి కుమార్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మారుపాక లోకేష్, జిల్లా సమితి సభ్యులు రంపాక చందు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులను చెల్లించాలి

### ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు సుతారి రాములు డిమాండ్

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : మధ్యాహ్న భోజనం వండే కార్మికులకు వేతనాలు పెంచడమే కాకుండా ఒడింగ్ బిల్లులు చెల్లించాలని ఎఐయుసి జగిత్యాల జిల్లా అధ్యక్షులు సుతారి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కింద వంట చేసే కార్మికులకు గత ఆరు మాసాలుగా మెస్సు కోడిగుడ్లు, వేతనాల బిల్లులు రాకపోవడంతో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి డిఇఒ జగన్మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాములు మాట్లాడుతూ సెంటర్ లైజర్ కిచెన్ విధానం ద్వారా పాఠశాల వంట కార్యక్రమాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధానాన్ని విరమించుకోవాలన్నారు. ప్రస్తుతం ఇస్తున్న మెస్ చార్జీలు పెరు గుతున్న ధరలు అనుకూలంగా 25 రూపాయలు పెంచాలని, అలాగే గ్యాస్ వంట సరుకులు మొత్తం ప్రభు త్వమే సరఫరా చేసేవిధంగా ప్రయత్నం చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే జనవరి నుండి నిరవ ధిక సమ్మెకు వెళ్లవలసి వస్తుందని దానికి ప్రభుత్వమే బాధ్యత వహించవలసి వస్తుందని రాములు హెచ్చారించారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ముక్రం, జిల్లా నేతలు మునుగోరి హనుమంతు , శారద,రాజమణి, పద్మ, భాగ్యలక్ష్మీ చొప్పరి గంగాధర్, గంగు లక్ష్మీ , సబియా భేగం. పద్మ పాల్గొన్నారు

## ఎస్‌జిఎఫ్ క్రీడలలో పతకాలు సాధించిన రాష్ట్రస్థాయి విద్యార్థులు



తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థినికి కలెక్టర్ అభినందనలు

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో 16, 17న జరిగిన ఎస్‌జిఎఫ్ అండర్ 19 రాష్ట్రస్థాయి పోటీలలో కరీంనగర్‌కు చెందిన శ్రీ చైతన్య డిఫెన్స్,స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థినులు పాల్గొ ని ఉత్తమ ప్రతిభ కనబరిచి 68వ ఎస్‌జిఎఫ్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. ఎ.అక్షిత అండర్ 59 కేజీల విభాగంలో బంగారు పతకం, ఇ.శరణ్య 44కేజీల విభాగంలో బంగారు పతకం సాధిం చి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. 52 కేజీల విభా గంలో తేజస్విని, 40కేజీల విభాగంలో మహిత వెండి పతకాలు సాధించారు. వీరిని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేకంగా అభినందించారు. ఎంపికైన విద్యార్థినులు డిసెంబర్ 20 నుంచి 24 తేదీలలో మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ జగన్మోహన్‌రెడ్డి, పిడి లెంకల మహి పాల్‌రెడ్డి, తైక్వాండో కోచ్ బుర్ర ప్రవీణ్ కుమార్, పిఈటి రామక్రిష్ణలు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ



ప్రజాపక్షం/గంగాధర : గంగాధర మండలం కురిక్యాల సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు రైతులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించడంతో పాటు కొను గోళ్లలో వేగం పెంచాలని సూచించారు. రైతులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. ఒక్క కిలో అదనంగా జోకినా ఉపేక్షించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం అమ్మిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని, తక్కువ ధరలకు ప్రైవేట్ వ్యక్తులకు అమ్మి మోసపోవద్దని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.

## పరీక్షకు 52.63 శాతం హాజరు

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : జిల్లాలో 17,18 తేదీల్లో నిర్వహి ంచిన గ్రూప్ 3 పరీక్షలు ప్రశాం తంగా ముగిశాయి. మొత్తం మూ డు సెషన్లుగా నిర్వహించిన పరీక్ష లకు అధికారులు షెడ్యూల్‌లో పేర్కొన్న సమ యానికి అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకుని ప్ర శాంతమైన వాతావరణంలో పరీక్షలు రాశా రు. జిల్లాలో ఉదయం సెషన్‌లో మొత్తం 26415మంది విద్యార్థులకుగాను13902మంది పరీక్షలు రాశారు. 12513 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 52.63 శాతం హాజరు శాతం నమోద య్యింది. అభ్యర్థులు హాల్‌టికెట్, గుర్తింపు కార్డు పరిశీలించి క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత పరీక్షకు అను మతించారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, ఎసిపి విజయ్ కుమార్, గ్రూప్–3 పరీక్ష కో–ఆర్డినేటర్లు వరలక్ష్మి , సతీష్‌కుమార్, జాన్‌రెడ్డి, కలెక్టరేట్‌సూపరింటెండెంట్‌కాళీచరణ్ పరీక్ష నిర్వహణలో పాల్గొన్నారు.

## పద్మనగర్ జంక్షన్ పనులు పరిశీలన



ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి : స్మార్ట్ సిటీలో భాగంగా జిల్లా కేంద్రంలోని పద్మనగర్ జంక్షన్‌లో త్వరలో చేపట్టబోయే అభివృద్ధి పనుల కోసం స్థలాన్ని మేయర్ సునీల్‌రావు, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌లు సోమవారం పరిశీలించారు. రూ.65 లక్షలతో పద్మనగర్ జంక్షన్‌ను అభివృద్ధి చేసేందుకు అధికారులు నిర్ణయించారు. జంక్షన్ పనులు ఎంత విస్తీర్ణంలో చేపట్టాలన్న విషయమై స్మార్ట్ సిటీ, మున్సిపల్, రోడ్లు భవనాలశాఖ అధికారులతో కలెక్టర్, మేయర్ చర్చించారు. బైపాస్ రోడ్డు నుంచి వాహనాలు చర్చించారు. బైపాస్ రోడ్డు నుంచి వాహనాలు సజావుగా వెళ్లేందుకు, సిటీలోకివాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉన్న స్థలంలోనే అభివృద్ధి పనులు చేసేలా ఒక డిజైన్‌ని సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. స్మార్ట్‌సిటీ అధికారులతో కో ఆర్డినేషన్‌చేసుకోవాలని మున్సిపల్,రోడ్లుభవనాలశాఖ ఇంజనీర్లకు సూచించారు.

## అవకతవలు ఉండకూడదు

### – జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్.లత



ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ జగిత్యాల రూరల్ మండలం ఆ ంతార్గం, నర్సింగా పూర్, జగిత్యాల అర్బన్ మండలం అంబారి పేట్, ధరూర్ గ్రామాల ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగో లు కేం ద్రాలను సోమవారం జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్.లత ఆకస్మిక తనిఖీ చేశారు. జగిత్యాల జిల్లాలోని ధాన్యంకొనుగోలు కేంద్రాలలో ఎలాంటి అవకతవకులు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని మ్యాచరు వచ్చిన వెంటనే తూకం వేయాలని అధికారులను సూచించారు.తప్ప,తాలు లేకుండా చూడాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా తాటి పత్తర్లులు, మంచినీరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు.

# ప్రజావాణి సమస్యలకు అధిక ప్రాధాన్యం



### * ప్రజావాణికి అనుమతిలేకుండా గైర్హాజరైతే కఠిన చర్యలు

### జిల్లా కలెక్టర్ మనుచౌదరి

ప్రజాపక్షం/సిద్దిపేటప్రతినిధి : ప్రజావాణి కార్యక్రమం లోవచ్చే సమస్యలను అధిక ప్రాధాన్యత నిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి సంబధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులను,వినతులను జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలసి స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరు తూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఏన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి వస్తారన్నారు. అధికారులు వారి శాఖలవారిగా స్వీకరించి ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించటంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండ ఎప్పటి కప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలనిఅధికారులను ఆదేశించారు.జిల్లా అధికారులు ప్రజావాణికి విధిగా హాజరుకావాలని, అనుమతిలేనిదే గైర్హాజరు అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ నాగరాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం

### కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి : ప్రజావాణిలో స్వీకరించే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వ రం పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరి యంలో ప్రజావాణి నిర్వహించారు. అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్‌తో కలిసి ప్రజల నుంచి దర ఖాస్తులను స్వీకరించారు.వారు మాట్లాడుతూ సిఎం ప్రజాదర్బార్ లాగిన్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను వచ్చే నెల ఒకటికల్లా పరిష్కరించాలని మండల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధికారి పవన్ కుమార్, ఏవో సుధాకర్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



### ఆర్జీలపై సత్వర చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : ప్రజావాణిలో సమస్యలు తెలుపుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్య క్రమంలో జిల్లా కలెక్టర్ కోయశ్రీహర్ష ప్రజల దరఖాస్తులు స్వీకరించారు. మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలపై వెంటనే స్పందించాలి



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు సత్వర పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు వినతులను అదనపు కలెక్టర్ బిఎస్‌లత, గౌతం రెడ్డిలతో కలిసి స్వీకరించారు.

కలెక్టర్ మాట్లాడుతూ సమ స్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లా లోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్ర యాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవ హరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్య త ఇవ్వాలని అన్నారు. ఆర్జీలను ఎప్పటికప్పు డు పరిశీ లన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని అధికారు లను ఆదేశించారు.అదనపు కలెక్టర్ బిఎస్‌లత, గౌతం రెడ్డి, కలెక్టరేట్ ఎఒ హన్మంత రావు, డిఆర్‌డిఒ రఘు వరన్, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల ఆర్‌డిఒలు, వివిధ జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ప్రతిభకు పట్టంకట్టిన ఆల్ఫోర్స్ ఎడ్యూ ఎగ్జిబిషన్





ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి : కరీంనగర్‌లోని కొత్తపల్లిలో గల ఆల్ఫోర్స్ ఇటెక్నో స్కూల్‌లో 'అల్ఫోర్స్ ఎడ్యు ఎగ్జిబిషన్'ను స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి హాజరై ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు తరగతి గదుల విషయాలతో పాటు సామాజిక స్పృహకల్పించాల్సిన అవసరం చాలా ఉందన్నారు. విద్యార్థులకు వార్షిక ప్రణాళికల్లో భాగంగా వివిధ విషయాలలోని అంశాలను చాలా సమగ్రంగా తెలపాలని, ప్రాథమిక దశనుంచే అంశాలను విశ్లేష ణాత్మకంగా తెలిపి వివిధ స్థాయిలలో నిర్వహింపబడే పోటీలకు ఎంపిక చేసే ప్రోత్సాహం అందించాలని చెప్పారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ప్రతి విషయాన్ని చాలా సమగ్రంగా తెలిపితే వారు ఆ విషయాలలో సృజనాత్మకంగా వివిధ పరిశోధనలను చేయడమే కాకుండా సమాజ హితానికి తోడ్పాటునందిస్తారని అభిప్రాయపడ్డారు. పాఠశాలలో విధ్యనభ్యసిస్తున్న విద్యార్థులకు వార్షిక ప్రణాళికల్లో అనేక విషయాలను నిష్ణాతులచే బోధించడం జరుగుతుందని, ఆ విషయాల పట్ల పరీక్షలను నిర్వహిస్తూ ప్రతిభను వెలికి తీస్తున్నామన్నారు. త్వరలో నిర్వహించనున్న వివిధ పోటీలలో ప్రాతినిధ్యం వహించడమే కాకుండా లక్ష్యమే పరమావధిగా ప్రణాళికలను రూపొందించి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లిక్విడ్, డెన్సిటీ, హైడ్రోఫ్యూల్ జనరేటర్, ప్లాస్టిక్ నిర్వహణ, ఆమ్ల వర్షం, బోర్స్ మాడల్, బొగ్గు తయారీ, నీటి శుద్ధి యంత్రం, పిర్యాడిక్ , ట్రెపీజియమ్, గణిత్వరల్డ్, వరల్డ్ ఆఫ్ మ్యాథ్స్ తదితర నమూ నాలను తయారు చేసుకుని పాఠశాలలో ప్రదర్శనతో పాటు వీక్షకులకు వివిధ వస్తువుల పట్ల కలిగే లాభ నష్టాలను తెలిపామని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం..!

### కాంగ్రెస్ నాయకులు హితువు



ప్రజాపక్షం/రామగిరి : ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తుందని రాజకీయ ప్రయో జనాల కోసం బిఆర్‌ఎస్ నాయకులు అర్ధరహిత విమర్శలు చేయడం మానుకోవాలని కాం గ్రెస్ నాయకులు హితువు పలికారు. సోమవారం కమాన్ పూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహంముందు సోమవారం వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావే శంలో మా ట్లాడారు. మ ంథని నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యే యంగా అహర్నిషలు కృషి చేస్తున్న శ్రీధర్ బాబుకు మంథ ని నియోజకవర్గం ప్రజలు వరుసగా ఎమ్మెల్యేగా గెలిపిస్తూ పట్టం కట్టడమే ఇందుకు నిలు వెత్తు నిదర్శనమన్నారు.బిజెపి నాయకులు చల్లా నారాయణ రెడ్డి నిరాంధారమైన ఆరోపణలు చేయ డం సిగ్గు చేటన్నారు. రాజకీయ ఉనికి కోసమే మంత్రి శ్రీధర్‌బాబుపై అసత్యపు ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ వస్తుందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబుపై కాంగ్రెస్ ప్రభుత్వంపై అర్ధరహిత విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం పుట్ట మధు, బిజెపి నేత చల్ల నారాయణరెడ్డి లకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు నినా దాలు చేశారు. అనంతరం పుట్ట మధు దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వైనాల రాజు, మండల ప్రధాన కార్యదర్శి మల్యాల తిరుపతి, పీ. ఏ. సీ. ఎస్ చైర్మ న్ ఇనగంటి భాస్కర్‌రావు, మాజీ ఎంపిపి కోలేటి మారుతి, జిల్లా కార్యదర్శి అన్వర్, రంగు సత్యనారా యణ గౌడ్, గడప కృష్ణమూర్తి,శేవ్వ శంకరయ్య, ఆడేపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జగపతిరావు విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

### సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డికి వెలిచాల సాధన సమితి వినతి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేసిన కాంగ్రెస్ సీనియర్‌నేత, మాజీ ఎమ్మెల్యే దివంగత వెలిచాల జగపతిరావు విగ్రహం కరీంనగర్‌లో ఏర్పాటు చేసేందుకు 20గుంటల స్థలం కేటాయించేలా సహ కరించాలని కోరుతూ సోమవారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నేత వహాబుద్దీన్‌లకు వెలిచాల సాధన సమితి కన్వీనర్ సరిల్ల రతన్‌రాజు, కో కన్వీనర్ తదితరులు వినతిపత్రాలు అందజేశారు. స్మార్ట్‌సిటీలో భాగంగా నిర్మించిన కరీంనగర్ మానేరు రివర్ ఫ్రంట్‌కు జగపతిరావు పేరు పెట్టేలా కృషి చేయాలని కోరారు. పేదల పెన్నిధిగా ప్రజల మన్ననలు పొందిన మహానాయకుడు జగపతిరావు విగ్రహం ఏర్పాటుకు 20 గుంటల స్థలం, మానేరు రివర్ ఫ్రంట్‌కు ఆ మహానేత పేరు పెట్టేలా తమ వంతు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆ కార్యం నెరవేర్చేలా చూస్తామని పేర్కొన్నారు. రెండుసార్లు మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా పని చేసి మంచి గుర్తింపు తీసుకొచ్చిన నాయకుడు జగపతిరావుఅని చెప్పారు. జగపతిరావుకు పిన్న వయస్సులోనే హైదరాబాద్ స్వతంత్ర పోరాటంతో ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తు చేశా రు. కవిగా, రచయితగా, ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా గతంలో మూడు విశ్వవిద్యాలయాలకు సెనేట్ మెంబర్‌గా పనిచేసి ఎంతో ఖ్యాతి గడించారని పేర్కొన్నారు. అంతగొప్ప నేత సేవలను ప్రజలు స్మరిం చుకోవడానికి గుర్తుగా కరీంనగర్‌లో జగపతిరావు విగ్రహం ఏర్పాటుకు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా పరిధిలో 20 గుంటల స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ నియోజకవర్గంలో జగపతిరావు ప్రజాబంధు, టైగర్ అనే పేరును సంపాదించుకున్నారని పేర్కొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం

### సర్వేపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు

### ఎంఎల్‌సి జీవన్‌రెడ్డి



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా, పని చేస్తోం దని మాజీ మంత్రి కాంగ్రెస్ సీనియర్ నాయకులు పట్ట భద్రుల ఎంఎల్‌సి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా రాయికల్ మండల ంలోని అల్లిపూర్ గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వేలోఎంఎల్‌సి జీవన్‌రెడ్డి పాల్గొని ఎన్యుమరేటర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్యుమ రేటర్లు నింపుతున్న దరఖాస్తులను జీవన్‌రెడ్డి పరిశీలించారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు వారి వివరాలు క్లుప్తంగా చెప్పాలని, ఎలాంటి అపో హలు పెట్టుకోవద్దని సూచించారు. నిధుల కొరతతో కొన్ని పథకాల అమ లులో జాప్యం జరుగుతుందని వాటిని రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే అమలు చేస్తుందని జీవన్‌రెడ్డి తెలిపారు.

## త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

### లారీపై నుంచి రోడ్డుపై పడ్డ గ్రానైట్ రాళ్లు



ప్రజాపక్షం/చిగురుమామిడి : కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామం నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న గ్రా నైట్ లారీ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయ డంతో లారీపై నుంచి రోడ్డుపై గ్రానైట్ రా యిలు పడ్డ ఘటనలో త్రుటిలో ప్రమాదం తప్పిందని వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో సుందరగిరి నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న గ్రానైట్ లారీ ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలోని కోళ్లఫారం వద్ద ఒకసారిగా మరో డిసిఎంను తప్పించబోయి లారీ డ్రైవర్ బ్రేక్ వేశాడు. దీంతో లారీపై ఉన్న గ్రానైట్ రాయిలురెండు రోడ్డుపై పడ్డాయి. లారీ దగ్గరే ఉన్న నవాబుపేట గ్రామానికి చెందిన వాహనదారుడు, హుస్నాబాద్‌కు చెందిన ద్విచక్ర వాహన దారులకు త్రుటిలో ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తున్నాడని వాహనదారులు పేర్కొన్నారు. వెంటనే చిగురుమామిడి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు వారు తెలిపారు. అధిక లోడులు వేసుకుని లారీలతో రోడ్డు ఎక్కుతున్నారని, ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోతే ఎవరు బాధ్యులు అవుతారని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు, పోలీసులు ప్రత్యేక దృష్టిసారించి గ్రానైట్ లారీలను అదుపు చేయాలని కోరుతున్నారు. ఈ మేరకు అలారీని నడుపుతున్న డ్రైవర్ స్వామి అనే వ్యక్తి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించడానికి అజాగ్రత్తగా నడుపుతూ సడెన్‌గా బ్రేక్ వేయడంతో లారీ పైనున్న గ్రానైట్ రాళ్లు కింద పడడంతో పెనుప్రమాదం తప్పిందని, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపిని డ్రైవర్ స్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బండి రాజేష్ తెలిపారు.

## 20న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

### ముఖ్యమంత్రి వేములవాడ పర్యటనను విజయవంతం చేయండి – ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్



ప్రజాపక్షం/వేములవాడటౌన్: ఈనెల 20తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటనసందర్భంగా వేములవాడ పట్టణంలోని మహాలింగే శ్వర గార్డెన్స్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, మానుకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ప్రభు త్వ విప్ మాట్లాడు తూ20న బుధవారం ఉదయం 10.30 కి వేములవాడకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నారన్నారు. ముఖ్యమంత్రి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలు చేస్తారని, దక్షిణ కాశీ గా ఉన్న వేములవాడ రాజన్న ఆలయం అభివృద్ధి, విస్తరణ చేపడుతున్నామని వారు పేర్కొన్నారు. 2023–24 బడ్జెట్‌లో రాజన్న ఆలయానికి 50 కోట్లు నిధులు కేటాయించారు.కేసీఆర్ గతంలో ఏటా 100 కోట్లు కేటాయిస్తామని మోసం చేసి రంగు రంగుల బ్రౌచర్లతో కాలం వెల్లదిశారు. సీఎం చేతుల మీదగా ఆలయ విస్తరణకీ శంకుస్థాపన చేపడుతున్నామని, రాజన్న ఆలయం, వేములవాడ పట్టణ అభివృద్ధి సమాంతరంగా ఉంటుందన్నారు. ఆనాడు ముంపు గ్రామాల సమస్యలు పరిష్కారానికి పిసిసి హోదాలో రేవంత్‌రెడ్డి, బట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, మేడిపల్లి సత్యం, అడ్లూరి లక్ష్మ ణ్, కకవ్వంపల్లి సత్యనారాయణ ముంపు గ్రామంలో సమస్యలపై అనేక పోరాటలు చేశారు. రేవంత్ రెడ్డి సంకేపల్లిలో పల్లె నిద్ర చేసి ముంపు గ్రామాల ప్రజలకు ఒక భరోసా కల్పించారు. సూరమ్మ చెరువు ప్రోజెక్టల కోల్పోయిన బోరు బావులకు, మర్రిపల్లి రిజర్వాయర్, లచ్చ పేట రిజర్వాయర్, మిగిలిన భూసేకరణ కోసం 4కోట్లు నిధులు మంజూరు చేసాం అని అన్నారు. ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి 1737 కో ట్లతో శ్రీ పాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ కు అంకురార్పణ చేశారు. 2009 కి ముందే చందుర్తి, ఫాజుల్ నగర్, రుద్రంగి ప్రోజెక్టుల పూర్తి అయ్యాయి. ప్రజా ప్రభుత్వం లో మళ్ళీ ఇప్పుడు కలికోట సూరమ్మ చేరువు, మర్రిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభం అయ్యా యి. రేవంత్ రెడ్డి పర్యటన ద్వారా మన ప్రాంతం మరింత అభివృద్ధి కి దోహద పడుతుంది. పట్టణాల నుండి గ్రామాల నుంచి బారి ఎత్తున జన సమీకరణ చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలని అన్నారు.

## ప్రభుత్వ పాఠశాల తనిఖీ



ప్రజాపక్షం/జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలములోని జాబితాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేసి పాఠశాలను పరిశించారు. పిల్లలకు ఏమై నా సమస్యలు ఉన్నాయా అని అరాతీశారు. మధ్యాహ్న భో జనం నాణ్యతను పరిశీలించి పిల్లలకు నాణ్యమైన ఆహారం మెను ప్రకా రంగా అందించాలని మధ్యాహ్న భోజన కార్మికులకు సూచించారు. పిల్లలతో కలిసి జగిత్యాల మండల ప్రజా పరిషత్ అధికారి రమాదేవి మధ్యాహ్న భోజనం చేశారు.

## నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న 4ప్రైవేటు ఆసుపత్రులు సీజ్




ప్రజాపక్షం/ సిద్దిపేటప్రతినిధి : జిల్లా వైద్యశాఖ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పల్వాన్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వైద్యాధికారుల బృందం ఆనంద్, శ్రీనివాస్, శ్రీకళ, అరుణ్‌కుమార్‌ల బృందం సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంల పలు ప్రైవేటు ఆసుపత్రులను అకస్మీక తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పలు ఆసుపత్రులు నిరామయ, భజరంగ్ పాలిక్లినిక్, మారుతి పాలిక్లినిక్, గురుసాయి కంటి ఆసుపత్రులను వైద్యాధికారులు సీజ్ చేశారు. క్లీనికల్ ఎస్టాబ్లిస్మెంట్ యాక్ట్ 2010 అనుసరించి ఆసుపత్రుల్లో యజమాన్యం రిజిస్ట్రేషన్ లేకుండ,రెన్యూవల్స్‌ను సకాలంలో చేసుకో కుండ నిర్వహిస్తున్నారన్నారు.పెషెంట్ సమాచారాన్ని కేషీట్‌లో పూర్తి వివరాలు నింపకుండ రికార్డులను సక్రమంగా అప్‌డేట్ చేసుకోకుండ ఆసుపత్రిపేరు మార్చిన, డాక్టర్ల పేరు మార్చిన జిల్లా వైద్యాధికారికి తెలుపకుండ డిఆర్‌వి అనుమతి పొందకుండా ఏ ఆసుపత్రి యజమాన్యం నడిపితే వారికి క్లీనికల్ ఎస్టా బ్లిష్మంట్ యాక్టు అనుసరించి ప్రతి నెల 5వ తేదిలోగ హెచ్‌ఐఎంఎస్ పోర్టల్ అప్‌డేట్ లేకుండ నిర్వహిస్తున్న యజమాన్యానికి శిక్షించటం జరుగుతుందని డిఎంహెచ్‌ఒ తెలిపారు.

# కాలుష్యరహిత జీవనం అందించడం అన్ని రాష్ట్రాల రాజ్యాంగవిధి

### సుప్రీంకోర్టు డివిజన్‌బెంచ్ మార్గనిర్దేశం
### ఢిల్లీ ఎన్‌ఆర్‌సి రాష్ట్రాల్లో జిఆర్‌ఎపి-4 ఆంక్షల అమలు బృందాల ఏర్పాటుకు ఆదేశం

**న్యూఢిల్లీ :** పౌరులందరూ కాలుష్యరహిత వాతావరణంలో జీవించేలా జాగ్రత్త వహించడం అన్ని రాష్ట్రాల రాజ్యాంగ విధి అని సుప్రీంకోర్టు మార్గనిర్దేశం చేసింది. సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓక, ఆగస్టిన్ జార్జి మాసిహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి కఠినమైన చర్యలను అమలు చేయడంలో జాప్యాన్ని ముఖ్యంగా ఎత్తిచూపింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జిఆర్‌ఎపి)4 ఆంక్షలను అమలు చేయడానికి తక్షణమే బృందాలను ఏర్పాటు చేయాలని ఢిల్లీ దేశ రాజధాని ప్రాంత (ఎన్‌సిఆర్) రాష్ట్రాలను కోరింది. దేశ రాజధాని ఢిల్లీకి ఆనుకుని ఉన్నటువంటి హర్యానా. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలను ఎన్‌సిఆర్ స్టేట్స్‌గా పరిగణిస్తారన్న విషయం తెలిసిందే. ఇది ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎక్యుఐ) 450 కంటే తక్కువగా ఉన్నప్పటికీ అమలులో ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. వాయు నాణ్యతా సూచిక (ఎక్యుఐ) స్థాయిలు 450కంటే తక్కువకు పడిపోయినా కూడా కొనసాగించడానికి తామే జిఆర్‌ఎపి 4వ దశకింద పరిమితులను నిర్దేశిస్తామని బెంచ్ వివరించింది. ఢిల్లీఎన్‌సిఆర్ రాష్ట్రాలు 12వ తరగతి వరకు ఫిజికల్ క్లాసెస్ (శారీరక తరగతులు)ను నిర్వహించడంపై తక్షణమే పిలుపునివ్వాలని డివిజన్‌బెంచ్ కోరింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్‌లోని 4వ దశ కింద పరిమితులను ఉల్లంఘించినందుకు ఫిర్యాదులు చేయగలిగే యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని బెంచ్ ఆదేశించింది. ప్రారంభంలో, జిఆర్‌ఎపి దశల్లో కాలుష్యనివారణ చర్యలు చేపట్టడంలో జాప్యంపై ఢిల్లీ ప్రభుత్వం, కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సిఎక్యుఎం)ను సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. దీనిపై ఢిల్లీ ప్రభుత్వం తరపు న్యాయవాది సమాధానం ఇస్తూ సోమవారం నుంచి గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జిఆర్‌ఎపి)4వ దశ అమలులోకి వచ్చిందని, భారీ వాహనాలు దేశ రాజధాని ఢిల్లీలోకి ప్రవేశించకుండా నిషేధించామని తెలియజేశారు.'వాయు నాణ్యత సూచిక స్థాయి ప్రమాదకర స్థాయిలను మించిపోతున్న కారణంగా జిఆర్‌ఎపి దశలను తక్షణమే అమలుచేయాలి. ఇలా చేయడం కొంత అత్యవసరం' అని ధర్మాసనం తెలిపింది. వాయు నాణ్యత సూచిక (ఎక్యుఐ) 300–400 మధ్య చేరిన మరుక్షణమే దశ 4ను ప్రారంభించాలి. దశల దరఖాస్తును ఆలస్యం చేయడం ద్వారా మీరు 4 జిఆర్‌ఎపి విషయంలో ఎలా రిస్క్ తీసుకుంటారని ధర్మాసనం న్యాయవాదిని అడిగింది. ప్రమాదకరంగా పెరుతున్న కాలుష్యస్థాయిల కంటే జిఆర్‌ఎపి యొక్క వివిధ దశలను అమలుచేయడానికి బదులుగా వాతావరణ పరిస్థితులలో మెరుగుదల కోసం సిఎక్యుఎం వేచి ఉన్నదని తెలిపింది. కాలుష్యానికి అడ్డుకట్ట వేసే ముందస్తు చర్యలను అమలుచేసేందుకు ఢిల్లీ ప్రభుత్వం, ఎన్‌సిఆర్ రాష్ట్రాలు నవంబరు 22 తేదీ నాటికి జిఆర్‌ఎపి కింద సూచించిన వాటితో పాటు ఏమేమి చర్యలు తీసుకుంటున్నారన్న విషయమై ఒక అంగీకార అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. దేశ రాజధానిలో, చుట్టుపక్కల తీవ్రత పరిస్థితి ప్రకారం వాయు కాలుష్యానికి వ్యతిరేక చర్యలను అమలుచేయడాన్ని జిఆర్‌ఎపి మొట్టమొదట 2017లో ప్రారంభించింది.



**విషపూరిత పొగమంచు మూలంగా**
**ఢిల్లీ ప్రజల ఆరోగ్యాలకు ముప్పు : డాక్టర్ల హెచ్చరిక**

సోమవారం నాడు దేశ రాజధాని ఢిల్లీ విషపూరిత పొగమంచు గుప్పిట్లో చిక్కుకుంది. ఈ నేపథ్యంలో వాయు నాణ్యత దారుణ స్థితికి చేరుకుంది. దేశ రాజధాని ఢిల్లీలోని ద్వారక, ముండ్క, నజాఫ్‌ఘర్‌లో సోమవారం మధ్యాహ్న సమయానికి వాయు నాణ్యత సూచిక (ఎక్యుఐ) గరిష్టస్థాయి చేరుకుందని తెలిపింది. ఢిల్లీ ప్రజలు దట్టమైన నిరవధిక పొగమంచు కారణంగా తమకు గజ్జి, కండ్లలోనుంచి నీరు రావడం వంటి వ్యాధులు తలెత్తుతున్నాయని ఫిర్యాదు చేశారు. ఢిల్లీ ఎక్యుఐ సోమవారం ఉదయం వేళకే ఈ సీజన్‌లో ఎన్నడూ లేని రీతిలో 484కు రికార్డు అయ్యింది. మధ్యాహ్నం 2గంటల సమయానికి ఎక్యుఐ 491కి పెరిగిందని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సిపిసిబి) తెలియజేసింది. 40మోనిటరింగ్ స్టేషన్లకు గాను 37 స్టేషన్ల నుంచి అందిన డేటా ప్రకారం ద్వారకా సెక్టార్ 8, నజఫ్‌ఘర్, నెహ్రూ నగర్, ముండ్క ప్రాంతాలలో ఎక్యుఐ స్థాయిలు గరిష్ట స్థాయిలో 500కు చేరుకున్నాయని జాతీయస్థాయి ఎక్యుఐని గంట గంటకూ అందించే ఎస్‌ఎఎంఇఇఆర్ (సమీర్) తెలియజేసింది.

**ఢిల్లీ విమానాశ్రయం నుంచి**
**14విమానాల దారిమళ్లింపు, ఆలస్యం !**

దేశ రాజధాని ఢిల్లీని చుట్టుముట్టిన విషపూరిత పొగమంచు వాతావారణం కారణంగా సోమవారం ఢిల్లీ విమానాశ్రయం నుంచి మొత్తం 14విమానాలను దారి మళ్లించారు. చెడు వాతావరణం కారణంగా ఢిల్లీలో విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. విమానాల రాకపోకలు సరిగా కనిపించకపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొందని అధికార వర్గాలు వెల్లడించాయి. సరిగ్గా కనబడకపోవడం వల్ల విమానాల రాకపోకలపై ప్రభావం పడుతున్నదని ఎయిర్ ఇండియా, స్పైస్ జెట్, ఇండిగో విమాన యాన సంస్థలు తమ ప్యాసింజర్లను సామాజిక మాధ్యమం 'ఎక్స్' పోస్ట్ ద్వారా అప్రమత్తం చేసింది. మొత్తం 14విమానాలలో 13విమానాలను జైపూర్‌కు, మిగతా ఒక విమానాన్ని డెహ్రాడూన్‌కు దారి మళ్లించినట్లు ఒక అధికారి తెలియజేశారు. ఈ దారి మళ్లింపులు ఉదయం 830గంటల నుంచి మధ్యాహ్నం 3గంటలవరకు కొనసాగాయని వివరించారు. ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లిమిటెడ్ (డిఐఎఎల్) ప్రతీరోజూ 1400 విమానాల రాకపోకలను హ్యాండిల్ చేస్తుంది. ఢిల్లీ విమానాశ్రయంలో 'తక్కువ విజిబులిటీ' కొంత మెరుగుపడిన కారణంగా ఇప్పుడు అన్ని విమానాల రాకపోకలు ప్రస్తుతం సాధారణ స్థితికి చేరుకున్నాయని డిఐఎల్ సోమవారం ఉదయం 'ఎక్స్'పోస్ట్‌లో వెల్లడించింది.

### వాయు కాలుష్య నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం రాజకీయ క్రీడలు : అతిశీ విమర్శల దాడి

ఉత్తర భారతదేశం అంతటా ప్రమాదకర స్థాయిలో తీవ్రమవుతోన్న వాయు కాలుష్యంపై సోమవారం ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీ బిజెపిని నిందించారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో పొట్టేలు, పెరిగిన వెంట్రుకలు, కొయ్యకాళ్లు తగులబెడుతు న్న మంటల కారణంగా ఆ వాయుకాలుష్య ప్రభావ ం దేశరాజధాని ఢిల్లీపై పడుతున్నదని, ఫలితంగా ఉత్తర భారతదేశంలో మెడికల్ ఎమర్జెన్సీ కూడా తలెత్తుతున్నదని అతిశీ ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మాత్రం ఈ సంక్షోభాన్ని పరిష్కంచడానికి బదులు రాజకీయ ఆరోపణల ఆటలు ఆడుతున్నదని ఆమె ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ధ్వజమెత్తారు. నరేంద్రమోదీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం వల్ల ఉత్తర భారతదేశం ఉక్కిరిబిక్కిరి అవుతోందని మండిపడ్డారు. బిజెపి పాలిత రాష్ట్రాలైన హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ లలో పొట్టేలు, వెంట్రుకలు, కొయ్యకాళ్లు తగులబెడుతున్న మంటలు ఉధృతంగా వ్యాపిస్తున్నాయని, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధికారంలో ఉన్న పంజాబ్ రాష్ట్రంలో మాత్రం ఈ పరిస్థితి క్షీణించిఅదుపులోనే ఉన్నదని అతిశీ చెప్పారు. పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వ సమర్థ పరిపాలన వల్లే అక్కడ మంటల వ్యాప్తి తగ్గిపోయాయని అధికారిక సమాచారాన్ని వివరించారు. ఢిల్లీ ప్రజలు శ్వాసకు సంబంధించి పోరాటం చేస్తున్నారని, వాయు కాలుష్యం వల్ల ఢిల్లీలో అనారోగ్యానికి గురవుతోన్న వృద్ధులు మొదలు పిల్లలు వైద్యపరంగా మద్దతు కోరుతున్నా కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం స్పందించడం లేదని కేంద్ర ప్రభుత్వంపై విమర్శల దాడి చేశారు. ఉత్తర భారతదేశంలో కాలుష్య తీవ్ర పరిస్థితిని అరికట్టడానికి బదులు కేంద్ర ప్రభుత్వం 'రాజకీయ క్రీడల్లో' బిజీగా ఉన్నదని ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వం అరికట్టిన మాదిరిగా కేంద్ర ప్రభుత్వం బిజెపి పాలిత రాష్ట్రాలలోనైనా ఎందుకు చర్యలు చేపట్టడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని అతిశీ ప్రశ్నించారు.

# డిసెంబరు 6న రైతులు 'చలో ఢిల్లీ'

### ఎస్‌కెఎం, కెఎంఎం ప్రకటన



**చండీగఢ్ :** పంజాబ్ రైతులు మరోసారి ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. పంటలకు ఎంఎస్‌పికి చట్టబద్ధత సహా తమ డిమాండ్ల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు డిసెంబరు 6వ తేదీన రైతులు ఢిల్లీకు ప్రదర్శనగా వెళ్తారని సంయుక్త కిసాన్ మోర్చా (రాజ్యాంగేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా సోమవారం ప్రకటించాయి. సోమవారం చండీగఢ్‌లో రైతు నేతలు సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఎస్‌కెఎం, కెఎంఎం నేతృత్వంలోని 'ఢిల్లీ చలో'ను భద్రతా బలగాలు అడ్డుకోవడంతో ఫిబ్రవరి 13వ తేదీ నుంచి పంజాబ్, హర్యానా మధ్య ఉన్న సంభు, ఖనౌరి సరిహద్దుల్లో రైతులు నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. కాగా, కెఎంఎం నేత సర్వన్‌సింగ్ పంధేర్ మీడియాతో మాట్లాడుతూ సుదీర్ఘ కాలం నిరీక్షణ తరువాత డిల్లీకి ర్యాలీగా వెళ్లాలని నిర్ణయించామన్నారు. అందులో డిసెంబరు 6వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. రైతుల డిమాండ్ల అమలుపై అన్నదాతలతో ఎలాంటి చర్చలు జరపకపోవడంతో కేంద్ర ప్రభుత్వంపై పంధేర్ మండిపడ్డారు. ర్యాలీ చేయడం తప్ప తమకు మరో ప్రత్యామ్నాయం లేదన్నారు. ప్రభుత్వం చర్చలు జరుపుతాదని తాము శాంతియుతంగా 9 నెలలపాటు వేచి చూశామని కానీ, ఇప్పుడు ఢిల్లీకి ర్యాలీగా వెళ్లక తప్పడం లేదన్నారు. సంభు సరిహద్దు నుంచి విడతల వారీగా రైతులు దేశ రాజధాని వైపు దూసుకెళ్తారని పంధేర్ పేర్కొన్నారు. భారతీయ కిసాన్ యూనియన్ (షహీద్ భగత్‌సింగ్) నేత తేజ్‌వీర్ సింగ్ మాట్లాడుతూ 280 నుంచి రెండు సరిహద్దుల్లో తాము నిరసన తెలుపుతున్నామని, ఫిబ్రవరి 18వ తేదీ నుంచి ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం తమతో చర్చలు జరపలేదన్నారు. కాగా, తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని, ఈనెల 26వ తేదీ నుంచి తమ ప్రాణాలు పోయే వరకు నిరాహారదీక్ష చేస్తామని గత వారం రైతులు ప్రకటించిన విషయం విదితమే. ఈ నిరాహార దీక్షలో రైతు నేత జగజిత్‌సింగ్ దల్లేవాల్ కూడా పాల్గొననున్నారు. పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) చట్టబద్ధమైన హామీతో పాటు, రైతులు వ్యవసాయ రుణమాఫీ, రైతులకు, రైతు కూలీలకు పెన్షన్, విద్యుత్ ఛార్జీల పెంపుదల, పోలీసు కేసుల ఉపసంహరణ, 2021 లఖింపూర్ ఖేరీ హింస బాధితులకు 'న్యాయం' చేయాలని, భూసేకరణ చట్టం 2013 పునఃస్థాపన, 2020–21లో ఆందోళనల సందర్భంగా మరణించిన రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# యుపిలో ఉప ఎన్నికలు 'బాబా సాహెబ్, బాబా' మధ్య పోరాటం

### సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్



లక్నో : ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న ఉప ఎన్నికలు బాబాసాహెబ్ బీమ్‌రావు అంబేద్కర్‌ను విశ్వసిస్తున్న వారి మధ్య, బాబాను నమ్ముతున్న వారి మధ్య పోరాటంగా సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) చీఫ్ అఖిలేశ్ యాదవ్ అభివర్ణించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను ఉద్దేశించి పరోక్షంగా అఖిలేశ్ వ్యాఖ్యలు చేశారు. ఒకవైపు రాజ్యాంగాన్ని రచించి, రక్షించిన వారు ఉంటే, మరోవైపు దానిని విధ్వంసం చేసిన వారు ఉన్నారని ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు పిడిఎలను (పిచ్‌డే, దళిత్, అల్పసంఖ్యాక్– వెనుకబడిన, దళితులు, మైనారిటీలు) రాజ్యాంగం రక్షిస్తే.... ఇక నుంచి పిడిఎ రాజ్యాంగాన్ని రక్షిస్తారన్నారు. ఐక్యతను చాటండి, జై సంవిధాన్, జై పిడిఎ అంటూ అఖిలేశ్ నినదించారు. కాగా, ఉత్తర ప్రదేశ్‌లోని 9 అసెంబ్లీ స్థానాల్లో ఈనెల 20వ తేదీన ఉప ఎన్నికలు జరగనున్నాయి. అందులో 8 స్థానాల్లో ఎమ్మెల్యేలు లోక్‌సభకు ఎన్నిక కావడంతో రాజీనామా చేయగా, ఖాళీ అయ్యాయి. మరో స్థానంలో ఎస్‌పి శాసనసభ్యుడిపై వేటు పడడంతో ఉప ఎన్నికల అనివార్యమైంది.

# తమ ముందున్న అతిపెద్ద అంశం కులగణనే

### రిజర్వేషన్లపై 50 శాతం ఉన్న పరిమితిని ఎత్తివేస్తాం : రాహుల్



**ముంబయి :** దేశంలో రిజర్వేషన్లపై 50 శాతం ఉన్న పరిమితిని ఎత్తివేసి, కలగణన చేపడుతామని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ పునరుద్ఘాటించారు. కులగణనే తమ ముందున్న అతి పెద్ద అంశమని, దానిని తాము చేసి తీరుతామని స్పష్టం చేశారు. అదే తమ కేంద్ర బిందువు అని అన్నారు. సోమవారం రాహుల్‌గాంధీ ముంబయిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈనెల 20వ తేదీన జరిగే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రాహుల్‌గాంధీ భావజాలాల మధ్య యుద్ధంగా అభివర్ణించారు. అదే విధంగా కొంత బిలియనీర్లు, పేదల మధ్య పోరాటం అని చెప్పారు. మహారాష్ట్ర నుంచి ఫాక్స్‌కాన్, ఎయిర్‌బస్ సహా రూ. 7 లక్షల కోట్ల ప్రాజెక్టులను మహారాష్ట్ర నుంచి గుజరాత్‌కు తరలించుకుపోయారని రాహుల్ పేర్కొన్నారు. ఫలితంగా మహారాష్ట్ర ఎన్నో ఉద్యోగాలను కోల్పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ) మహారాష్ట్ర ప్రజల ఆకాంక్షలను పరిరక్షిస్తుందని చెప్పారు. ముంబయిలోని ధారావి పునరాభివృద్ధి పథకంలో యావత్ రాజకీయ యంత్రాంగం ఒక వ్యక్తికి సాయం చేయడంలో నిమగ్నమై ఉందన ఆరోపించారు. బిజెపి నినాదమైన 'ఏక్ హై తో సేఫ్ హై'పై స్పందిస్తూ మహారాష్ట్ర ప్రజల ఆకాంక్షలను గాలికి వదిలేసి పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ప్రయోజనాలకు కాషాయ పార్టీ అధిక ప్రాధాన్యతనిస్తోందని రాహుల్ మండిపడ్డారు. కాగా, మీడియా సమావేశానికి రాహుల్ గాంధీ మోదీ, అదానీ సంబంధించిన 'కలిసి ఉన్నంత వరకు సురక్షితంగానే ఉంటారు' అని రాసి ఉన్న ఒక పోస్టర్‌ను చాలా భద్రంగా తీసుకువచ్చారు. అదానీ గ్రూపుకు చెందిన ధారావి పునరాభివృద్ధి ప్రాజెక్టుకు చెందిన మరో పోస్టర్‌ను అతి జాగ్రత్తగా ప్రదర్శించారు. ఈ 'సేఫ్' ముంబయి సంపదకు ప్రతీక అని, బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం మద్దతుతో అదానీ దీనిని లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. 'ధారవి పునరాభివృద్ధి అన్యాయం. ఇది కేవలం ఒక వ్యక్తికి మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా చేస్తున్నారు. టెండర్లు ఎలా ఇస్తున్నారో మాకు నమ్మకం లేదు. భారతదేశానికి చెందిన ఓడరేవు లు, విమానాశ్రయాలు, సంపద అన్నీ ఒక్క వ్యక్తికి మాత్రమే ఇవ్వబడ్డాయి' అని ఆయన అన్నారు.

# ఢిల్లీ మంత్రివర్గంలోకి రఘువీందర్ షోకీన్



**న్యూఢిల్లీ :** వచ్చే ఏడాది మొదట్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తరుణంలో వేగంగా రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంలో రవాణా శాఖ మంత్రిగా ఉన్న కైలాష్ గెహ్లాట్ అనూహ్యంగా పార్టీకి రాజీనామా చేసి బిజెపిలో చేరడంతో అంతే వేగంగా ఆప్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. గెహ్లాట్ స్థానంలో జాట్ నేత, శాసనసభ్యుడు రఘువీందర్ షోకీన్ ను మంత్రివర్గంలోకి తీసుకుంది. సర్కార్ నిర్ణయంపై షోకీన్ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. 'ఆప్ ప్రభుత్వం అన్ని కులాలకు బాసటగా నిలుస్తోంది. బిజెపి ఎప్పుడూ జాట్‌లను విడగొడుతూనే వచ్చింది. హర్యానాలో జాట్‌లు, నాన్‌జాట్‌లు అంటూ విడగొట్టింది. ఆప్ అధినాయకత్వం మాత్రం పార్టీతో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదరించింది'' అని రఘువీందర్ షోకీన్ అన్నారు. ఢిల్లీ ఆరవ లెజిస్లేటివ్ అసెంబ్లీ సభ్యుడైన షోకోన్ ప్రస్తుతం నాంగ్లోయి జాట్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 1983–88 మధ్య ఆయన కురుక్షేత్ర ఎన్‌ఐటిలో ఇంజనీరింగ్ గ్యాడ్యుయేట్ చేశారు. కాలేజీ రోజుల నుంచే రాజకీయాల్లో చురుకుగా ఉంటూ వచ్చారు. ఢిల్లీ ఆప్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న కైలాష్ గెహ్లాట్ ఆదివారంనాడు ఆ పార్టీకి, మంత్రిపదవికి రాజీనామా చేశారు. ఇదే వేగంతో సోమవారంనాడు బిజెపిలో చేరారు. ఇచ్చిన హామీలను ఆప్ సర్కార్ నిలబెట్టుకోలేకపోవడం, కేంద్రంతో నిరంతర ఘర్షణాత్మక వైఖరి, యమునా నదీ ప్రక్షాళనపై ఇచ్చిన హామీకి తూట్లు పొడవడం వంటి పలు కారణాలు తన రాజీనామా నిర్ణయానికి దారి తీసినట్టు చెప్పారు. అనంతరం ఆయన బిజెపిలో చేరారు. మోదీ విజన్, సిద్ధాంతాలకు అనుగుణంగా ఢిల్లీ ప్రజలకు నిరంతర సేవ చేస్తానని తెలిపారు.

# 'తెలంగాణ సెక్రటేరియట్ ఆఫీసర్స్' నూతన కమిటీ ఎన్నిక

### అధ్యక్షునిగా సురేశ్ కుమార్...
### ప్రధాన కార్యదర్శిగా లింగమూర్తి ..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సెక్రటేరియట్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టిజిఎస్‌ఒఎ) అధ్యక్షునిగా డాక్టర్ జి.సురేశ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పి.లింగమూర్తి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన ఈ కమిటీ 2024–27 వరకు కొనసాగనున్నట్టు ఎన్నికల అధికారి ఎన్. శంకర్ ప్రకటించారు. ఈ మేరకు ఉద్యోగులు టిజిఎస్‌ఒఎ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. టిజిఎస్‌ఒఎ కమిటీ: అధ్యక్షుడు జి.సురేష్‌కుమార్,అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా డి.అంజన్ కుమార్, ఎం.రామ్‌సింగ్, మహిళా ఉపాధ్యక్షురాలు డి.లలిత కుమారి, ప్రధాన కార్యదర్శి పి.లింగమూర్తి, అదనపు కార్యదర్శులుగా బి.స్వామి, కె.సత్య నారాయణ, సంయుక్త కార్యదర్శులుగా రమాదేవి, పి.శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి(మహిళ) డి.మనోహరమ్మ, కార్యనిర్వహక కార్యదర్శి కె.మల్లిఖార్జునరావు, ప్రచార కార్యదర్శిగా జె.శోభారాణి, కోశాధికారి పి.శ్యాంసుందర్, కార్యవర్గ సభ్యులు ఎ..శ్రీనివాస్ , సిహెచ్. మధుకిరణ్, సిహెచ్.శ్రీనివాసులు, కె.లత,బి.సైదా ఎన్నికయ్యారు.

# మూడు గంటల్లోపే సర్వదర్శనం

### శ్రీవాణి ట్రస్టు రద్దు చేస్తూ నిర్ణయం
### టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు వివరాల వెల్లడి



తిరుమల : శ్రీవాణి ట్రస్టు రద్దు చేస్తూ, సర్వదర్శనానికి వచ్చే భక్తులకు రెండు నుంచి మూడు గంటల్లోగా దర్శన భాగ్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని టీటీడీ నిర్ణయించింది. అక్కడ పని చేస్తున్న అన్యమత ఉద్యోగులను ప్రభుత్వానికి అప్పగించనుంది. ఈ మేరకు ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన అన్నమయ్య భవన్‌లో సోమవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ధర్మకర్తల మండలి ముఖ్య నిర్ణయాలను ఛైర్మన్ మీడియాకు వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజన్స్ ఉపయోగించి క్యూ లైన్లలో భక్తులు ఎక్కువసేపు వేచి ఉండకుండా రెండు మూడు గంటల్లోనే దర్శనమయ్యేలా ఒక నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని, దీని రిపోర్టు ఆధారంగా భక్తులకు త్వరితగతిన దర్శనం చేయించాలని నిర్ణయం. టీటీడీలో పని చేస్తున్న అన్యమత ఉద్యోగులను బయటకు పంపేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలనే విషయమై ప్రభుత్వానికి నివేదించాలని, తిరుమలలో డంపింగ్ యార్డులో చెత్తను మూడు లేదా నాలుగు నెలల్లో పూర్తిగా తొలగించాలని, తిరుపతిలోని శ్రీనివాస సేతును గరుడ వారధిగా పేరు మార్చడాని, అలిపిరిలో టూరిజం కార్పోరేషన్ ద్వారా దేవలోక్ కు కేటాయించిన 20 ఎకరాల భూమిని వెనక్కి తీసుకుని టీటీడీకి ఇచ్చే విధంగా ప్రభుత్వాన్ని కోరాలని, తిరుమలలో రాజకీయాలు మాట్లాడే వారిని, ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని, స్థానికులకు ప్రతి నెలా మొదటి మంగళవారం శ్రీవారి దర్శనం కల్పించాలని, శ్రీవాణి ట్రస్టు పేరును మార్చేందుకు సాధ్యాసాధ్యాల పరిశీలన, ప్రైవేట్ బ్యాంకుల్లో డిపాజిట్లను వెనక్కు తీసుకుని పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో డిపాజిట్ చేసే అంశంపై వచ్చే సమావేశంలో చర్చ, నిత్య అన్న ప్రసాద భవనం మెనూలో అదనంగా మరొక పదార్థాన్ని చేర్చేలా, వివిధ రాష్ట్రాలకు చెందిన టూరిజం కార్పోరేషన్లు, ఏపీఎస్ ఆర్టీసీ, టీఎస్ ఆర్టీసీలకు టీటీడీ కేటాయించిన శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300) టికెట్లకు సంబంధించి అవకతవకలు జరిగాయన్న ఫిర్యాదులు నేపథ్యంలో వాటిని పూర్తిగా పరిశీలించిన అనంతరం సదరు సంస్థలకు కోటాను పూర్తిగా రద్దు చేయాలని, తిరుమలలో గోగర్భం డ్యామ్ వద్ద విశాఖ శ్రీశారద పీఠానికి చెందిన మఠం నిర్మాణంలో అవకతవకలు, ఆక్రమణలు జరిగినట్లు టీటీడీ అధికారుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా భవనం లీజు రద్దు చేయాలని, బ్రహ్మోత్సవాలలో విశేష సేవలు అందించిన ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానాన్ని 10 శాతం పెంచాలని నిర్ణయించినట్టు వివరించారు. శ్రీవారి ఆలయంలో లీకేజీల నివారణకు, అన్న ప్రసాద కేంద్రం ఆధునీకరణకు టీవీఎస్ సంస్థతో ఎంఓయూ కుదుర్చుకుంటామన్నారు. ఈ పనులన్నీ ఆ సంస్థ ఉచితంగా చేస్తుందని వెల్లడించారు.

# రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని కేంద్ర బొగ్గు గనులు శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మియాపూర్ అంజయ్యనగర్ కాలనీకి చెందిన బాలిక ఈ నెల 10వ తేదీన సోమవారంతుక్కుగూడలో శవమై కనిపించడానికి తప్పిపోయిన పోలీసులు పట్టించుకోకపోవడమే కారణమన్నారు. తల్లిదండ్రులు మిస్సింగ్ కంప్లయింట్ ఇచ్చి వారం రోజులు దాటినా.. పోలీసులు కనీసం పట్టించుకోలేదు.అత్యాచారం చేసి ఓ ప్లాస్టిక్ పరిశ్రమలో బాలికను పడేసి పోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత మంది పోలీసులు, సిసి కెమెరాలు, కమాండ్ కంట్రోల్ రూమ్ ఒక బాలికను కాపాడలేక పోయ్యాయని విమర్శించారు.

బిజెపి ఎంపిల అరెస్టును ఖండించిన కిషన్‌రెడ్డి

బాధిత రైతులను పరామర్శించేందుకు లగిచర్ల వెళ్తున్న బిజెపి ఎంపిలు డీకే అరుణ, ఈటల రాజేందర్, బిజెపి శాసనసభా పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డిని అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. పేదల పక్షాన ప్రజా ప్రతినిధులు ఉండాల్సిన అవసరం ఉందని, వారిని అడ్డుకోవడం ప్రభుత్వం పిరికితనానికి, పూర్తి అధికార దుర్వినియోగానికి నిదర్శనమని అగ్రహారం వ్యక్తం చేశారు. . రాష్ట్ర ప్రభుత్వం పేదల పట్ల అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తోంది.ఇందిరమ్మ రాజ్యమంటే.. పేద గిరిజనుల భూములను అక్రమంగా గుంజుకోవడం, ఇందిరమ్మ రాజ్యమంటేఆడబిడ్డలపై దాడి చేయడమేనా అని అన్నారు. ప్రభుత్వం సమాధానం చెప్పాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# చెరువుల పరిరక్షణకు కలిసి పనిచేయాలి: హైడ్రా, టిజిపిసిబి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చెరువుల సంరక్షణపై హైడ్రా, కాలుష్య నియంత్రణమండలి కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. ఈ మేరకు సోమవారం కాలుష్యనియంత్రణ మండలి కార్యాలయంలో టిజిపిసిబి సభ్య కార్యదర్శి జి.రవి, హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ సమావేశమయ్యారు. హైడ్రా చేపట్టిన చర్యలను రంగనాథ్ వివరించారు. పర్యావరణాన్ని కా పాడి, భవిష్యత్ తరాలకు మెరుగైన జీవనాన్ని అందించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం మేరకు ఇరు విభాగాలు సమన్వయంతో కలసి పని చేయాలని నిర్ణయించా యి. ఈ సందర్భంగా టిజిపిసిబి సభ్య కార్యదర్శి రవి మాట్లాడుతూ చెరువులలోకి పారిశ్రామిక వ్యర్థాలు, మురుగునీటి ప్రవాహాలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. చెరువులు, నీటి వనరుల పునరుద్ధరించాలన్నారు. నిర్మాణ వ్యర్థాలను డంపింగ్ ఆపడం ద్వారా చెరువుల పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. చెరువులలో నీటి నాణ్యతలను పరిరక్షించడంలో హైడ్రాకు టిజిపిసిబి సహకరిస్తుందన్నారు. రియల్ టైమ్ నిరంతర నీటి నాణ్యత పర్యవేక్షణను ఉపయోగించి, నీటి నాణ్యతను మెరుగుపరచడం, జరిమానాలు విధించడం ద్వారా అక్రమ డంపింగ్‌ను ఆపడం, అక్రమ డంపింగ్‌కు ఉపయోగించే వాహనాలను సీజ్ చేయడం వంటివి హైడ్రా, టిజిపిసిబి అధికారులతో కూడిన బృందాలు సంయుక్తంగా చేపట్టాలన్నారు. తనిఖీలు, పర్యావరణ ప్రమాణాలు పాటించకుంటే జరిమానాలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని రంగనాథ్ అన్నారు. విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు, పర్యావరణ స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంఘాలను ఉమ్మడి వేదికపైకి వచ్చేలా ప్రోత్సహించడం ద్వారా గుర్తించిన అన్ని చెరువులు, నీటి వనరుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. కాలుష్య నియంత్రణ నిబంధనలు, పర్యావరణ చట్టాలను ఉల్లంఘించే వారిపై గట్టి నిరోధక చర్యలు తీ సుకుంటామన్నారు. పెద్ద రియల్టర్‌లపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించే గేటెడ్ కమ్యూనిటీలు, పరిశ్రమలపై స్పెషల్ డ్రైవ్ ప్రారంభించనున్నామన్నారు. ఈ సమావేశంలో హైడ్రా విభాగం, టిజిపిసిబి అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 65 .02 శాతం సర్వే పూర్తి

### ములుగు జిల్లాలో 95శాతం సర్వే పూర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్యా,ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే మరింత ఊపందుకుంది. సోమవారం నాటికి 65.02 శాతం పూర్తి అయినట్లు అధికారులు ప్రకటించారు.మొత్తం 1,16,14,349 నివాసాలకు సంబంధించ సర్వే చేయాల్సి ఉండ ఇప్పటి వరకు 75,75,647 నివాసాలలో (65.02 శాతం) సర్వే పూర్తైందని తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా ములుగు జిల్లా 95.3 శాతం సర్వే పూర్తి చేశారు. 97,552 నివాసాలకు గాను 92,928 ఇళ్ల సర్వే పూర్తి చేసి మొదటి స్థానంలో ఉందని అధికారులు వెల్లడించారు. నల్గొండ జిల్లా 89.1 శాతం 5,04,542 నివాసాలకు గాను 4,49,434 ఇళ్ల సర్వే పూర్తి చేసుకుని రెండో స్థానం, జనగామ జిల్లా1,59,452 ఇళ్లకు గాను 1,37,069 నివాసాలు(86 శాతం)తో మూడో స్థానంలో ఉందని తెలిపారు. జిహెచ్ఎంసి. పరిధిలో మొత్తం 25,05,517 నివాసాల గాను 11,10,883 (44.3 శాతం) ఇళ్ల సర్వే పూర్తి అయినట్లు అధికారులు ప్రకటించారు.

# స్వేచ్ఛను కాలరాసే వీడియోలను తొలగించండి

### యూట్యూబ్‌కు హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్:**వ్యక్కుల హక్కులకు భంగం వాటిల్లే వీడియోలను తొలగించాలని యూట్యూబ్ సంస్థకు హైకోర్టు ఆదేశించింది. సోషల్ మీడియాలో వ్యక్తుల హక్కులకు భంగం కలిగించే వీడియోలు ఉండటం రాజ్యాంగ ఉల్లంఘనని చెప్పింది. కోకాపేటకు చెందిన మొల్ల శివకుమార్ మొల్ల శివయ్య ఆయన భార్య, కుమా రుడిపై 'మీమాంస విక్టిమ్స్' యూట్యూ బ్ ఛానల్‌లో ఉన్న వీడియోలను తొల గించాలంది.తమ వ్యక్తిగత ప్రతిష్ట, పరు వులను దెబ్బ తీసేలా కథనాలను 'మీమాంస యూట్యూబ్' ఛానల్లో ఉన్నాయ ని వాటిని తొలగించాలన్న వినతి ని యూట్యూబ్ పిట్టించుకోలేదంటూ మొల్ల శివకుమార్ మొల్ల శివయ్య కుటుంబ సభ్యులు దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ ఎన్..వి. శ్రవణ్‌కుమార్ ఇటీవల విచారించారు. న్యాయవాది వాదిస్తూ, పిటిషనర్ ఆస్తుల క్రయ, విక్ర యాలు, వ్యాపారాలకు చెందిన సలహాలు పలు వురికి ఇస్తారన్నారు. బాచుప ల్లికి చెందిన ఎ.మురళీకష్ణ దంపతులు పిటిషనర్ సలహాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేశారన్నారు. వ్యాపారంలో అను కున్న లాభాలు రాలేదన్న కారణంగా పిటిషనర్లపై కేసులు పెట్టారన్నారు. దీని పై సివిల్, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉండగా మురళీకష్ణ దంపతులు 'మీమాంస విక్టిమ్స్' పేరుతో యూట్యూబ్ ఛానల్ ఏర్పాటు చేసి పిటిషనర్ల ఫొటోలతో సహా వారి ప్రతిష్ఠను దెబ్బతీసేలా వీడియోలు అప్‌లోడ్ చేశారని చెప్పారు. వీడియోలను తొలగిం చాలని యూట్యూబ్‌కు లేఖ రాస్తే ఫలితం లేదన్నారు. వాదనల తర్వాత రికార్డులను హైకోర్టు పరిశీలించింది. కింది కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉండగా వారి వ్యక్తిగత ప్రతిష్ఠ దెబ్బతీసేలా వీడియోలను పెట్టరాదని తేల్చి చెప్పింది.

## క్రీడ

### ఆసీస్‌తో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ

# విరాట్ కోహ్లీకి ఆఖరి సిరీస్



పేలవ ఫామ్‌తో బాధపడుతున్న టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి దిగ్గజ కెప్టెన్, బిసిసిఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ అండగా నిలిచాడు. తనకు అచ్చొచ్చిన ఆసీస్ గడ్డపై విరాట్ కోహ్లీ చెలరేగుతాడని ఆశాభావం వ్యక్తం చేశాడు. న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో విరాట్ కోహ్లీ విఫలమవ్వడంపై ఆందోళన వ్యక్తం చేయాల్సిన పనిలేదన్నాడు. బ్యాటింగ్‌కు పిచ్‌లు అనుకూలంగా లేకపోవడంతోనే కోహ్లీ రాణించలేకపోయాడని చెప్పాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీనే ఆసీస్ గడ్డపై విరాట్ కోహ్లీకి చివరి సిరీస్ అయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడ్డాడు. ఈ ఏడాది కోహ్లీ 12 టెస్ట్ ఇన్నింగ్స్‌ల్లో 250 పరుగులు మాత్రమే చేశాడు. అతని పేలవ ఫామ్ టీమిండియా పరాజయాలకు కారణమవుతోంది. దాంతో అతనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఆసీస్ గడ్డపై విరాట్ కోహ్లీకి మెరుగైన రికార్డ్ ఉండటం కలిసొచ్చే అంశం. ఆసీస్ గడ్డపై 13 టెస్ట్‌లు ఆడిన కోహ్లీ 54.08 సగటుతో 1352 పరుగులు చేశాడు. ఇందులో 6 సెంచరీలు ఉన్నాయి. ఈ క్రమంలోనే గంగూలీ.. ఓ ఛానల్‌తో మాట్లాడుతూ కోహ్లీ బ్యాటింగ్‌పై ధీమా వ్యక్తం చేశాడు. 'విరాట్ కోహ్లీ ఓ ఛాంపియన్ బ్యాటర్. ఈ విషయంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. గతంలో ఆసీస్ గడ్డపై కోహ్లీ దుమ్మురేపాడు. 2014 పర్యటనలో నాలుగు శతకాలు.. 2018లో ఒక శతకం బాదాడు. తాజా సిరీస్‌లోనూ సత్తా చాటుతాడు. ఆస్ట్రేలియా గడ్డపై కోహ్లీకి ఇదే చివరి టెస్ట్ సిరీస్ కానుంది. కాబట్టి అతనికి ఈ సిరీస్ చాలా కీలకమైనది. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో కోహ్లీ వైఫల్యంపై ఆందోళన పడాల్సిన అవసరం లేదు. బ్యాటింగ్‌కు ఆ పిచ్‌లు ప్రతికూలంగా ఉన్నాయి. బ్యాటింగ్‌కు సహకరించలేదు. కానీ ఆస్ట్రేలియాలో పిచ్‌లు అలా ఉండవు. అక్కడి పరిస్థితులను కోహ్లీ బాగా ఆస్వాదిస్తాడు. అతను మెరుగైన ప్రదర్శన చేస్తాడనుకుంటున్నా.'అని గంగూలీ చెప్పుకొచ్చాడు. యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌కు కూడా తుది జట్టులో చోటివ్వాలని సూచించాడు.

# మార్కస్ స్టోయినీస్ ఊచకోత.. పాకిస్థాన్ క్లీన్ స్వీప్!



ఆస్ట్రేలియా పర్యటనను పాకిస్థాన్ ఘోర పరాజయంతో ముగించింది. మూడు వన్డేల సిరీస్‌ను 2–1తో గెలుచుకున్న పాకిస్థాన్.. మూడు టీ20ల సిరీస్‌లో మాత్రం 3–0తో క్లీన్ స్వీప్ అయ్యింది. సోమవారం ముగిసిన మూడో టీ20లో ఆస్ట్రేలియా 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బౌలర్ల అసాధారణ ప్రదర్శనతో పాటు మార్కస్ స్టోయినీస్(27 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లతో 61 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆసీస్ గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 18.1 ఓవర్లలో 117 పరుగులకు కుప్పకూలింది. బాబర్ ఆజామ్(28 బంతుల్లో 4 ఫోర్లతో 41) ఒక్కడే రాణించగా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో ఆరోన్ హార్డీ(3/21) మూడు వికెట్లు తీయగా.. ఆడమ్ జంపా(2/11), స్పెన్సర్ జాన్సన్(2/24) రెండేసి వికెట్లు తీసారు. గ్జేవియర్ బార్ట్‌లెట్, నాథన్ ఎల్లిస్ తలో వికెట్ తీసారు. అనంతరం ఆస్ట్రేలియా 11.2 ఓవర్లలో 3 వికెట్లకు 118 పరుగులు చేసి 52 బంతులు మిగిలి ఉండగానే సునాయస విజయాన్నందుకుంది. మార్కస్ స్టోయినీస్‌తో పాటు జోష్ ఇంగ్లీస్(24 బంతుల్లో 4 ఫోర్లతో 27) రాణించారు. పాకిస్థాన్ బౌలర్లలో షాహీన్ షా అఫ్రిది, జహందాద్ ఖాన్, అబ్బాస్ అఫ్రిది తలో వికెట్ తీసారు.



# ఆసీస్‌కు బిగ్ షాక్..

భారత్‌తో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి ముందు ఆస్ట్రేలియా కీలక వ్యక్తి సేవలను కోల్పోనుంది. ఆ జట్టు అసిస్టెంట్ కోచ్ డానియల్ వెటోరి నవంబర్ 22 నుంచి పెర్త్ వేదికగా జరిగే తొలి టెస్ట్‌కు దూరంగా ఉండనున్నాడు. ఐపిఎల్ 2025 సీజన్ కోసం డానియల్ వెటోరి ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఐపిఎల్‌లో డానియల్ వెటోరీ సన్‌రైజర్స్ హైదరా బాద్‌కు హెడ్ కోచ్‌గా వ్యవ హరిస్తున్నాడు. ఐపి ఎల్ 2025 మెగా వేలంలో పాల్గొ నేందుకు డానియల్ వెటోరీ ఈ నిర్ణయం తీసుకున్నాడు. తొలి టెస్ట్ జరుగు తుండగానే.. నవంబర్ 24, 25 తేదీల్లో సౌదీ అరేబి యాలోని జడ్డా వేదికగా ఐపీఎల్ మెగా వేలం జరగనుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున డానియల్ వెటోరీ మెగా వేలంలో పాల్గొని ఆటగాళ్లను కొనుగోలు చేయనున్నాడు. ఇప్పటికే ఈ విషయమై డానియల్ వెటోరీ క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి అనుమతి తీసుకున్నాడు. ఈ విషయంలో డానియల్ వెటోరీకి మద్దతుగా ఉంటామని క్రికెట్ ఆస్ట్రేలియా ప్రతి నిధి ఒకరు మీడియాకు తెలిపారు. 'సన్‌రైజర్స్ హైద రాబాద్ హెడ్ కోచ్ అయిన డానియల్ వెటోరికి మేం అండగా ఉంటా. ఐపీఎల్ వేలంలో పాల్గొనేందుకు డాని యల్ వెటోరికి అనుమతిచ్చాం. పెర్త్ టెస్ట్‌కు ముం దు అతను పూర్తి ప్రిపరేషన్‌ను ముగించుకోనున్నా డు. ఐపీ ఎల్ మెగా వేలం ముగిసిన తర్వాత మళ్లీ ఆసీస్ జట్టుతో కలవనున్నాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ పూర్త య్యే వరకు అందుబాటులో ఉంటాడు.'అని సదరు అధికారి తెలిపాడు.




# ఫుల్ ఫన్ తో 'సంక్రాంతికి వస్తున్నాం'

విక్టరీ వెంకటేష్ ప్రస్తుతం కమర్షియల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'సంక్రాంతికి వస్తున్నాం అనే సినిమా చేస్తున్న సంగ తి తెలిసిందే. ప్రస్తుతం చివరి షెడ్యూల్ షూటింగ్ అరకులో జరుపుకుంటోంది. ఇప్పటికే, ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా శరవేగంగా జరుగుతుంది. ఈ క్రమంలోనే ఈ షెడ్యూల్ పూర్తి అవ్వగానే వెంకటేష్ – ఐశ్వర్య రాజేష్ తమ డబ్బింగ్ పార్ట్ ను పూర్తి చేస్తారట. ఫ్యామిలీ డ్రామాగా వస్తున్న ఈ సినిమాలో ఫుల్ ఫన్ ఎలిమెంట్స్ ఉంటాయట. దర్శకుడు అనిల్ రావిపూడి సెకండ్ హాఫ్‌ను ఫుల్ ఎంటర్టైన్మెంట్ గా ప్లాన్ చేశాడని.. ముఖ్యంగా వెంకీ – హీరోయిన్స్ మధ్యలో వచ్చే కన్ ఫ్యూజ్ డ్రామా ఫుల్ ఫన్ తో సాగుతుందని తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ఉపేంద్ర లిమాయే, రాజేంద్ర ప్రసాద్, సాయి కుమార్, నరేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# విజయ్ సినిమాలో రష్మిక ?

శ్యామ్ సింగ రాయ్ ఫేమ్ 'రాహుల్ సంకృత్యాన్' దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా ఓ సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. అయితే, తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఇంట్రెస్టింగ్ అప్ డేట్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్ ఉంది. ఈ సాంగ్ ను రష్మిక మందన్నా చేత చేయిస్తే బాగుంటుందని తాజాగా మేకర్స్ ఫీల్ అవుతున్నారు. మరి రష్మిక మందన్నా ఈ సాంగ్ చేయడానికి ఒప్పుకుంటుందో లేదో చూడాలి. విజయ్ దేవరకొండతో రష్మిక మందన్నాకి మంచి స్నేహం ఉంది. కాబట్టి, స్టార్ హీరోయిన్ రష్మిక మందన్నా స్పెషల్ సాంగ్ చేస్తోందా ? లేదా ? అనేది చూడాలి. కాగా ఈ మూవీ షూటింగ్ 2025 జనవరి నుంచి స్టార్ట్ అయ్యే అవకాశం ఉంది. 'రాహుల్ సంకృత్యాన్' దర్శకత్వంలో న్యాచులర్ స్టార్ నాని హీరోగా వచ్చిన శ్యామ్ సింగ రాయ్ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. దీంతో, విజయ్ దేవరకొండ సినిమా పై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

## రీల్




# 'ఎమర్జెన్సీ' రిలీజ్ డేట్ ఫిక్స్ !

బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ 'కంగనా రనౌత్' స్వీయ దర్శకత్వంలో 'ఎమర్జెన్సీ' అనే సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే, వివాదాల్లో చిక్కుకున్న ఈ చిత్రం ఎట్టకేలకు విడుదలకు సిద్ధమైంది. జనవరి 17న ఈ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ఆమె ప్రకటించారు. దేశ అత్యంత శక్తిమంతమైన మహిళ గాథ, భారత భవితవ్యాన్ని మార్చిన సందర్భం 'ఎమర్జెన్సీ' విడుదలకు సిద్ధమైనట్లు తెలిపింది. ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలపై సిక్కులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో సెన్సార్ కట్స్ అనంతరం చిత్రం రిలీజ్ అవుతుంది. కాగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీ ఇతివృత్తం ఆధారంగా ఈ మూవీని తీసుకువస్తున్నారు. ఇందిర పాత్రలో కంగనా కనిపించబోతుంది. అలాగే, మరో కీలక పాత్రలో అనుపమ్ ఖేర్ నటిస్తున్నారు. అన్నట్టు బీజేపీ పార్టీ నుంచి కంగనా భాజపా ఎంపీగా గెలిచింది. ఈ క్రమంలో ఆమె ఇందిరా గాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీ ఇతివృత్తం ఆధారంగా సినిమా చేస్తుండటం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఒకవేళ సినిమాలో ఇందిరా గాంధీని అవమానించే విధంగా సన్నివేశాలు ఉంటే తగిన బుద్ధి చెబుతాం అంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోస్ట్ లు పెడుతున్నారు.

# అధిక ధాన్యం సేకరణ

(మూడవ పేజీ తరువాయి)

ఉందుకు సంబంధించి ఇప్పటికే రూ.1560.73 కోట్లను రైతుల ఖాతాలో జమా చేయడం జరిందన్నారు. ఇందులో 10.11 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డురకం, 3.02 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలు ఉన్నాయని వెల్లడించారు. ధాన్యం ఎంఎస్‌పి ధర మేరకు పౌరసరఫరాల శాఖ నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులను జమా చేస్తుండగా, సన్న వడ్లకు సంబంధించినబోనసును రాష్ట్ర ప్రభుత్వం ట్రెజరీ ద్వారా ఇ ప్పటీ వరకు రూ.9.21 కోట్లను చెల్లించిందని తెలిపా రు. గత ఏడాది ఇదే సమయానికి 12.81 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించగా, రైతులకు రూ.1122.47కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయన్నారు.

**ధాన్యం కొనుగోలుకు 8066 కేంద్రాలు ఏర్పాటు :** ధాన్యం సేకరణకు సంబంధించి ఎప్పుడు లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 8066 కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇందులో ఇప్పటికే 7532 కేంద్రాలను ప్రారంభించినట్లు పౌరసరఫరా శాఖ కమిషనర్ డి.ఎస్ చౌహన్ తెలిపారు. 8066 కేంద్రాల్లో సన్నరకం ధాన్యం సేకరణకు ప్రత్యేకంగా 4 వేల కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ ఏడాది కొనుగోలు కేంద్రాలకుమొత్తం 70 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం రావచ్చన్న అంచనా ఉందని, ఇందులో 35 లక్షల మెట్రిక్ టన్నులు సన్న, మరో 35 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకం ఉండనున్నాయని తెలిపారు. కోతలు అక్టోబర్ నెల నుంచే ప్రారంభమైన ఇప్పుడిప్పుడే అవి ఊపందుకోవడంతో ఈ సీజన్2025 జనవరిలో కూడ కొనసాగనుండడంతో జనవరి 31 వరకు కొనుగోలు సెంటర్లు కొనసాగుతాయని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం సగటున రోజుకు 1.25 నుండి 1.50 లక్షల మెట్రిక్ టన్నులు లను కొనుగోలు చేస్తోందని ఇది మరింత పెరగుతాయని చెప్పారు.

**1.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి :** ఈ సీజన్‌లో రాష్ట్రంలో ప్రపథమంగా రికార్డు స్థాయిలో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పతి అయిందని కమిషనర్ వెల్లడించారు. ప్రభుత్వం ఈఖరీఫ్ సీజన్‌లో 1.46 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 1.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేయగా అందుకు అనుగుణంగానే 1.50లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం ఉత్పత్తి అయిందని, ఇది దేశంలో ప్రప్రథమమన్నారు.

# నిర్మాణంలో సవాళ్లెన్నో

(మూడవ పేజీ తరువాయి)

ప్రైవేట్ సంస్థలు వెనుకాడుతున్నాయన్నారు. మొదటి దశ మెట్రో కారణంగా ఎల్ అండ్ టికి రూ.6 వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. నిర్వహణ కారణంగా ఏడాదికి రూ.1,300 కోట్ల నష్టం వస్తోందన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలే మెట్రోను నిర్వహిస్తున్నాయని చెప్పారు. బ్యాంకులు కూడా మెట్రోకు అప్పులు ఇచ్చేందుకు అంగీకరించడం లేదన్నారు. అందుకే కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో మెట్రో రెండో దశ నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రికి సూచించినట్లు తెలిపారు. మెట్రో రెండో దశ నిర్మాణం రూ.24,269 కోట్ల ప్రాజెక్టు అని అంచనా వేశారు. ఇందులో 48 శాతం నిధులు జైకా ద్వారా సమకూరుతున్నాయన్నారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపాక కేంద్రానికి పంపించామని తెలిపారు. కేంద్రం నుంచి అనుమతులు రాగానే రెండో దశ పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రజల సహకారం ఉంటే ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఆడిట్, అకౌంట్స్ శాఖ పాత్ర చాలా కీలకం.. భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆడిట్, అకౌంట్స్ శాఖ పాత్ర చాలా కీలకమని ఎన్‌వి ఎస్ రెడ్డి తెలిపారు. ప్రజాధనం పూర్తి సద్వినియోగం అవ్వడంతో పాటు వివిధ ప్రాజెక్టులకు ప్రభుత్వం ఖర్చు చేస్తున్న వ్యయాన్ని తగిన విధంగా పరిశీలించే లక్ష్యంతో పని చేస్తున్న సిఏజి ఈ వారోత్సవాల ద్వారా ప్రజలకు అవగాహన కలిపిస్తుందన్నారు. ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్న దశలో అనేక సవాళ్లు ఎదురవుతాయని, వాటిని సమర్థంగా ఎదుర్కొనే యంత్రాంగాన్ని అన్ని విభాగాల్లో సన్నద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో రైల్ ప్రస్థానంలో ఎదురైన అనేక సమస్యలను సవాళ్లను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ కెపాసిటీ బిల్డింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ సి.శైలజ, తెలంగాణ ప్రిన్సిపాల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిట్, డైరెక్టర్ జనరల్ అఫ్ ఆడిట్ (సెంట్రల్) హేమ ముని వెంకటప్ప, అకౌంటెంట్ జనరల్ ఆడిట్ పి. మాధవి, ప్రిన్సిపాల్ డైరెక్టర్ అఫ్ కమర్షియల్ ఆడిట్ వి.ఎం.వి. నావల్ కిషోర్ పాల్గొన్నారు.

# మా హామీలు చూడాలంటే హైదరాబాద్‌కు రండి

## ప్రధానికి, బిజెపి నేతలకు సిఎం రేవంత్ రెడ్డి సవాల్



**పుణె :** మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం ముగియకముందే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు వెళ్తారంటే, ఆయన బిజెపి ఓటమిని అంగీకరించినట్టేనని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. తమ ఎన్నికల గ్యారంటీలను అమలు చేయలేదని దమ్ముంటే బిజెపి నిరూపించాలని ఆయన సవాలు విసిరారు. పుణెలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ హామీల అమలును పరిశీలించేందుకు ఎవరైనా మంత్రిని లేదా కమిటీని పంపాలని కేంద్రం భావిస్తే తాను వారి కోసం తెలంగాణ నుంచి విమానాన్ని పంపుతానని పదకొండేళ్ల పాలన తర్వాత కూడా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వానికి, మహారాష్ట్రలోని మహాయుతి ప్రభుత్వానికి చెప్పుకోవడానికి ఒక్క విజయగాథ లేదని ఎద్దేవా చేశారు. ప్రతిసారి బాంబు పేలుళ్లు.. ఇతర కొత్త కొత్త అంశాలను ప్రధానమంత్రి మోదీ.. బీజేపీ ఎన్నికల ముందుకు తెరపైకి తెస్తున్నాయి.. చెప్పుకోవడానికి ఏం లేకనే వాటిపై ఆధారపడుతున్నారని అన్నారు. దేశంలోనే అత్యధికంగా మహారాష్ట్రలోనే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, దీనిపై ప్రధానమంత్రి ఎందుకు మాట్లాడరు అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలంటిన్నిటిలో విఫలమైన నరేంద్ర మోదీ.. తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

**'తెలంగాణ ముఖ్యమంత్రి హోదాలో నేను సవాల్ విసురుతున్నా....**

కేంద్ర మంత్రి లేదా కేంద్ర ఉన్నతాధికారి ఆధ్వర్యంలో ఒక కమిటీ వేసి తెలంగాణకు పంపండి.. వాళ్లకు వివరాలు ఇస్తాం.. అవసరమైతే వారి విమాన ఖర్చులు మేమే భరిస్తాం..' అని రేవంత్ రెడ్డి అన్నారు. తాము 50 రోజుల్లో రైతుల రుణ ఖాతాల్లో రూ.18 వేల కోట్లు వేసి రుణ మాఫీ చేశామని, ప్రతి రైతు ఖాతా వివరాలు అందిస్తామన్నారు. తెలంగాణలో యువతకు 50 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, ఎల్బీ నగర్ స్టేడియంలో స్వయంగా నేను నియామక పత్రాలు అందించానని తెలిపారు. మా గ్యారంటీలు కచ్చితమైన గ్యారంటీలు.. మోదీ గ్యారంటీలు కాదు.. భారతీయ జుటా పార్టీ గ్యారంటీలు కాదని స్పష్టం చేశారు. మోదీ.. బీజేపీ నాయకులు రేపు హైదరాబాద్ వస్తే సచివాలయంలో కూర్చోబెట్టి నేను చెప్పిన ప్రతి అంశం వివరాలు అందజేస్తా...అందులో ఏమైనా తప్పు ఉంటే క్షమాపణలు చెబుతానని అన్నారు.

# సంక్షోభంలో మణిపూర్ ప్రభుత్వం

(మూడవ పేజీ తరువాయి)

శక్తిమంతమైన, ప్రభావశీల విభాగమైన ''కోకోమి'' (కో–ఆర్డినేషన్ కమిటీ ఆన్ మణిపూర్ ఇంటిగ్రిటీ) సమన్వయ కమిటీకి విజ్ఞప్తి చేస్తూ ముఖ్యమంత్రి కార్యదర్శి నింగ్‌థౌజామ్ జెఫ్రీ ఒక లేఖ రాశారు. ఇంఫాల్ పశ్చిమజిల్లాలోని లాంఫెల్ ప్రాంతంలో ''కోకోమి'' సభ్యులు కూడా సోమవారంనాడు ఆందోళనలో పాల్గొని ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలువేసి ఏ పనులూ జరగకుండా అడ్డుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఒక బహిరంగ లేఖ రాసి ''కోకోమి''కి పైన పేర్కొన్నవిధంగా విజ్ఞప్తి చేసింది. మణిపూర్‌లో హింసాత్మక చర్యలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం నిస్సహాయంగా ఉండిపోయి అసమర్థత ప్రదర్శిస్తోందని, ప్రజల ప్రాణాలను కాపాడలేకపోతోందనీ, అనుమానిత కుకి–హ్మార్ ఉగ్రవాదుల చేతుల్లో ప్రజల ఆస్తులు ధ్వంసం అవుతున్నాయనీ, ప్రజలు హత్యలకు గురవుతున్నారనీ, అందువల్ల తాము ఆందోళన చేపట్టామని, ప్రభుత్వ కార్యాలయాలు ఇక పనిచేయడం మానేస్తాయని ''కోకోమి'' డబుల్ ఇంజిన్ సర్కారుకు హెచ్చరిక చేయడంతో ముఖ్యమంత్రి కార్యదర్శి విన్నపాలు చేస్తూ లేఖరాశారు. ఇదిలా ఉండగా, మణిపూర్ జిరిబమ్ జిల్లాలో భద్రతా దళాలకు, మూకలకు మధ్య జరిగిన ఘర్షణ సందర్భంగా కాల్పుల్లో ఒక నిరసన ప్రదర్శకుడు మరణించాడని పోలీసులు చెప్పారు. భద్రతాదళాలే కాల్పులు జరిపాయని, వారి కాల్పుల కారణంగానే నిరసన ప్రదర్శకుడు మరణించాడని ప్రత్యక్షసాక్ష్యులు చెబుతున్నారు. ఉగ్రవాదులు ఒక మహిళను, పిల్లలను కిడ్నాప్ చేసి తీసుకుపోయారని ఆందోళన చేస్తున్న ప్రదర్శకులు ఆదివారం రాత్రి పొద్దుపోయాక జిరిబమ్‌జిల్లా బాబుపరలో ఆస్తులు ధ్వంసం చేయడం ప్రారంభించారు.దాంతో భద్రతాదళాలు కాల్పులు జరపడంతో ఒకరు మరణించారు. ఐతే ఎవరు కాల్పులు జరిపారన్న విషయం ఇంకా తేలలేదని పోలీసు ఉన్నతాధికారి చెప్పారు. మృతుణ్ణి 20 ఏళ్ళ యువకుడు కె.అథౌబాగా గుర్తించారు. జిరిబమ్‌లో స్వతంత్ర ఎంఎల్‌ఏ ఇంటిని ప్రదర్శకులు దోచుకున్నారు. ఇంట్లో ఉన్న ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఆస్తులు ధ్వంసం చేశారు. దహనం చేశారు. కాంగ్రెస్, బిజెపి కార్యాలయాలను ధ్వంసం చేశారు. ఈ ఘటనకు ముందు ఆదివారం ఉద యం జిరిబమ్ పట్టణంలో ఒక మృతదేహాన్ని కనుగొన్నారు. మృతుడు ఎవరో ఇప్పటివరకూ గుర్తించలేదు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలో ఉంచారు. ఇదిలాఉండగా మరోవైపు ఇప్పటికే జిరిబమ్‌లో అదృశ్యమై శవాలుగా మారిన ఐదు మృతదేహాలకు పోస్టుమార్టమ్ చేసే పనులు అసోంలోని సిల్చార్ పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తి చేసినట్లు అధికారవర్గాలు తెలియజేశాయి. ఈనెల 11న సిఆర్‌పిఎఫ్ జవానులకు, కుకి–జో ఉగ్రవాదులకు మధ్య జరిగిన కాల్పుల్లో పదిమంది ఉగ్రవాదులు మరణించిన ఘటన తర్వాత జిరిబమ్‌లో అదృశ్యమైన ఆరుగురిలో ఐదుగురు మృతదేహాలు జిరిబమ్‌లోని జిరీ నది ఒడ్డున, అసోం కాఛర్‌లోని బరక్ నది ఒడ్డున లభించాయి. వీరంతా గడచిన కొద్దిరోజులుగా జాడతెలియకుండా పోయారు. బాగా కుళ్ళివాసన వస్తున్న దశలో ఈ మృతదేహాలను పోలీసులు కనుగొన్నారు. పోస్టుమార్టం నివేదికను వైద్యులు తయారుచేస్తున్నారని వర్గాలు తెలియజేశాయి.

**మణిపూర్‌కు 5 వేలమంది పారామిలిటరీ దళాలు: అమిత్ షా సమీక్ష**

మణిపూర్‌లో క్షీణించిన భద్రతా పరిస్థితులపై కేంద్రహోంమంత్రి అమిత్ షా వరుసగా రెండో రోజు సోమవారంనాడు కూడా సమీక్ష జరిపారు. శాంతి భద్రతల పునరుద్ధరణపై దృష్టిసారించాలని ఉన్నతాధికారులకు ఆదేశించారు. అదేవిధంగా మణిపూర్‌కు అదనంగా మరో ఐదువేలమంది పారామిలిటరీ దళాలను తరలిస్తున్నారు. గత ఏడాది మే నెల నుండీ మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతూనే ఉంది. తరచు హింసాకాండ చెలరేగుతూనే ఉంది. తాజా నిర్ణయం ప్రకారం ఐదువేల మందితో కూడిన 50 కంపెనీలను కేంద్ర ప్రభుత్వం మణిపూర్‌కు తరలిస్తున్నది. ఈనెల 12న కేంద్ర హోం వ్యవహారాలశాఖ 20 అదనపు సిఏపిఎఫ్ కంపెనీలను, 15 సిఆర్‌పిఎఫ్, ఐదు బిఎస్‌ఎఫ్ కంపెనీలను పంపింది. తాజా నిర్ణయం అందుకు అదనం.

**మణిపూర్‌లో పర్యటించండి మోదీకి కాంగ్రెస్ డిమాండ్**

కల్లోలిత మణిపూర్ రాష్ట్రంలో పర్యటించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కాంగ్రెస్‌పార్టీ మరోసారి విజ్ఞప్తి చేసింది. మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్ వెంటనే పదవికి రాజీనామా చేయాలని కోరింది. పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కావడానికి ముందుగానే మోదీ ఆ రాష్ట్రంలో పర్యటించి రావాలని కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ కమ్యూనికేషన్ల విభాగం ఇన్‌ఛార్జి జైరామ్ రమేశ్ మోదీని కోరారు. ప్రధామంత్రి తప్పనిసరిగా మణిపూర్‌కు చెందిన అఖిలపక్ష బృందాన్ని కలుసుకుని వారి డిమాండ్లను, అక్కడి పరిస్థితులను తెలుసుకోవాలని ఢిల్లీలోని ఏఐసిసి కార్యాలయంలో జరిగిన పత్రికాగోష్టిలో కోరారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com